1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

యు.జి.సి.
గుర్తింపు పొందిన
తెలుగు పత్రిక
(http://ugccare.unipune.ac.in)
సంపుటి 7
సంచిక 1
పుటలు 52
రు.25 లు
తెనాలి

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

నుడి నాడు నెనరు

మార్చి 2021

కనుమరుగైన తెలుగు పెద్దలు



సంగమనేని నారాయణ
భాష-బోధన-రచన-ఉద్యమస్ఫూర్తి



భారతీయ భాషల సాధికారతకై 'బెంగళూరు తీర్మానం' పిలుపు

రాజ్యాంగం గుర్తించిన 22 భాషలనూ అధికారిక భాషలుగా గుర్తిస్తూ రాజ్యాంగసవరణ చెయ్యాలి.



పోరంకి దక్షిణామూర్తి
భాష-పరిశోధన-రచన




ముసునూరి కాపయ నాయకుడు



శ్రీరామగిరి లోని సుందరరాముడి గుడి

పోలవరం నిర్మాణంతో మునిగిపోనున్న చరిత్ర గుర్తులు

గతవైభవం పేరిట, దేవుళ్ళ పేరిట, కులాల పేరిట కొట్టుకుంటున్న వర్గాలు
ఈ చారిత్రక సంపదను భద్రపరుచుకోకపోతే భావితరాలు చరిత్రహీనులైపోతారు.
పోలవరం ప్రాజెక్టుకు గేట్లు బిగింపు, నిర్వాసితుల తరలింపు జరుగుతున్నంత
వేగంగా ఈ శిధిలాల సేకరణ, మ్యూజియం నిర్మాణం,
దేవాలయాల పునఃప్రతిష్ఠ కూడా జరగాలి



గుత్తి చంద్రశేఖరరెడ్డి
తెలుగు ఉనికి పోరాట స్ఫూర్తి

తెలుగుభాష ఆశయప్రకటన - ఐదు సూత్రాలు

తెనాలిలో - అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవం
'తెలుగుభాష ఆశయప్రకటన' పత్రం విడుదల



తెనాలిలో-ఫిబ్రవరి 20వ తేదీన అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవసభ శ్రీవివేకానంద సెంట్రల్ స్కూల్ అడిటోరియంలో ఉదయం 11గం॥లకు జరిగింది. పాఠశాల నిర్వాహకుడు శ్రీ రావిపాటి వీరనారాయణ సభకు అధ్యక్షత వహించారు. తెలుగు భాషోద్యమ సమాఖ్య తెనాలి శాఖ అధ్యక్ష కార్యదర్శులు డా॥ సామల లక్ష్మణబాబు, శ్రీ యర్రంశెట్టి హనుమంతరావు సభను నిర్వహించారు. సభలో సమాఖ్య జాతీయ అధ్యక్షుడు డా॥సామల రమేష్‌బాబు, భారత భాషాసంఘం జాతీయ అధ్యక్షుడు ప్రొ॥గారపాటి ఉమామహేశ్వరరావు అతిధులుగా పాల్గొని ప్రసంగించారు. సమాఖ్య కార్యదర్శి డా॥వి.సింగారావు, అందరితో కలసి 'తెలుగుభాష ఆశయప్రకటన' పత్రాన్ని విడుదల చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





విజ్ఞాన్ విశ్వవిద్యాలయం - ఫార్మసీకాలేజీలో











గుంటూరుజిల్లా-వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయం ఆవరణలో ఫార్మసీ కళాశాలలో ఫిబ్రవరి 20న మధ్యాహ్నం 3గం॥లకు అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవం సందర్భంగా జరిగిన సభాదృశ్యం. ప్రిన్సిపాల్ డా॥ పి.శ్రీనివాసబాబు అధ్యక్షత వహించగా డా॥ సామల రమేష్‌బాబు, ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు ప్రసంగించారు. త్వరలో దేశమంతటా సాంకేతిక, వృత్తి విద్యాకళాశాలలను మాతృభాషామాధ్యమంలో కూడా నిర్వహించాలని కొత్త జాతీయ విద్యావిధానం ప్రకారం కేంద్రం ప్రకటించిన దృష్ట్యా ఈ సమావేశం ప్రత్యేకతను సంతరించుకొంది. విద్యార్ధులు ఆసక్తిని ప్రదర్శించారు.

- తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
- తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
- ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి



మార్చి 2021

రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట -రచనను ఏ రూపంలో నైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి. వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్‌చేసి *editorammanudi@gmail. com* కు పంపాలి. కొరియర్ / రిజిస్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరు నామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

4. రచన సొంతమేనని, ఇతర పత్రికల కుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ రచనతో జోడించాలి. ముందుగా సోషల్ మీడియాలో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించలేము.

5.దయచేసి ప్రచురణ కోసం పంపే రచనలను, వార్తలను ప్రతి నెల 15వ తేదీలోపుగా మాకు చేరునట్లు పంపి సహకరించండి. 20వ తేదీ దాటిన తరువాత చేరే వాటిని పరిశీలించడం ఇబ్బంది అవుతుందని గమనించండి.

లోపలి పుటలలో....

కార్టూన్లు	బొమ్మలు	కంప్యూటర్
సరసి	**చిదంబరేశ్వరరావు**	**బండారు రఘురాం**

వలగూడు (ఇంటర్నెట్)లో *www.ammanudi.org* చూడండి.

రచనలను, వార్తలను, వాట్సయాప్‌లో పంపవద్దు: 'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలను కొందరు వాట్సయాప్ (WhatsApp) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు స్వీకరించలేము. దయచేసి కొరియర్‌లో / రిజిస్టర్డ్ పోస్టులో, లేదా **editorammanudi@gmail.com** కు పంపించండి. - సంపాదకుడు

రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి,** జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ-520004.

కార్యాలయం : *0866-2439466* సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

నుడి నాడు నెనరు — మాసపత్రిక

చందా వివరాలు

జీవిత చందా	:	రూ.5000
4 సం॥ చందా	:	రూ.1000
1 సం॥ చందా	:	రూ. 300

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు చెక్కు లేదా డి.డి.ని **'తెలుగుజాతి'** పేర పంపాలి.

బ్యాంక్‌ఖాతా, ఫోను వివరాలు

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'తెలుగుజాతి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

TELUGU JAATHI - AXIS BANK, TENALI

అక్కౌంట్ నెం. **914020020387880**

IFSC Code : UTIB0000556

గూగుల్ పే/ ఫోన్ పే

ద్వారా కూడా చందాను చెల్లించవచ్చును

ఆన్‌లైన్‌లో చందాను పంపేవారు వెంటనే ఇంటినెంబరు, వీధి పేరు, పోస్టాఫీసు, ఊరిపేరు, పిన్‌కోడ్ నెంబరుతో సహా తమ పూర్తి చిరునామాను, ఫోన్ నెంబరు, మెయిల్ ఐడి తదితర వివరాలను జాబు ద్వారా తెలుపగలరు.

94929 80244 ఫోన్‌కు సందేశం గాని, వాట్స్‌యాప్ ద్వారా గాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తరప్రత్యుత్తరాలకు చిరునామా

డా॥ సామల లక్ష్మణబాబు, ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి,**
గుంటూరు జిల్లా - 522 211.
ఫోన్ : 94929 80244
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

చందాదారులకు సూచనలు

1. చందా కాలం, ముగింపు తేదీ- పత్రిక కవరుమీద మీచిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా కాలం ముగిసిపోయిన తర్వాత పత్రిక పంపబడదు. దయచేసి వెంటనే చందా పైకం పంపి, చందాను కొనసాగించుకోగోరుతున్నాము.
3. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
4. మీ ఇంటి నెంబరుతో సహా పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలుపండి.
5. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.
6. 'అమ్మనుడి' పత్రికను చందాదారులకు మాత్రమే పోస్టులో పంపించగలము. బయట ఎక్కడా అంగళ్లలో అమ్మకమునకు పెట్టడంలేదు. కనుక కావలసినవారు దయచేసి చందాదారులుగా చేరవలసిందిగా కోరుతున్నాము. చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలియజేయండి.

'అమ్మనుడి' పత్రికను నడపడం ఆర్థికంగా ఎంతో ఇబ్బందిగా ఉంది. చందాలే ముఖ్య ఆధారంగా ఉన్నది గనుక - మీరు చందాదారులుగా చేరడంతో పాటు, మీ మిత్రులను, సంస్థలను ప్రోత్సహించి వారిని చందా దారులుగా చేర్పించగోరుతున్నాము.

-ప్రచురణకర్త

ప్రోత్సాహకులుగా చేరండి

రు. 10,000/-లు, ఆపైన- విరాళంగా పంపి, 'తెలుగుజాతి ట్రస్టు'కు ప్రోత్సాహకులుగా మాతో చేరి సహకరించగోరుతున్నాము. అట్టి 'ప్రోత్సాహకులకు' పత్రికను శాశ్వతంగా పంపుతూ, ట్రస్టు ప్రచురించే ఇతర పుస్తకాలను కూడా వారికి సాదరంగా పంపగలము. దయచేసి మీరు ప్రోత్సాహకులుగా చేరి మా కృషికి తోడ్పడగోరుతున్నాము.

తెలుగుజాతి (ట్రస్టు) ప్రచురణ

సంపుటి : 7 సంచిక : 1
అమ్మనుడి
మార్చి 2021

సంపాదక హృదయం

తెలుగుభాష ఆశయప్రకటన – 5 సూత్రాలు

తెలుగు భాషోద్యమ సమాఖ్య ఆవిర్భవించి 2021 ఫిబ్రవరి 21 నాటికి 18 ఏళ్లు పూర్తయింది. తెలుగును కాపాడుకోవాలన్న ఆందోళన అప్పటికే తెలుగు వారిలో ఉంది. దానికి ఒక తీరూతెన్నూ కలిగించాలనే ఆలోచనతో కొందరు పెద్దలు తమకు తోచిన రీతిలో పని మొదలుపెట్టారు. ఈ అనుభవాల కొనసాగింపుగా కొందరు పెద్దలు పూనుకొని కృష్ణాజిల్లా శ్రీకాకుళంలో 2002 నవంబరు 1,2 తేదీలలో నిర్వహించిన తెలుగు భాషోద్యమ సమాలోచన శిబిరం, తెలుగు భాషోద్యమ సమాఖ్యను ఏర్పాటు చెయ్యాలని నిర్ణయించింది. 2000 సం.లో యునెస్కో వారు ప్రపంచంలోని భాషా జాతులవారందరికీ ఇచ్చిన పిలుపుననుసరించి ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవాన్ని జరుపుకోవలసి ఉంది. ఆరోజునే సమాఖ్యను ప్రారంభించాలని పెద్దలు నిర్ణయించారు. 2003 ఫిబ్రవరి 21న హైదరాబాదులో 'తెలుగు భాషోద్యమ సమాఖ్య' ఆవిర్భవించింది. శ్రీకాకుళం శిబిరంలో చర్చించి కొన్ని తీర్మానాలను విడుదల చేసింది. వాటి ప్రాతిపదికగా సమాఖ్య అప్పటి నుండీ పనిచేస్తూ, కాలక్రమంలో ఎదురైన అంశాలను కూడా చేపడుతూ ముందుకు సాగుతున్నది.

ఉద్యమాల దారిలో అవగాహన నుండి ఆచరణ వరకూ ఎన్నో సవాళ్లు ఎదురవుతూంటాయి. అందునా, తెలుగు ప్రజలు తమ సుదీర్ఘమైన చరిత్రలో ఎదుర్కొన్న సమస్యలు, సవాళ్లూ అడుగడుగునా ప్రభావం కలిగిస్తూనే ఉంటాయి. సామాజిక, రాజకీయ సమస్యల ప్రభావం ఎక్కువ. రాజుల కాలంనాడు, వలసపాలకుల పరిపాలన కాలంలోనూ ప్రజలకు భాషతో ఉన్న అవసరాలు ఎన్నో పరిమితుల మధ్య ఉండిపోయాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ఏర్పడిన తర్వాత – విద్య యొక్క అవసరం ఎన్నోరీతుల్లో విస్తరిస్తుండడం వల్ల భాష యొక్క అవసరం కూడా ఎంతో విస్తరించింది. ప్రజలు తమ భాషలో తమను తాము పరిపాలించుకోవడం, తమ భాషలోనే అనంత విజ్ఞానాన్ని ఆకళింపు చేసుకోవడం, అన్ని జీవనరంగాల్లో అందరూ వికసించడం – ఇవీ ప్రజాస్వామ్యానికి కొలమానాలు. స్వాతంత్ర్యానికి సారాంశమూ ఇదే! ఇందుకోసమే బహుభాషలు గల భారతదేశంలో భాషారాష్ట్రాలు ఏర్పడ్డాయి. భౌగోళిక, రాజకీయ, పాలనా కారణాలవల్ల ఒకే భాషీయులైనా పలు రాష్ట్రాలు ఉండవచ్చునేది ప్రజాస్వామికతలో భాగంగా గుర్తించవలసిన అంశం. అన్ని అంశాల అవగాహనతో తెలుగుభాషోద్యమ సమాఖ్య ముందుకు సాగుతున్నది.

అయితే రెండు తెలుగు భాషా రాష్ట్రాలు ఏర్పడిన తర్వాత కూడా సొంత పాలకులే ప్రజలను మోసం చేశారు. ఇంకా చేస్తూనే ఉన్నారు. భాషారాష్ట్రాల మౌలికతనే దెబ్బతీస్తూ పాలన సాగించారు, సాగిస్తున్నారు. ఇందువల్లే, సమైక్యంగా ఉండాలనే బలమైన కోరిక 60ఏళ్లకే విచ్ఛిన్నమైంది. అయినా రెండు రాష్ట్రాల్లోనూ భాషకు సంబంధించిన మౌలిక అవసరాలను విస్మరించడం కొనసాగుతూనే ఉంది. భాషను కోల్పోతే జాతి నశిస్తుంది. ఆ భావనను కోల్పోయిన ప్రజలలో సమైక్య చైతన్యం అణగారుతుంది. ఇదే ఇప్పుడు మనకు అన్ని రంగాల్లోనూ అనుభవంలోకి వస్తున్నది.

తెలుగు భాషోద్యమ సమాఖ్యను మొదలు పెట్టిన నాటికీ నేటికీ సమస్యల విస్తృతి పెరిగింది. సమాఖ్య ఎన్నో పోరాటాలు చేసినా పాలకుల్లో మార్పులేదు. ప్రజల్లో మాత్రం సమస్యల అవగాహన పెరిగింది. కాని, చైతన్యంతో ముందుకు సాగి సమస్యల పరిష్కారానికి పూనుకోవలసి ఉంది. ఇందుకోసం చైతన్యవంతులైన వారు చొరవ తీసుకోవాలి. ఇప్పటికే ఆందోళనతో ముందుకు వచ్చి పనిచేస్తున్న వ్యక్తులతోపాటు కొన్ని సంఘాలు ఉన్నాయి. దురదృష్టవశాత్తూ వీరిలో కలిసికట్టుతనం లేదు. ఈ విషయంలో సమాఖ్య కూడా వీరిని కలుపుకురాలేకపోయింది. ఇందుకు అనేక కారణాలున్నాయి. సమస్యల మౌలిక

అవగాహనలో స్పష్టత రావలసి ఉంది.

కొందరి దృష్టిలో భాష అవసరం సాహిత్యం వరకే. చాలామంది రచయితలు ఇంతవరకే ఆలోచిస్తున్నారు. పాలకవర్గాలు అంటే రాజకీయ నాయకులు తమ ప్రసంగాల్లో ఈ విషయంపై మాట్లాడరు. ఇంతకాలంగా ప్రభుత్వాల, మేధావుల పట్టనితనం వల్లా, స్వార్థపూరిత విధానాల వల్ల, ఇప్పుడు విద్యా, పాలనారంగాలు బాగా కలుషితమైపోయాయి. మాతృభాష ఎంతవరకు తమ అవసరాలకు పనికొస్తుందో అంతవరకు వాడుకొని వదిలేయడం ఒక అలవాటైపోయింది. ప్రభుత్వ నేతల్లో ఎవ్వరికీ తెలుగును పోటా పోటీగా అభివృద్ధి చేద్దామనే సంకల్పమే లేదు. పొరుగు రాష్ట్రాలను చూచి గాని, ఇతర దేశాలను చూచిగాని నేర్చుకోవడానికి సిద్ధంగా లేరు. 'నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు' అనుకొంటున్నారు!

ఇలాంటి పరిస్థితుల్లో – భాషోద్యమకారులే కాదు, చైతన్యం కలిగిన ప్రజలు ముందుకు రావాలి. ప్రజాస్వామ్యం గురించీ రాజ్యాంగం గురించీ ప్రాథమిక హక్కుల గురించీ మాట్లాడే సంస్థలు, సామాజిక కార్యకర్తలు, ఈ పరిస్థితినెందుకు పట్టించుకోరో అర్థం కాదు! ప్రజల ప్రాణం వంటి భాషయొక్క ప్రజాస్వామిక అవసరాలను గుర్తించరా? విద్య, పాలనారంగాల్లో మాతృభాషను కాపాడుకోవడంతో ప్రజల భవిష్యత్తు ముడిపడి ఉందనీ, ఇదెంత మాత్రం కేవలం సాహిత్యాంశం కాదనీ అందరూ గుర్తించాలి.

తెలుగు వారందరూ తమ రోజువారీ వ్యవహారాలను తెలుగులో జరుపుకోగలగడంతో పాటు, తామొక భాషాజాతిగా అన్ని రంగాల్లో వికసిస్తూ దేశంలోనూ ప్రపంచంలోనూ పోటీకి నిలబడగల అభివృద్ధి చెందిన జాతిగా బలపడాలి. ఇందుకోసం తెలుగు భాషోద్యమ సమాఖ్య 'అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం' సందర్భంగా ఒక ఆశయప్రకటనను ముందుకు తెస్తున్నది. దీనిని ఈ సంచికలో ఇస్తున్నాము. పరిశీలించండి. ఇది కేవలం సమాఖ్య సంస్థకు సంబంధించిన కార్యక్రమం కాదు; అందరికీ సంబంధించిన పిలుపు– ప్రజలందరికీ పిలుపు.

ఇందులో వివరించిన 5 సూత్రాల్లో ఎవరికి వీలైన రంగాల్లో వారు వ్యక్తులు గానూ, సమూహాలుగానూ, సంఘాలుగానూ ముందుకు సాగి చైతన్యంతో కృషిచేయాలని కోరుతున్నాం.

భాషను రక్షించుకోవడమంటే ప్రజలను రక్షించుకోవడం... వారి ఆత్మగౌరవాన్ని, వారి వారసత్వ సంపదను, బ్రతుకుల్ని, అవసరాలను, భవిష్యత్తునూ పదిలపరుచుకోవడం... వారి మానవ హక్కుల్నీ, శక్తినీ గౌరవించడం... వారి స్వాతంత్ర్యాన్ని కాపాడడం. ఈ అవగాహనతో ముందుకు సాగాలి తప్ప ఇదేదో సాహిత్యానికి, సంగీతానికి, పాండిత్యానికీ సంబంధించిన అంశంగా చూడకూడదు. సొంత భాషతో సాధించేదే అభివృద్ధి అవుతుంది... పరాయిభాషలకు దాసులమై, మనను మనమే మోసగించుకోవడంతో కాదు.

తెలుగు భాషోద్యమ సమాఖ్య మన ముందుకు తెచ్చిన ఈ ఆశయప్రకటననూ 5 సూత్రాలనూ అందరూ సొంతం చేసుకోండి. దీన్ని అందరి కార్యక్రమంగా తీసుకోండి.

తేదీ : 28–02–2021

సామల రమేష్‌బాబు

STATEMENT ABOUT OWNERSHIP AND OTHER PARTICULARS OF **"AMMANUDI",** MONTHLY MAGAZINE, **Tenali** as required under Rule 3 of the Registration of News Papers (Central) Rules 1956.

FORM IV (See Rule 3)

1. Place of Publcation	:	Angalakuduru
2. Periodicity	:	Monthly
3. Printer's Name	:	SAMALA LAKSHMANA BABU
4. Whether Citizen of India	:	Yes
5. Address	:	D.No.8-386, Angalakuduru Post, Tenali Mandal - 522 211 Guntur Dist., A.P.
6. Publishers Name	:	SAMALA LAKSHMANA BABU
Address	:	As above
7. Editor's Name	:	SAMALA RAMESH BABU
Address	:	As above
8. Names & Addresses of individuals who own the News Paper	:	SAMALA LAKSHMANA BABU As above

I, Samala Lakshmana Babu, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Tenali
28-2-2021

sd/- S. Lakshmana Babu
Publisher

తెలుగు భాషోద్యమ సమాఖ్య

ఎల్లనాడుల అమ్మనుడుల పండుగ

21-02-2021 సందర్భంగా

తెలుగుభాష ఆశయప్రకటన

తెలుగువారందరూ తమ రోజువారీ వ్యవహారాలను తెలుగులో జరుపుకోగలగాలి.

ఈ అందమైన కలను నిజం చేసుకోవడానికి 5 సూత్రాలు!

ఆధునిక స్థాయిని సాధించేందుకు దారిదీపాలు!!

ఈ నేల మీద ప్రతి జీవి తన సొంతభాషలో జీవనం సాగిస్తుంది. మానవులు కూడా ఎవరి భాషలో వారు తాము కోరుకున్నంత ఆనందకరమైన, సౌకర్యవంతమైన జీవనాన్ని సాగించగలగాలి. అందుకు మొదటి మెట్టు అమ్మనుడిలో చదువులు. ఆపై అమ్మనుడిలో సమాచార అందుబాటు, రోజువారీ వ్యవహారాల జరుగుబాటు అనేవి మలిమెట్లు.

తెలుగువారందరూ తమ రోజువారీ వ్యవహారాలను తెలుగులో జరుపుకోగలగాలి.

మనకు తెలిసిన మాటలతో ఉన్న ఈ స్వప్నం తేలికగా కనబడవచ్చు కానీ దీనికి లోతూ వెడల్పూ ఎక్కువ! ఈ స్వప్నం లోని మాటలను వివరంగా చూస్తే:

తెలుగువారు: నివసిస్తున్న ప్రాంతం ఏదైనా, తెలుగు ఇంట్లో పుట్టినవారు తెలుగువారు. (భార్యాభర్తల్లో ఒక్కరైనా తెలుగువారైతే అది తెలుగు ఇల్లే.) పుట్టుకతో సంబంధం లేకపోయినా, నేను తెలుగబ్బాయిని/తెలుగమ్మాయిని అనుకునేవారు కూడా తెలుగువారే!

అందరూ: ఏ కొద్దిమందో, ఏ కొన్నిచోట్లో తెలుగులో వ్యవహారాలు జరుపుకునే వెసులుబాటు ఉంటే సరిపోదు. ఈ సౌలభ్యం తెలుగువారందరికీ ఉండాలి. (కృత్రిమ మేధ-ఎ.ఐ. మెరుగైతే, నివసిస్తున్న ప్రాంతంతో సంబంధం లేకుండా తెలుగువారందరూ కూడా ఈ వెసులుబాటు పొందగలుగుతారు.)

రోజువారీ వ్యవహారాలు: బడికెళ్ళే పిల్లవాడికీ, వాడికి చదువుచెప్పే గురువుకీ చదువు రోజువారీ వ్యవహారం. ఉద్యోగం చేసేవారికి ఆఫీసు పని రోజువారీ వ్యవహారం. వ్యాపారస్తులకు వ్యాపార లావాదేవీలు రోజువారీ వ్యవహారం. అందరికీ వినోదం తదితర సమాచార అవసరాలు రోజువారీ వ్యవహారం.

తెలుగులో: అంటే, ఆయా ప్రాంతాల్లో ఆయా కాలాల్లో వాడుకలో ఉన్న మాటలతో తెలుగు లిపిలో ఉండాలి. వారి సొంత యాసలో బాసలో వారికీ, వారి చుట్టుపక్కలవారికీ అలవాటైన, సౌకర్యవంతమైన రీతిలో అని.

జరుపుకోగలగాలి: 'కలగాలి' అంటే రెండు అర్థాలు: ఒకటి, తెలుగులో జరుపుకోవాలి అని ఎవరూ శాసించకుండానే, స్వచ్ఛందంగా ప్రజలు అనుకొని జరుపుకోవడం. రెండు, అందుకు తగ్గ పరిస్థితులు, సదుపాయాలు మనకు మనం కల్పించుకోవడం.

ఈ కల నిజమవడానికి 5 సూత్రాలు:

- **అమ్మనుడిలో చదువులు:** పసి చదువుల నుండి పట్టా చదువుల వరకు. ప్రభుత్వ, ప్రయివేటు బడులలోనూ.
- **తెలుగులో పరిపాలన, న్యాయం:** ప్రజలే ప్రభువులైన ప్రజాస్వామ్యంలో ప్రజల భాషలో పరిపాలన, న్యాయపాలన జరగాలి.
- **తెలుగులో వస్తు సేవలు, వ్యాపార వ్యవహారాలు:** మనం డబ్బు పోసి, కొంటున్న వస్తూత్పత్తులు, పొందుతున్న సేవలు మన భాషలో ఆశించడం తప్పు కాదు. అది మన హక్కు.
- **తెలుగులో వినోద, విజ్ఞాన, వికాస సమాచారం:** ఆటపాటలే కాదు, మానవులుగా మనం ఎదగడానికి కావలసినదంతా తెలుగులోనూ ఉండాలి. లేకపోతే, తెచ్చుకోవాలి.
- **తెలుగులో సంపాదన అవకాశాలు:** రెండు తెలుగు రాష్ట్రాల్లో పదికోట్లు పైనున్న తెలుగువారికి కావలసినవన్నీ (పైవన్నీ) తెలుగులో అందించడంలో తెలుగువారు మాత్రమే అందుకోగలిగే అంతులేని అవకాశాలు ఉన్నాయి.

బాధ్యులు-బాధ్యతలు

ప్రజలు

"దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్" అనే నినాదంతోపాటు మనం **"భాషంటే దాన్ని మాట్లాడే ప్రజలోయ్"** అని కూడా చెప్పుకోవాలి. ఇదంతా మన కోసమే. మన భాష మన బాధ్యత. ఏదైనా మనం సంపాదించుకున్నది, తయారుచేసినది అయితే వదిలేసుకునే, పాడుచేసుకునే స్వేచ్ఛ మనకు ఉంటుంది. కానీ మన భాష అలా కాదు. ఇది మనకు తరతరాలుగా వారసత్వంగా వచ్చింది. మనకు అందించబడింది. దాన్ని పెంచి, పోషించి ముందు తరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉంది. లేదా కనీసం మనం అందుకున్న స్థితి లోనే ముందు తరాలకు అందించాలి.

- తోటి తెలుగు వారితో తెలుగులోనే మాట్లాడుదాం. అసలు ఎవరితోనైనా సంభాషణ తెలుగులో మొదలుపెడదాం. ఎదుటివారికి తెలుగు రాదు అని ముందే ఊహించేసుకుని రాని భాషలో ఇబ్బంది పడొద్దు. తెలుగు నేలలో తెలుగులో వ్యవహరించడం సహజం. మనం మరీ వంగిపోనవసరం లేదు.

- సామాజిక మాధ్యమాలలోనూ విరివిగా తెలుగులో రాద్దాం. వాట్సాప్, ఫేస్‌బుక్ లాంటి వాటిల్లోనూ తెలుగులో రాద్దాం. కాలక్షేపం కబుర్లు, సినిమా రాజకీయ తదితర సమకాలీన అంశాలు మాత్రమే కాక మరికొంచెం గంభీరమైన విషయాలపై కూడా తెలుగులో రాద్దాం. వచనం, పాటలు, పద్యాలు, కవితలు, వ్యాసాలు ఏవైనా!

- వ్యాపార సంస్థలను వారి ఉత్పత్తులను, సేవలను తెలుగులో అందించమని అడుగుదాం. ఇప్పటికే తెలుగులో ఉన్న ఉత్పత్తులను ప్రోత్సహిద్దాం . సేవలను తెలుగులో వాడుకుందాం. ఆయా సంస్థల వినియోగదారుల సహాయ కేంద్రాల ద్వారా తెలుగు కావాలని మన ప్రతిస్పందనలలో తెలియజేద్దాం.

- నేటికీ కంప్యూటర్లలోనూ, చరవాణుల్లోనూ తెలుగు ఎలా రాయాలో తెలియనివారు చాలా మంది ఉన్నారు. మన చుట్టుపక్కల వారికి మనం సాంకేతిక సహాయం అందిద్దాం. మనం నిపుణులం అయివుండాల్సిన పనిలేదు. మనం తెలుగు ఎలా టైపుచేస్తున్నామో, చిన్నచిన్న సమస్యలను ఎలా అధిగమిస్తున్నామో చెప్తే సరిపోతుంది.

- పిల్లలకు, యువతరానికి తెలుగును చేరువచేసేందుకు వారికి ఉపయోగపడే బాల సాహిత్యం, కథలతో పాటు వారు ఎదుర్కొనే సమస్యలపై, సవాళ్ళపై చర్చలు, వ్యాసాలు, తదితరాలు రాద్దాం. వాటిని యువతరం మాధ్యమాలలో (వలగూళ్ళు, యూట్యూబు, ఇన్‌స్టాగ్రామ్, మున్నగువాటిలో) ప్రసారం, ప్రచారం చేద్దాం.

- సంస్థాగతంగా తెలుగు కోసం పనిచేయాల్సిన సంస్థలను వారిని పని చేయమని ముల్లుగర్రతో పొడవడం కూడా మన బాధ్యతలో భాగమే. ఆయా వ్యవస్థలు కాడి వదిలేసినప్పుడు అవసరమైతే మనం భుజం కాయాలి, ఆ వ్యవస్థలను గాడిలో పెట్టుకోవాలి.

ప్రభుత్వం - శాసన, పరిపాలన, న్యాయ వ్యవస్థలు

ప్రజల తర్వాత వారిపై అత్యంత ప్రభావాన్ని చూపించే వ్యవస్థలు ఇవి. ఈ వ్యవస్థలు తెలుగు భాషలో నడుస్తూ, వాటి విధానాలు తెలుగు భాషకు అనుగుణంగా ఉన్నప్పుడే మన లక్ష్యం నెరవేరినట్టు.

- చట్టసభల్లో చర్చలూ, చట్టాల రూపకల్పనా తెలుగులో జరగాలి.

- ప్రభుత్వ ఉత్తర్వులు, నియమ నిబంధనలు, విధాన ప్రకటనలు, సంక్షేమ పథకాలు, తాఖీదులు, రశీదులు, ఇతరత్రా సమాచారం అంతా ప్రధానంగా తెలుగులోనే ఉండాలి.

- పరిపాలన, ప్రభుత్వ అంతర్గత వ్యవహారాలు, పద్దులు, రికార్డులు అన్నీ తెలుగులోనే జరగాలి.

- న్యాయస్థానాల్లో వాదప్రతివాదనలు తెలుగులో జరగాలి. తీర్పులను తెలుగులో వెలువరించాలి.

- ప్రభుత్వం, దాని విభాగాలు ప్రజలకు అందించే సమాచారం, ప్రజాసంబంధాల నిమిత్తం నిర్వహించే అన్ని రకాల కార్యకలాపాలు (రేడియో టీవీ ప్రోగ్రాములు, వార్తా లేఖలు, సామాజిక మాధ్యమాలలో ప్రచారం మొదలైనవి) అన్నీ తెలుగులో ఉండాలి.

ముద్రణ, ప్రసార, వలగూడు(వెబ్) మాధ్యమాలు

ప్రజల మధ్య, సమాజంలోని తతిమా వ్యవస్థల మధ్య అంతరాల్ని పూడ్చి సంభాషణా వారధులుగా వ్యవహరించేవే మాధ్యమాలు. వీటికి ఉన్న ప్రాధాన్యత లేదా అవి పోషించే పాత్ర మూలంగా వీటిని 'ఫోర్త్ ఎస్టేట్'గా వ్యవహరించారు. తెలుగు భాషకు ఆధునిక స్థాయిని సాధించడంలో కూడా వీటిదే కీలక పాత్ర.

- **వినోదం:** సినిమాలు, టీవీ కార్యక్రమాలు, నాటకాలు, స్వతంత్ర మాధ్యమాలలో తక్కువ నిడివి సినిమాలు, కథలు, కవితలు, కార్టూనులు వంటివి అన్నీ తెలుగులో ఉండాలి. ఇప్పటికే ఇవన్నీ తెలుగు లోనే ఉన్నా వీటి సృష్టి ఇతర భాషలతో పోలిస్తే తెలుగులో చాలా తక్కువ. తెలుగు వారి 'తలసరి సాంస్కృతిక దిగుబడి' చాలా పెరగాల్సి ఉంది.

- **విజ్ఞానం:** విద్యారంగంలో చూస్తే అన్ని స్థాయిల్లోనూ చదువులు (వృత్తి విద్యలు, దూర విద్యలతో సహా) పూర్తిగా తెలుగులో చదువుకునే అవకాశం ఉండాలి. పరిశోధనలు, పత్ర సమర్పణలు, శాస్త్ర విజ్ఞాన రంగాల్లో పురోగతీ, దానిపై చర్చలూ, సదస్సులూ కూడా తెలుగులో జరగాలి. విద్యేతర రంగాల్లో వివిధ నైపుణ్యాలపై శిక్షణలు, సరికొత్త సాంకేతికతలపై సదస్సులు, చర్చలూ, అనేక అంశాలపై సెమినార్లూ, మొదలైనవి తెలుగులో జరగాలి.

- **సమాచారం:** స్థానిక, ప్రాంతీయ, రాష్ట్రీయ, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో వార్తలూ విశేషాలూ అన్నీ తెలుగులోనూ లభించాలి. కేవలం దినపత్రికలు, వలగూటి పత్రికలే కాకుండా, స్వతంత్ర మాధ్యమాలుగా బ్లాగులు, ట్విట్టర్, యూట్యూబ్ ఛానెళ్లు, పోడ్‌కాస్టులు తెలుగులో విరాజిల్లాలి.

- **వికాసం:** ఆధ్యాత్మికత, తత్వచింతన, నైతిక ధర్మ చింతనలు,

భవిష్యత్తుసాంకేతికతలపై ఆలోచనలు, మానవాళి మనుగడ, ప్రస్థానం ఇలాంటి వాటిపై ఆలోచనలు, చర్చలు, ప్రచురణలు తెలుగులో జరగాలి. మార్పుకై పోరాటం, అన్ని రకాల ఉద్యమాలు వాటి సాహిత్యం అంతా తెలుగులో దొరకాలి.

వ్యాపార, సేవా సంస్థలు

నేటి మార్కెట్ ఆధారిత పెట్టుబడిదారీ వ్యవస్థలో వ్యాపార సంస్థల పాత్ర అంచనాలకు మించిన ప్రాధాన్యం కలది. పెట్టుబడిదారీ వ్యవస్థలోనూ సేవా సంస్థలు నాణేనికి మరోవైపున అన్నట్టుగా వాటి ప్రభావమూ చాలానే ఉంది. వీటి నుండి భాషకు తగిన తోడ్పాటు దక్కినప్పుడే ఆధునిక స్థాయిని సాధించినట్లు.

- తెలుగు రాష్ట్రాల్లో అమ్ముడయ్యే వస్తూత్పత్తులన్నీ (పేర్లూ, వాడుకునే సూచనలు, ఇతరత్రా వివరాలతో సహా) తెలుగులో ఉండాలి. ఇక్కడ అందించబడే సేవలు కూడా తెలుగులో/తెలుగు సమాచారంతో దొరకాలి. వారి వ్యాపార ప్రకటనలూ తెలుగులో ఉండితీరాలి.

- ఈ సంస్థలు ప్రభుత్వాలకు, ప్రభుత్వ విభాగాలకు దాఖలు చేసే నివేదికలు, వాటి పెట్టుబడిదార్లకు, వాటాదార్లకు, ఇతరత్రా భాగస్వాములకు, ప్రజలకు సమాచారం నిమిత్తం ప్రచురించే నివేదికలు, పత్రాలు తెలుగులో ఉండాలి.

- తెలుగువారి సంస్థల్లో అంతర్గత కార్యకలాపాలు, పద్దులు, ఖాతా పుస్తకాలువంటివీ తెలుగులో నిర్వహించబడుతూండాలి.

ఇది మన కల. మనం చేరుకోవాల్సిన గమ్యం.

ఇదొక గొప్ప లక్ష్యం.

వాదాలలో పడి, దిక్కుతోచక ఎటుపడితే అటు కొట్టుకుపోకుండా,

మనం చేరాల్సిన తీరాన్ని సూచించే దిక్సూచి ఈ ఆశయ ప్రకటన.

అలసత్వపు చీకటిలో దారిచూపే వేగుచుక్క.

ఈ కలను సాకారం చేసుకోడానికి మనం రూపొందించుకునే

కార్యాచరణను, దాని ఫలితాలను, ప్రభావాన్ని పోల్చి

చూసుకోవాల్సిన

గీటురాయి కూడా ఇదే!


డా॥ సామల రమేష్‌బాబు
9848016136

డా॥ వెన్నిసెట్టి సింగారావు
9393015584

డా॥గారపాటి ఉమామహేశ్వరరావు
9848016136

వీరపనేని వీవెన్
9963029061

రహ్మానుద్దీన్ షేక్
9493035658



ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు
98661 28846

22 భాషలనూ అధికారిక భాషలుగా గుర్తిస్తూ రాజ్యాంగ సవరణ చెయ్యాలి



భారతీయభాషల సాధికారతకై 'బెంగళూరు తీర్మానం' పిలుపు

జాతీయ ప్రజాస్వామ్య కూటమి(ఎన్‌డిఏ) యొక్క ఎజెండా అనే పేరుతో గతంలో, లోకసభ ఎన్నికలు జరిగేముందు (1999) జాతీయ ప్రజాస్వామ్య కూటమి తన ఎన్నికల కార్యాచరణ పత్రాన్ని(మ్యానిఫెస్టో) తయారు చేసింది. ఈ కార్యాచరణ పత్రంలో, తాము గెలిచినప్పుడు తీసుకొనిరాబోయే కొన్ని రాజ్యాంగ మరియు చట్టపరమైన సంస్కరణలను ప్రతిపాదించారు. ఇందులో భాగంగా, నం.25వ అంశం, పేజి 131లో పేర్కొన్న విషయం ఇట్లా ఉంది: "రాజ్యాంగంలోని షెడ్యూల్ 8లో చేర్చబడిన మొత్తం 19 భాషలను అధికారిక భాషలుగా పరిగణించే సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయడానికి ఒక కమిటీని ఏర్పాటు చేస్తాం" అని పేర్కొంది. 2003లో తీసుకువచ్చిన రాజ్యాంగ సవరణద్వారా ఎనిమిదవ షెడ్యూలులో ఉన్నవాటికి మరో మూడు భాషలను చేర్చగా– మొత్తం 22 భాషలు అయినై. పైన ఉటంకించినదానికి అనుగుణంగా మొత్తం 22 భాషలనూ భారత సమాఖ్య అధికార భాషలుగా చట్టబద్ధతను కల్పించేందుకు అనువుగానూ వివిధ భారతీయభాషల మధ్య ఉన్న అసమానత్వాన్ని తొలగిస్తూ, భారత పార్లమెంటు కార్యాచరణను మొదలుపెట్టేందుకు వీలుగా, ఈ యేడాది, **ఫిబ్రవరి 8–9వ తేదీలలో కన్నడ ప్రాధికార సంస్థ అధ్యక్షులు శ్రీ టి. ఎస్. నాగాభరణగారి ఆధ్వర్యంలో, డాక్టర్ వి.పి. నిరంజనారాధ్య కార్యనిర్వహణలో, డాక్టర్ కె. మురలీధర్ కార్యదర్శకత్వంలో బెంగుళూరులో రెండురోజుల చర్చా సమావేశం జరిగింది.** ఆ సమావేశానంతరం, భారతీయ భాషల సాధికారితను సాధించేందుకు వీలుగా ఎనిమిదవ షెడ్యూలులో పేర్కొన్న 22 భాషల ఔత్సాహిక ప్రతినిధులకు అందరికీ ఆమోదయోగ్యమైన తీర్మానం ప్రతిని తయారుచేయడం జరిగింది. ఈ తీర్మానం అనువాదాలను 22 భాషలలోనూ ఫిబ్రవరి 21వ తేదీన నిర్వహించబోయే మాతృభాషా దినోత్సవ సందర్భంగా దేశమంతటా విడుదల చేసేందుకు వీలుగా కన్నడ ప్రాధికార సంస్థ చర్యలు చేపట్టింది. ఈ తీర్మానానికి తెలుగు అనువాదం ఈ కింద ఇస్తున్నాం.

భారతీయ భాషల సాధికారతకు బెంగళూరు తీర్మానం

భాషా హక్కుల కోసం మేము, అన్ని రాష్ట్రాలూ మరియు కేంద్రపాలిత ప్రాంతాల సభ్యులమూ కలిసి మన రాజ్యాంగంలోని ఎనిమిదవ షెడ్యూల్‌లోని జాబితాలోపేర్కొన్న భాషాహక్కుల సమానత్వాన్ని సాధించే అంశంపై చర్చించాము. రెండు రోజుల చర్చల తరువాత, భారత రాజ్యాంగానికి తప్పనిసరిగా ఇందుకు అవసరమైన సవరణను తీసుకురావాలని భారత ప్రభుత్వానికి గట్టిగా పిలుపునిస్తూ ఈ బృందం ఏకగ్రీవంగా "బెంగళూరు తీర్మానాన్ని" ఆమోదించింది.

అయితే, భారత సమాఖ్య అనేక భాషలను మాట్లాడే వ్యక్తులతో కూడి, ప్రతి భాషకూ దానికే స్వంతమైన గొప్ప చరిత్రతోనూ ఆయా భాషలను మాట్లాడే ప్రజల సంస్కృతితోనూ విడదీయరాని అనుబంధం కలిగి ఉంది.

కాగా, భారత రాజ్యాంగం, ఎనిమిదవ షెడ్యూల్‌లో, దేశంలోని అన్ని ప్రాంతాల్లోనూ మాట్లాడే ఇరవై రెండు భాషలను సమాఖ్య యొక్క భాషా వైవిధ్యానికి ఆనవాలుగా గుర్తించింది.

కాగా, **భారత సమాఖ్య, భారత రాజ్యాంగం ప్రకారం రాష్ట్రాల సమాఖ్యగా ఏర్పడింది, ఈ సమాఖ్య లక్షణమే భారత రాజ్యాంగంలోని మౌలిక వైఖరి.**

కాగా, భారత రాజ్యాంగం దేశంలోని పౌరులందరికీ విద్య మరియు ఉపాధికి సమాన అవకాశాలకు హామీ ఇస్తుంది.

అయితే, భారత సమాఖ్య పరిధిలోని విద్యాసంస్థలలోప్రవేశ పరీక్షలనూ, ఉపాధి అవసరాల కోసం అర్హత పరీక్షలనూ నిర్వహిస్తున్న

ప్రస్తుత పద్ధతి – ఎనిమిదవ షెడ్యూల్ ప్రకారం అన్ని భాషలు మాట్లాడేవారి అవసరాలను సరైన రీతిలో తీర్చదు.

సమాఖ్య చేసిన చట్టాలూ నియమాల గురించిన సమాచార హక్కును కలిగి ఉండటమూ వాక్స్వాతంత్ర్యమూ వ్యక్తీకరణ స్వాతంత్ర్యమూ ప్రాథమిక హక్కులో భాగమే – అయితే, **అటువంటి చట్టాలూ నియమాలూ చాలామంది పౌరులకు అర్థంకాని భాషలలో తయారైతే ఆ హక్కులకు భంగం కలిగించినట్లే.**

కావున,ఈ మహత్తరమైన సమావేశంలో ఈ కింది విధంగా తీర్మానించబడింది:

1. ఎనిమిదవ షెడ్యూల్‌లోని అన్ని భాషలనూసమాఖ్య యొక్క అధికారిక భాషలుగా గుర్తించడానికి రాజ్యాంగాన్ని సవరించాలని కేంద్ర పార్లమెంటుకు పిలుపునిచ్చారు.

2. ఎనిమిదవ షెడ్యూల్‌లోని అన్ని అధికారిక భాషలలోనూ చట్టాలూ, నియమాలూ మరియు అధికారిక ప్రకటనలనూ ప్రచురించడానికి, రాజ్యాంగాన్ని సవరించాలని కేంద్ర పార్లమెంటుకు పిలుపునిచ్చారు.

3. ఎనిమిదవ షెడ్యూల్‌లో ఉన్న అన్ని అధికారిక భాషలలోనూ సమాఖ్య పరిధిలోని పదవులలో నియామకాలకు విద్యాసంస్థల ప్రవేశపరీక్షల నిర్వహణకు వీలుగా హామీ ఇవ్వడానికి రాజ్యాంగాన్ని సవరించాలని కేంద్ర పార్లమెంటుకు పిలుపునిచ్చారు.

4. ఎనిమిదవ షెడ్యూల్‌లోని అన్ని భాషలలోనూ అన్ని కొత్త చట్టాలనూ, నియమాలనూ మరియు అధికారిక ప్రకటనలనూ వెంటనే ప్రచురించాలని కేంద్ర ప్రభుత్వానికి పిలుపునిచ్చారు.

5. ఎనిమిదవ షెడ్యూల్‌లోని అన్ని భాషలలోనూ ఉన్న అన్ని చట్టాలనూ, నియమాలనూ మరియు అధికారిక ప్రకటనలనూ క్రమంగా ప్రచురించాలని కేంద్ర ప్రభుత్వానికి పిలుపునిచ్చారు.

6. సమాఖ్య పరిధిలోని విద్యాసంస్థలలో అన్ని ప్రవేశపరీక్షలనూ ఎనిమిదవ షెడ్యూల్‌లోని అన్ని భాషలలోనూ నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వమూ దాని అన్ని ప్రాతినిధ్య సంస్థలకూ పిలుపునిచ్చారు.

7. సమాఖ్య పరిధిలోని అన్నిస్థానాలలో నియామకాల కోసం అన్ని పరీక్షలనూ ఎనిమిదవ షెడ్యూల్ యొక్క అన్ని భాషలలోనూ నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం మరియు దాని అన్ని ప్రాతినిధ్య సంస్థలకూ పిలుపునిచ్చారు.

8. కేంద్ర ప్రభుత్వమూ దాని అన్ని ప్రాతినిధ్య సంస్థలూ (వాటి సామర్థ్యాలమేరకు), సమాఖ్య ప్రజలకు అందించే అన్ని సేవలనూ ఎనిమిదవ షెడ్యూల్‌లోని అన్ని భాషలలోనూ అందించేలా చూడాలి.

9. కేంద్ర ప్రభుత్వమూ దాని అన్ని ప్రాతినిధ్య సంస్థలూ(వాటి సామర్థ్యాల మేరకు), కేంద్ర ప్రభుత్వం లేదా దాని అధికారికసంస్థలూ జారీ చేసిన అన్ని ప్రసంగాలూ, ప్రకటనలూ, విజ్ఞప్తులూ ఎనిమిదవ షెడ్యూల్‌లోని అన్ని భాషలలోకి అనువదించేలా చూడాలి.

అనుబంధం:

ప్రతిపాదిత సవరణ బిల్లు –2021 రాజ్యాంగంలోని అధికరణం 343కు ఈ కింది అధికరణం ప్రత్యామ్నాయంగా ఉంటుంది

అధికరణం 343:

(1) సమాఖ్య యొక్క అధికారికభాషలుగా ఆంగ్లభాషతోపాటు ఈ రాజ్యాంగంలోని ఎనిమిదవషెడ్యూల్‌లో పేర్కొన్న అన్ని భాషలూ ఉండాలి.

(2) సమాఖ్య యొక్క అధికారిక ప్రయోజనాల కోసం ఉపయోగించాల్సిన అంకెల రూపం భారతీయ అంకెల యొక్క అంతర్జాతీయ రూపంలో ఉండాలి.

(3) సమాఖ్య చేసిన అన్ని చట్టాలూ, నియమాలూ అధికారిక ప్రకటనలనూ ఈ అధికరణం అమలులోకి వచ్చిన తేదీ నుండి సమాఖ్య యొక్క అన్ని అధికారిక భాషలలో జారీచేసిన వెంటనే ప్రచురించబడతాయి.

(4) సమాఖ్య చేసిన అన్ని చట్టాలూ, నియమాలూ అధికారిక ప్రకటనలూ ఈ అధికరణం అమల్లోకి వచ్చే తేదీకి ముందు సమాఖ్య చేసిన అన్ని చట్టాలూ, నియమాలూ అధికారిక ప్రకటనలూ సమాఖ్య యొక్క అన్ని అధికారిక భాషలలో సహేతుకమైన వ్యవధిలో ప్రచురించబడతాయి.

(5) సమాఖ్య స్థాపించిన విద్యాసంస్థలలో ప్రవేశం కోసం సమాఖ్య లేదా సమాఖ్య తరపున ఏదైనా అధికారిక సంస్థ నిర్వహించే అన్ని పరీక్షలూ సమాఖ్య యొక్క అన్ని అధికారిక భాషలలోనూ నిర్వహించబడతాయి.

(6) సమాఖ్య లేదా పార్లమెంటు చేత చట్టం ద్వారా ఏర్పాటు చేయబడిన ఏదైనా అధికారిక సంస్థతో సహా, ప్రభుత్వరంగ సంస్థ లేదా సమీకృత భారతీయ నిధితోనో సమాఖ్య యొక్క సంపూర్ణనిధులతోనో నియంత్రణలో ఉన్న సంస్థల సేవలలో నియామకాల కోసం అన్ని పరీక్షలూ సమాఖ్య యొక్క అన్ని అధికారిక భాషలలోనూ జరగాలి.

(7) ఈ అధికరణం యొక్క (2) నిబంధన ప్రకారం రాష్ట్రపతి జారీ చేసిన అన్ని ఉత్తర్వులూ సవరణకు ముందు ఉన్నట్లే, హిందీ భాషతోపాటు సమాఖ్య యొక్క అన్ని అధికారిక భాషలనూ చేర్చాలని భావించడమైనది.

భారతీయ భాషలను సాధికారపరిచే బెంగళూరు తీర్మానాన్ని మరియు సవరణ బిల్లుని ఆమోదించినవారు:

శ్రీ టి.ఎస్. నాగాభరణ(అధ్యక్షులు), డాక్టర్ కె.మురళీధర్(కార్యదర్శి), డాక్టర్ వి.పి.నిరంజనారాధ్య(కార్యనిర్వాహకుడు), ప్రొ॥ జి.ఉమామహేశ్వరరావు (తెలుగు), శ్రీ సెంథిల్‌నాథన్ (తమిళం), శ్రీ ఆనంద్ జి.(కన్నడ), ప్రొఫెసర్ జోగా సింహావిర్క్(పంజాబీ), శ్రీ ఖుముక్కం చింగ్లెన్‌లువాంగ్ (మైథిలీ), శ్రీసాకేత్ శ్రీభూషణ్ సాహు (ఒడియా), ప్రొ॥ ముసావిర్ అహ్మద్(కాశ్మీరీ), శ్రీ తారిక్ కుమార్ దత్తా (బెంగాలీ), ప్రొఫెసర్ జోగ్‌రాజ్ (ఉర్దూ), శ్రీమతి దీప్తి పి.పట్గిరి (అస్సామీ), శ్రీమతి శ్యామసింగ్(హిందీ), శ్రీ నందకుమార్ (మలయాళం), డాక్టర్ ప్రకాష్ పరాబ్(మరాఠీ), శ్రీ బి. కె. ఝా(మైథిలి), శ్రీ రితురాజ్ శర్మ(డోగ్రి), ప్రొఫెసర్ కె.ఇ.దేవనాథన్(సంస్కృతం), శ్రీమతి ఆశాచంద్(సింధి).

డా॥ ఎ. చంద్రశేఖరరావు
9949605141

వాక్య విశ్లేషణ – యంత్రానువాదం

భాషానిర్మాణం బహుక్లిష్టమైనది. మనుషులలో గుర్తింపగల భేదాలున్నట్లుగానే వారి భాషలోగూడ భేదాలుంటాయి. ఐతే ఇతను మనిషి అని గుర్తించగల సామాన్య లక్షణాలున్నట్లుగానే ఇది ఫలానా భాష అని గుర్తించడానికి ఆయాభాషలకు కొన్ని సామాన్య లక్షణాలుంటాయి. అవే వ్యాకరణాంశాలు. చెప్పేవాడిభాష వినేవాడిభాష ఒకటైతేనే పరస్పరం అర్థం చేసుకోగలరు. అంటే వారిద్దరికీ వారి వ్యవహార భాషలోని పద, పదాంశాల అర్థం, వాటి ప్రయోగం తెలిసుండాలి. కంప్యూటర్ ద్వారా వాక్యవిశ్లేషణ చేస్తున్నామంటే దానికి ముందుగానే ఒక భాష తెలిసుండాలి కదా. అది దాని భాషాకోశంలో వుంటుంది.

భాషాకోశ నిర్మాణం: భాషా వ్యవహర్త భాష ద్వారా భావాన్ని ఏవిధంగా అర్థం చేసుకొంటున్నాడో అదేవిధంగా యంత్రం భాషను అర్థం చేసుకొంటుంది. వ్యవహర్త భాషను అర్థంచేసుకోవాలంటే ఆ భాషలోని పదాల అర్థాలు, వాక్యనిర్మాణం, భాషా సంప్రదాయం తెలుసుకోవాలి. యంత్రానికి మాతృభాష వుండదు కాబట్టి మనం దానికి ఒక భాషను నేర్పాలి. భాషా విశ్లేషణం, పద, పదాంశాల ప్రయోగం గూడ నేర్పాలి. ఒక భాషలోని పద, పదాంశాలను గుర్తించాలంటే కంప్యూటరుకు ఆ భాష తెలిసుండాలి. అది దాని మూలభాష (source language). మూలభాషలోని పదాలకు సరైన అర్థాన్నిచ్చే ఒక నిఘంటువు యంత్రానికి అందుబాటులో (Access) వుండాలి. ఒక పదానికి ఒకే అర్థం ఉన్నట్లుగా నిఘంటువును తయారుచేసుకోవడం మంచిది. ఉదాహరణకి coming, come అన్న పదాలకు ఒకే అర్థం వుంది. coming అన్న పదాన్ని కంప్యూటర్ com, ing, అంటూ విభజిస్తుంది. com అన్న పదం సాధారణ నిఘంటువులో వుండదు. అలాగే running అన్న మాటను తీసుకొంటే కంప్యూటర్ runn, ing, అంటూ విభజిస్తుంది. runn అన్న పదం నిఘంటువులో వుండదు. కాబట్టి యంత్రానువాదం కోసం ప్రత్యేకమైన నిఘంటువు తయారు చేసుకోవాలి. దానిలో ధాతువు, ప్రకృతి, ప్రత్యయాలు రాసి వుండాలి. come, com, run runn, ing కూడా వుండాలి. విశ్లేషణ ద్వారా వేరుచేయబడిన పదాల వర్గీకరణ చాల అవసరం. పదాలను భాషాభాగాలుగా వర్గీకరించడం మాత్రమే చాలదు. నామవాచకమైతే అది 1.జీవియా? నిర్జీవియా? జంతువా? వృక్షమా? ఆడా? మగా? మొదలైన వివరాలు వుండాలి. “ఇది కుక్క” అన్న వాక్యాన్ని విశ్లేషిస్తే వాక్యం = సర్వనామం (Pn) + నామం (N) అని కంప్యూటర్ గ్రహిస్తుంది. దీనిని తెరపై చూడగలం. కాని ఈ వాక్యం కంప్యూటర్ అర్థం చేసుకొందా? “కుక్క” అన్న పదం నాచవాచకం అని దానికి తెలుసు. “ఇది” అన్నా “అది” అన్నా దానికి సర్వనామమే. కాబట్టి వేరొక భాషలో అర్థం అడగాలి. పిల్లడు ఇంగ్లీషులో కథ చదువుతుంటే ‘అర్థం అయిందా?’ అని అడుగుతాం కదా? ‘అయింది’ అని వాడంటే “ఏదీ తెలుగులో (మాతృభాష) చెప్పు.” అంటాం కదా? విశ్లేషణే కాదు వెరిఫికేషన్ గూడ అవసరం. అనువాదం కోసం కంప్యూటరుకు అనేక భాషలు నేర్పవలసి వుంటుంది. మన ఆజ్ఞననుసరించి కంప్యూటర్ మూలభాషను గ్రహిస్తుంది.

మూలభాషనే విశ్లేషిస్తుంది. నిఘంటువు ఆధారంగా మూలభాషా పదాలను లక్ష్యభాషలోకి (target language) అనువదించడం జరుగుతుంది.

యాంత్రిక విశ్లేషణ: కంప్యూటరు కీ బోర్డు ద్వారా విషయాన్ని అందిస్తున్నాం కాబట్టి, వ్రాతద్వారా వ్యక్తం చేసే భాష గురించి మాత్రమే ప్రస్తావించడం జరుగుతుంది. కంప్యూటర్‌కు అందించే భాష అన్వయ క్లిష్టత లేకుండా వుండాలి. అర్థ సందిగ్ధతకు తావులేనివిధంగా వుండాలి. వాక్యాలు దోషరహితంగా ఉండాలి. రాతలో ఐతే సాధారణంగా వ్యాకరణ దోషాలుండవు, కాని వాక్యంలో వాక్యం కలిసిపోయి వుంటే విశ్లేషణ కష్టమౌతుంది. అంతేగాదు పెద్దవాక్యాలలో దోషాలున్నాయో లేవో కూడ గుర్తించలేం. అందుచేత చిన్నచిన్న వాక్యాలు రాయడం మేలు.

విశ్లేషణ విధానం: విశ్లేషణలో ఒక్కొక్కరు ఒక్కొక్క విధానం అవలంబించవచ్చు. నాపద్ధతి– ముందుగా మూల భాషలోని వాక్యాన్ని గుర్తించడం. వాక్యం భాషలోని అర్థయుక్తమైన కనిష్ఠ ప్రమాణం కాబట్టి వాక్యం పూర్తయిన తరవాత మాత్రమే భావాన్ని గ్రహించగలిగే వీలుంది. వ్రాతలో వాక్యాంతాన్ని (.) (?) (!) వంటి చిహ్నాలద్వారా గుర్తించవచ్చు. అందుచేత కంప్యూటరుకు మేపే భాషలో విరామచిహ్నాలు వాడాలి. తరువాత భాషలోని వాక్యాన్ని విశ్లేషించుకోవాలి. అందుకోసం వాక్యంలోని పదాలను గుర్తించాలి. రాతలో పదాలమధ్య ఖాళీ ఉంచుతాం కాబట్టి, ఈ ఖాళీని ఆధారంచేసుకొని కంప్యూటర్ వాక్యంలోని ఒకొక్క పదాన్ని వేరుచేస్తుంది. మనం చదువుకొన్నట్లే కంప్యూటర్ కూడ అక్షరం అక్షరం చదువుకొంటూ పోతుంది. భాషలోని పదం నిఘంటువులో కనిపించిన వెంటనే దాని అర్థాన్ని గ్రహించి రెండవ పదానికి పోతుంది. భారతీయ భాషలలో పదం ప్రత్యయంతో కూడి వుంటుంది. కాబట్టి ప్రకృతి ప్రత్యయ విభాగం చేయవలసి వుంటుంది. ఇంగ్లీషులో అయితే ప్రత్యయాలు (prepositions, postpositions) నామవాచకంతో కలిసి వుండవు. ఆ భాషలో రెంటి మధ్య ఖాళీ వుంటుంది. ఒక వాక్యాన్ని విడగొట్టి అందులోని పదాల అమరిక, పదాలలోని పదాంశాల అమరిక, వాటి మధ్య గల సంబంధం తెలుసుకోవచ్చు. పదాన్ని ప్రకృతి, ప్రత్యయ విభాగం చెయ్యకుండా మొత్తం పదం యొక్క అర్థాన్ని గ్రహించాలనుకొంటే పెద్ద నిఘంటువును తయారు చేసుకోవాలి. ఏ భాషలోనైనా నామపదాలు,

క్రియాపదాలు అధిక సంఖ్యలో వుంటాయి. ప్రత్యయాలు తక్కువ సంఖ్యలో వుంటాయి. ప్రకృతి ప్రత్యయాలను కలిపి ఒకే పదంగా రాస్తే పదాల సంఖ్య పెరిగిపోతుంది. వాటి సంఖ్య ఎంత వుంటుందంటే – ప్రకృతి పదాల సంఖ్యను ప్రత్యయ పదాల సంఖ్యచే గుణించగా వచ్చిన లబ్ధంతో సమానంగా వుంటుంది. అందుచేత ప్రకృతి ప్రత్యయ విభాగం తప్పనిసరి. కంప్యూటర్ వాక్యాన్ని పదాలుగాను, పదాలను పదాంశాలుగాను విభజించి వాటి అర్థాలను ప్రత్యేకమైన పదకోశం (నిఘంటువు) నుండి గ్రహిస్తుంది. (నా కంప్యూటర్ వ్యాకరణార్థాన్నీ, నైఘంటుకార్థాన్నీ వేరు వేరు చోట్ల నుండి గ్రహిస్తుంది. అందుకోసం నేను ఒక ప్రత్యేకమైన నిఘంటువును (పదకోశం) తయారు చేసుకొంటున్నాను.)

విశ్లేషణలో ఎదురయ్యే సమస్యలు: ఒక్కో భాషలో ఒక్కో సమస్య వుంటుంది. నామపదాలు ప్రత్యయాలతో కలిసేటప్పుడు అనేక సంధి మార్పులు జరుగుతాయి. అందుచేత ధాతు రూపాలు, ప్రకృతి రూపాలు, సంధిరూపాలు వేరు వేరుగ నిఘంటువులో రాసుకొని గ్రహించవలసి వుంటుంది. క్రియాపదంలో ధాతువుకు కాలబోధక, పురుషబోధక, వచన బోధక ప్రత్యయాలు అతుక్కొని వుంటాయి. వాటిని వేరుచేయగలిగే సరైన మార్గం వెతుక్కోవాలి.

కంప్యూటర్ భాష ఇంగ్లీషు అనుకొందాం. "going" అన్న పదానికి అర్థం వెదుకుతూ "go" వచ్చేసరికి అర్థం గ్రహిస్తుంది. తరువాత "ing" ప్రత్యయంయొక్క వ్యాకరణార్థం గ్రహిస్తుంది. మరొక పదం "good" తీసుకొందాం. "go" పూర్తికాగానే అర్థం గ్రహించడం జరిగిపోతుంది. "od" కి అర్థం దొరకదు. తెలుగులో కూడ ఇటువంటి పదాలుంటాయి. ''దేశముదురు'' అన్న పదంలో ''దేశము'' పూర్తికాగానే అర్థం గ్రహించడం జరిగిపోతుంది. "దురు"కి అర్థం దొరకదు. "దేశ ముదురు" అని రాస్తే సమస్య లేదు. కాని సమాసాన్ని కలిపి రాస్తారు. పదాలమధ్య ఖాళీ ఉంచడంలో ఒక పద్ధతి లేదు. "నా పుస్తకము, నాయొక్క పుస్తకము, నా యొక్క పుస్తకము" అన్నా అర్థం మారదు. "ఆమెపుస్తకం..." (her book), పదాల మధ్య ఖాళీ లేదు. వాక్యం పూర్తికాలేదు. "ఆమె పుస్తకం." (She is a book) పదాల మధ్య ఖాళీ ఉంది. ఇక్కడ వాక్యావసానాన్ని సూచించే గుర్తు(.) వుంది. ఖాళీ వుంటే ఒక అర్థం, ఖాళీ లేకపోతే ఇంకొక అర్థం వస్తుంది. "అతను పుస్తకం" (he is a book). ఇక్కడ (.) గుర్తు వున్నా లేకపోయినా అర్థం మారదు. "అతని పుస్తకం" "అతనిపుస్తకం" (his book) ఖాళీ వుంచినా లేకపోయినా అర్థం మారదు. "అతను" కి 'అతని' అనే ఔపవిభక్తిక రూపం వుంది. "ఆమె" కు లేదు. అందుచేత "అతని" తో చిక్కులు లేవు. "ఆమెతో" నే చిక్కులు. అలాగే "ఆయన" తో గూడ చిక్కులే. ఔపవిభక్తిక రూపాలు లేనిచోట్ల ఇటువంటి చిక్కులు వస్తాయి.

మనభాషలలో సంధిరూపాలు ఎక్కువ. కాబట్టి ముందుగా సంధులను విడదీసి పదాలను గ్రహించాలి. ఇది క్లిష్టసమస్య. ''అయ్యవసరము'' అన్న సమాసాన్ని 60 శాతం పైగా డిగ్రీ చదువుతున్న విద్యార్థులు "అయ్య + వసరము" అనే విడదీశారు. వారికి "అయ్య" తెలుసు. గ్రామాలలో ఈ పదం వాడుకలో వుంది. కంప్యూటర్ కి ముందుగా ఈ పదం తెలిసుంటే అది కూడ ఇలాగే విడదీస్తుంది. అలాగే తెలుగునుండి ఇంగ్లీషులోకి అనువదించే సందర్భాలలోగూడ కొన్ని ఇబ్బందులు ఉంటాయి. ఉదాహరణకు "కుక్కపిల్ల" అన్న సమాసానికి 'కుక్క' కీ అర్థం వుంటుంది. 'పిల్ల' కీ అర్థం వుంటుంది. వెరసి ఇంగ్లీషులో "dog child" అనువాదంగా వస్తుంది. ఇంగ్లీషులో "కుక్కపిల్ల" కు "pup' అన్న ఒక పదంవుంది. కాబట్టి పదాలకు వేరుగాను, సమాసాలకు వేరుగాను అర్థాలు రాసుకోవాలి.

వాక్య విశ్లేషణం: ఇంతవరకు పదవిశ్లేషణ గురించి మాత్రమే తెలుసుకొన్నాం. ఇప్పుడు వాక్యవిశ్లేషణ గురించి ఆలోచిద్దాం. వాక్యాలలో సామాన్యవాక్యాలు, సంక్లిష్ట వాక్యాలు, సంయుక్త వాక్యాలు వుంటాయి. సామాన్యవాక్యాలలో కర్త్రర్థక వాక్యాలు, కర్మార్థక వాక్యాలే కాకుండా – భావార్థక వాక్యాలు, మధ్యార్థక (Middle) వాక్యాలు ఉంటాయి. వీటిని గుర్తించి అర్థం చేసుకోగలిగే సామర్థ్యం యంత్రానికి వుండాలి. వాక్యంలోని పదాలను భాషాభాగాలుగా గుర్తించడమేగాదు వాటి పనిగూడ తెలియాలి. అంటే వాక్యంలో ఆపదం ఉద్దేశ్యమో (Subject) విధేయమో(Predicate) తెలియాలి. కర్త, కర్మ, క్రియలు తెలియాలి. అందుకోసం భాషా సంప్రదాయం తెలియాలి. ఇంగ్లీషులాటి భాషలలో వాక్యంలోని పదాల స్థానాన్ని బట్టి కర్త, కర్మలను నిర్ణయిస్తాం. తెలుగు, సంస్కృతం వంటి కొన్ని భాషలలో ప్రత్యయాన్నిబట్టి కర్త, కర్మలను గుర్తించవచ్చు. 'తెలుగులో "రాముడు రావణుని చంపెను", "రావణుని రాముడు చంపెను" అన్నా అర్థం మారదు. కాని ఇంగ్లీషులో "Rama killed Ravana" అనడానికి బదులుగా ''Ravana killed Rama'' అంటే అర్థం మారిపోతుంది. వాక్యం వ్యాకరణయుక్తంగానే వుంది. **ఇంగ్లీషులో వాక్యంలో పదాల స్థానాన్ని బట్టి కర్త, కర్మల నిర్ణయం జరుగుతుంది.** ఈ విషయం యంత్రానికి తెలియాలి. అనువాదంలో ఇటువంటి మార్పులు చెయ్యవలసి వుంటుంది.

ఇప్పుడు యంత్రానికి ఇంగ్లీషు భాషలోని పదాలు, అవి ఏ వర్గానికి చెందినవో ఆ వివరాలు, ఆ భాష యొక్క వ్యాకరణం మొదలైనవి తెలుసు. ఇంగ్లీషులోని "You killed he" అన్న ఈ వాక్యాన్ని కంప్యూటర్ కు మేపితే దానికి అర్థం కాదు. మనకు జవాబు రాదు. ఎందుకంటే ఇంగ్లీషు వాక్యంలో తప్పుంది. కర్మ "he" కాదు. "him" వుండాలి. భాషకు సంబంధించిన సమస్త విషయాలు కంప్యూటర్ మనస్సులో నిక్షిప్తమై వుంటాయి. ఇది కంప్యూటర్ యొక్క జ్ఞానం. కంప్యూటర్ యొక్క ఈ జ్ఞానాన్ని మనం అనువాదానికి నియోగించుకోవచ్చు. అనువాదంలో కర్త కర్త గాను, కర్మ కర్మ గాను అనువదించవలసి వుంటుంది. దీనికి నిఘంటువు సహాయపడదు.

"ఈ పుస్తకం చదువు'', "అందరికీ చదువు కావాలి" అన్న వాక్యాలలో మొదటి వాక్యంలో 'చదువు' క్రియ. రెండవ వాక్యంలో 'చదువు' నామవాచకం. "This is a book" This book is good అన్న వాక్యాలలోని మొదటి మాటకు రెండు అర్థాలు ఉన్నాయి. మొదటి వాక్యంలోని "This'' పురుషబోధక సర్వనామం, ఉద్దేశ్యం (Subject). రెండవ వాక్యంలోని ''This'' నిర్దేశ సర్వనామం, ఉద్దేశ్యం

(Subject). మొదటి వాక్యంలో book విధేయము (Predicate). రెండవ వాక్యంలో book ఆఖ్యాతము (Subject). ఈ భేదం కంప్యూటర్ గుర్తించ గలగాలి. వ్యక్తి నామాలను గూడ గుర్తించ గలగాలి. ఈ ప్రక్రియలో లోపం ఎక్కడైనా జరిగితే దానిని తెలుసుకోడానికి వాక్య విశ్లేషణ తోడ్పడాలి.

అనువాదం: మూలభాషలోని వాక్యాన్ని లక్ష్యభాషలోనికి అనువాదం చెయ్యాలి. కంప్యూటర్ మూలభాషలోని పదాలను లక్ష్యభాషలోకి వరుసగా అనువదిస్తుంది, కాని వాక్యనిర్మాణం మూలభాషలో వుంటుంది. **ఒక భాషలో వున్న వాక్యనిర్మాణం వేరొక భాషలో వుండకపోవచ్చు.** అందుచేత యంత్రానికి మూలభాష, లక్ష్యభాషల వాక్యనిర్మాణాలు తెలియాలి. అంతేకాదు భాషా సంప్రదాయం తెలియాలి. అనువదింపబడిన పదాలను లక్ష్యభాషా నిర్మాణానికి అనుగుణంగా అమర్చుకోవాలి. లక్ష్యభాష యొక్క నుడికారం తెలిసుండాలి. అంతేగాదు తన వ్యాకరణ పరిజ్ఞానాన్ని అనువర్తింపచేయగల సామర్థ్యం కూడ వుండాలి. "ఈ దుకాణం దగ్గర నాకు కొంచం పనివుంది" అన్న వాక్యాన్ని "ఇస్ దుకాన్ కె పాస్ తోడా కామ్ హై" అనడాన్ని హిందీ మాతృభాషా వ్యవహర్తలు తప్పు పడతారు. "ఇస్ దుకాన్ పర్(మీద) తోడా కామ్ హై" అనాలంటారు. అనువాదకుడికి నుడికారం తెలిసుండాలి. "I am hungry" అన్న ఇంగ్లీషులోని కర్తర్థక వాక్యాన్ని తెలుగులో భావార్థక వాక్యంగా "నాకు ఆకలిగా వుంది" అని అనువదించాలి. ఇక్కడ "నాకు" కర్తా? కర్మా? 'నేను రాయికి తగిలాను" అనడానికి బదులుగా తెలుగువాళ్ళం "నాకు రాయి తగిలింది" అని అంటున్నాం. కర్తను పరోక్ష కర్మను చేసి రాయిమీద నేరం మోపుతున్నాం కదా!

"This is a good book" అన్న వాక్యానికి అనువాదం "ఇది మంచి పుస్తకం". "This book is good" అన్న వాక్యాన్ని తెలుగు భాషా వ్యాకరణాన్ని అనుసరించి "ఈ పుస్తకం మంచి+ది" అని అనువదించాలి. "am a man. You are a man" అన్న వాక్యాలను "నేను మనిషి+ని, నువ్వు మనిషి+వి" అని అనువదించాలి. **'నేను మనిషి. నువ్వు మనిషి" అనడం తెలుగు సంప్రదాయం కాదు.**

వాక్యాలలోని పదాలస్థానం మార్చడమే కాదు ఒక పదంలోని పదాంశాలను గూడ వెనుక ముందు చేయవలసి వుంటుంది. తెలుగులో "నా పుస్తకం" అన్న సమాసంలో 'నా' అన్న సంబంధబోధక సర్వనామం తరవాత నామవాచకం వస్తుంది. చాలా భాషలలో ఇలాగే వుంటుంది. సవరభాషలో దీనికి విరుద్ధంగా నామవాచకం తరవాత సంబంధబోధక సర్వనామం వస్తుంది. సవరభాషలో "కంబో 'న్" కంబోల్ + ఇ'న్ ("పుస్తకంనా" పుస్తకం+నా)" అనాలి. **మన భాషలలో విశేషణం తరువాత విశేష్యం వస్తుంది. సవర భాషలో విశేష్యం తరువాత విశేషణం వస్తుంది.** "ఒసి" వ "పిల్లపసి" అంటే 'పసిపిల్ల" అని అర్థం. సవర భాషలో విశేషణానికీ నామవాచకానికీ మధ్య ఖాళీ వుంచకూడదు.


'నేను ఆంధ్రప్రదేశ్ నుండి వచ్చాను" అన్న వాక్యాన్ని "నాన్ ఆంధ్రప్రదేశ్ ఇల్ ఇరుందు వందేన్" అంటే తమిళుడు ఒప్పుకోడు. "నాన్ ఆంధ్రప్రదేశత్తు ఇల్ ఇరుందు వందేన్" అనాలంటాడు. 'ఆంధ్రప్రదేశ్' అన్న హిందీ పదాన్ని 'ఆంధ్రప్రదేశ+ము' గా మార్చుకోవాలి. తరువాత తమిళ ప్రత్యయం 'ఇల్ 'ముందున్న 'ము' 'త్తు' గా మారుతుంది అన్న తమిళ సంధి సూత్రాన్ని అనువర్తింప జేసుకోవాలి. అంటే మన కంప్యూటర్‌కి ఉభయ భాషల వ్యాకరణం పూర్తిగా రావాలన్నమాట.

కంప్యూటర్ ద్వారా అనువాదం చేసేటప్పుడు కొన్ని కొన్ని అనిష్టరూపాలు ఉత్పన్నం అవుతుండడం చూస్తూనే వున్నాం. తప్పు ఎక్కడ జరిగిందో తెలియాలంటే కంప్యూటర్ అనువాదం చేసే విధానం తెలియాలి. మూలభాషలోని వాక్యం లక్ష్యభాషగా వెలువడే ముందు కంప్యూటర్ గర్భంలో జరిగే ఈ రూపవిక్రియను కనిపెట్టి సవరించుకొంటే అనువాదంలో అనిష్టరూపాలు వెలువడవు.

వాక్యమే పూర్తి అర్థం ఇస్తుంది కాబట్టి వాక్యం పూర్తయినంతవరకు అర్థం అగోచరం. అందుచేత వాక్యం పూర్తిగా రాసిన తరవాత 'ట్రాన్స్‌లేట్' అన్న కమాండ్ మీట నొక్కగానే నా కంప్యూటర్‌లో అనువాద విధానం ప్రారంభం ఔతుంది. ఈ కార్యక్రమమంతా పూర్తయిన తరువాత కంప్యూటర్ తెరపై మనకు అనువాదం కనిపిస్తుంది. **కంప్యూటర్ ప్రోగ్రాం ఏదీ పరిపూర్ణం కాదు. ఒక వెర్షన్ తరువాత దానిని అభివృద్ధి చేస్తూ మరొక వెర్షన్ వస్తుంది. నిత్యం పరిశోధన చేస్తూనే వుండాలి.**

కొత్త పుస్తకం

సంచారి బుర్రకథ ఈరమ్మ (జీవితచరిత్ర)




వెల : రు. 80/-
రచయిత:
డా. నింగప్ప ముదేనూరు
(కన్నడమూలం)
రంగనాథ రామచంద్రరావు
(అనువాదం)
ప్రతులకు: ఛాయా రిసోర్సెస్ సెంటర్, హైదరాబాదు. ఫోన్: 9848023384
www. amazon.in నుండి కూడా పొందవచ్చు.

కన్నడ తోటలో విరిసిన ఎందరో తెలుగు కళాకారులలో ఒకరు బుర్రకథ ఈరమ్మ. బుడగ జంగాలు అనబడే ఒక ఆదిమకులానికి చెందిన ఈరమ్మ తన సంచార జీవితంలో కర్ణాటకాంధ్రలో బుర్రకథ చెప్పడంలో పేరు గడించింది. ప్రజాదరణతోపాటు, ఎన్నో పురస్కారాలను పొందింది. ప్రతిష్ఠాత్మకమైన 'కర్ణాటక రాజ్యోత్సవ పురస్కారాన్ని', హంపి కన్నడ విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేటునూ ఆమె పొందింది. ఈరమ్మ చరిత్రను కన్నడంలో డా. నింగప్ప ముదేనూరు రచించగా, రంగనాథరామచంద్రరావు తెలుగులోకి అనువదించారు. **అమ్మనుడి**లో ధారావాహికగా వెలువడింది.

డాక్టర్ షేక్ మహబూబ్ బాషా 9160579705
డాక్టర్ మొహమ్మద్ కరీం

విద్యనూ భాషనూ ప్రజాస్వామీకరించడంతోనే అభివృద్ధి
మాతృభాషలోనే చదువులూ, పరిపాలనా తప్పని సరి: మౌలానా ఆజాద్



"తనలో అంతర్నిహితంగా ఉన్న శక్తులను అభివృద్ధిపరచుకొని పరిపూర్ణమానవ జీవితాన్ని జీవించేందుకై విద్యను సముపార్జించే హక్కు ప్రతి వ్యక్తికీ వుంది. అలాంటి విద్య పౌరుల జన్మహక్కు. ఈ అవకాశాన్ని పౌరులందరికీ కల్పించనంత వరకూ- రాజ్యం తన బాధ్యతల్ని నిర్వర్తించినట్లు చెప్పుకోజాలదు... ఉద్యోగ అవకాశాలతో సంబంధం లేకుండా సెకండరీ స్థాయిదాకా రాజ్యం తన పౌరులకు విద్యావకాశాలను కల్పించాలని నేను ప్రగాఢంగా విశ్వసిస్తాను." అని భారత స్వాతంత్ర్యోద్యమ అగ్రనాయకుల్లో ఒకరైన మౌలానా అబుల్ కలాం ఆజాద్ అన్నారు. స్వతంత్ర భారత విద్యాశాఖామాత్యుని హోదాలో 30 సెప్టెంబరు,1950న ఆకాశవాణి ద్వారా ప్రసంగిస్తూ ఆయన ఈ సందేశం ఇచ్చారు. మౌలానా ఆజాద్‌గా ప్రఖ్యాతులైన మోహియుద్దీన్ అహ్మద్ భారత స్వాతంత్ర్యోద్యమంలో పోషించిన మహత్తర పాత్రగూర్చి మనకు కాస్తోకూస్తో తెలుస్తున్నప్పటికీ, స్వతంత్రభారత ప్రప్రథమ విద్యాశాఖామంత్రిగా ఆయన అందించిన సేవలు దాదాపుగా మరుగున పడ్డాయి. ఈ నేపథ్యంలో మాతృభాషలో విద్యాబోధనపై వివిధ సందర్భాలలో ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాలను పౌరులకు పరిచయం చెయ్యడమే ఈవ్యాసం ఉద్దేశం. విషయంలోకి వెళ్ళేముందు స్వతంత్ర భారత విద్యారంగానికి ఆయన అందించిన సేవలను స్థూలంగా తెలుసుకుందాం.

స్వాతంత్ర్యం రాక పూర్వమే జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వంలో ఏర్పడ్డ తాత్కాలిక ప్రభుత్వంలో వివిధ నాయకుల ఒత్తిడి మేరకు ప్రవేశించి ఐచ్ఛికంగా విద్యాశాఖను స్వీకరించారు మౌలానా ఆజాద్. 15 జనవరి 1947 నుండి 22 ఫిబ్రవరి 1958న చనిపోయేదాకా 11 సంవత్సరాలకు పైగా కేంద్రప్రభుత్వ విద్యాశాఖామంత్రిగా పనిచేశారు. శాస్త్రీయ పరిశోధన, సాంస్కృతిక వ్యవహారాల శాఖలనూ ఆయనే నిర్వహించారు. స్వతహాగా గొప్ప దార్శనికుడూ, మహాపండితుడూ, విశ్లేషకుడూ అయిన మౌలానా ఆజాద్ ఈ రంగాలకు పటిష్టమైన పునాదులు వేశారు. దేశాన్ని నిజమైన ప్రజాస్వామీకరణకు శ్రీకారం చుట్టారు. అందుకే **విద్యా సముపార్జన పేదల జన్మహక్కని నినదించిన ఆజాద్, వారికి విద్యనందించడం రాజ్యం మౌలిక బాధ్యత అన్నారు.** ఈ లక్ష్య సాధన దిశగా ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత విద్యలకు నిర్దిష్టమైన ప్రణాళికలేర్పరిచారు. ప్రజాస్వామ్య ఆదర్శాలను గ్రామీణ ప్రాంతాలదాకా తీసుకెళ్లాలని భావించి గ్రామాల్లో విద్యావకాశాల మెరుగుదలకు కృషి చేశారు. ముఖ్యంగా ప్రాథమిక విద్యకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి ఉచిత, నిర్బంధ ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టారు. మౌలానా ఆజాద్ పట్టుదల కారణంగా 1947లో కేవలం రెండుకోట్లున్న విద్యాశాఖ కేటాయింపు 1957 నాటికి 30 కోట్లకు పెరిగింది. అంతస్తుల దొంతరల భారతీయ సమాజంలో తరతరాలుగా తీవ్ర వివక్షకు గురైన దళిత, వెనుకబడిన కులాలు, బలహీన వర్గాలకు చెందిన పిల్లలకు విద్యావకాశాలను కల్పించే లక్ష్యంతో ఉపకారవేతనాలందించే అధికారిక విధానానికి స్పష్టమైన రూపురేఖలనిచ్చారు. 1944లో కేవలం మూడు లక్షలే ఉన్న సదరు కేటాయింపు ఆజాద్ కృషి ఫలితంగా 1960 నాటికి2.25 కోట్లకు అంటే 75 రెట్లు పెరిగింది. **కేంద్ర బడ్జెట్‌లో కనీసం 10% విద్యకు కేటాయించాలని ఆయన డిమాండు చేశారు.**

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో తన దేశ పురోభివృద్ధిని కాంక్షించిన మౌలానా ఆజాద్ చేతుల్లో జాతీయ, అంతర్జాతీయ ప్రాముఖ్యత కలిగిన అనేక పరిశోధనా సంస్థలూ, ప్రయోగశాలలూ ప్రాణం పోసుకున్నాయి. ఐ.ఐ.టి లూ, సి.యస్.ఐ.ఆర్., ఏ.ఐ.సి.టీ.ఈ., ఐ.ఐ.యస్-బెంగుళూరు, ప్రతిష్ఠాత్మకమైన ఢిల్లీ పాలిటెక్నిక్ మొదలైనవి మచ్చుకు కొన్ని మాత్రమే. ఉన్నత ప్రమాణాలు కలిగి, అంతర్జాతీయంగా పోటీపడగలిగే విధంగా యూనివర్సిటీ విద్య ఉండాలనీ, ఉపాధ్యాయుల జీతభత్యాలూ, వారి జీవన ప్రమాణాలూ మెరుగ్గా ఉండాలనీ ఆయన భావించారు. దాంతో యూనివర్సిటీ గ్రాంట్స్ కమీషన్ ఉనికిలోకి వచ్చింది. రాధాకృష్ణన్ కమిషన్ (1948), ఖేర్ కమిటి (1948), మొదలియార్ కమిషన్ (1953) లు ఆయన మార్గదర్శకత్వంలో నడిచాయి. **శాస్త్రసాంకేతికాభివృద్ధి మోజులో పడి మానవీయ శాస్త్రాల్ని విస్మరించరాదని ఆయన హెచ్చించాడు. స్త్రీల అభివృద్ధిపట్ల నిర్దిష్ట అభిప్రాయాలు కలిగిన ఆజాద్ స్త్రీవిద్య పట్ల ప్రత్యేకదృష్టి సారించారు.**

దేశప్రజల మధ్య మానసిక ఐక్యతను సారించే దిశగా విద్యావ్యవస్థను మలచదలచుకొన్న మౌలానా ఆజాద్-దేశ, సాంస్కృతిక బహుళత్వంలో వివిధ సంస్కృతుల మధ్య సామరస్యంతో

కూడిన అవగాహన ఉండాలని బలంగా విశ్వసించారు. పరస్పర ప్రేమ, సహనం, సౌభ్రాతృత్వం, శాంతియుత సహజీవనం, మానవ హక్కులగుర్తింపు, భిన్నత్వాల పట్ల గౌరవ మానవీయ విలువల్నీ, విశ్వమానవ ఏకత్వాన్నీ బోధించే విధంగా పాఠ్యపుస్తకాలు రూపొందాలన్నారు. చిన్నప్పటినుండీ పసిమెదళ్ళలో సదరు విలువల్ని నూరిపోయాలన్నారు.

విద్యారంగానికి ఎంత గొప్ప సేవలందించాడో సారస్వత, కళారంగాలకూ అంతే సేవలందించాడు. స్వతహాగా గొప్ప సాహితీవేత్తా, కళాపిపాసి అయిన ఆజాద్, సాహిత్య అకాడమీ, లలితకళా ఆకాడమీ, సంగీత నాటక అకాడమీ మొదలైన సంస్థలను స్థాపించాడు. భారతీయ వారసత్వంలో అవిభాజ్య భాగమైన సాంస్కృతిక ఆదాన-ప్రదాన క్రమాలను ప్రోత్సహిస్తూ - ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్‌ని స్థాపించాడు. సారస్వత, కళారంగాల్లో ఉండి ఆర్థికంగా క్రుంగదీసే పరిస్థితులున్న వారికోసం పెన్షన్ పథకాన్ని ఏర్పాటు చేశాడు. ఇలా ఎన్నో విధాలుగా ఆయన అమోఘమైన సేవలందించాడు. ఆయన జన్మదినాన్ని - 11నవంబరు -'జాతీయ విద్యాదినోత్సవం'గా ప్రకటించి భారత ప్రభుత్వం గౌరవించింది.

1947 డిసెంబరు 21న మౌలానా ఆజాద్ పట్నా విశ్వవిద్యాలయ (బీహార్) స్నాతకోత్సవంలో ఉపన్యసించాడు. అందులో మాతృభాషలో విద్యాబోధనకు సంబంధించి తన అభిప్రాయాలను స్పష్టంచేశాడు. సంప్రదాయానికి భిన్నంగా అంటే ఇంగ్లీషులో కాకుండా తన ప్రసంగాన్ని అతడు హిందూస్థానీలో చేశాడు. **భారతదేశ విశ్వవిద్యాలయాల చరిత్రలో ఒక స్నాతకోత్సవ ఉపన్యాసం ఇంగ్లీషులో కాకుండా ఒక భారతీయ భాషలో చేయడమన్నది బహుషా అదే మొదటిసారి.** ఇంగ్లీషులో కాకుండా భారతీయ భాషలో ఉపన్యసిస్తున్నందుకు క్షమాపణలు కోరాల్సిన అవసరం లేదనీ, ఒక భారతీయ విశ్వవిద్యాలయంలో, భారతీయుల ముందునిలబడి, భారతీయ భాషలో మాట్లాడడం అసంజసమేమీ కాదనీ విశదం చేశాడు. నిజానికి **వలసవాద విద్యావిధానం మనమీద రుద్దిన ఇంగ్లీషులో మాట్లాడినపుడే క్షమించమని అడగాల్సిన అవసరం ఉంటుందన్నారు.** బ్రిటీషువాళ్ళు ప్రవేశపెట్టిన ఆంగ్లమాధ్యమంలో విద్యాబోధన భారతీయుల జీవితానికీ, అవసరాలకూ భిన్నంగా ఉండిందనీ, ఫలితంగా భారతదేశంలో ప్రవేశపెట్టిన ఆధునిక విద్యావిధానం 'అభారతీయం"గా వుండిందనీ తేటతెల్లం చేశాడు. **వలసవాదులు ప్రవేశపెట్టిన ఆంగ్ల భాషామాధ్యమం కారణంగా భారతీయుల మనసులు, మేధస్సు సహజంగా కాకుండా అసహజంగా రూపుదిద్దుకొన్నాయన్నాడు. వివిధ విషయాలు నేర్చుకోవడానికి కేటాయించాల్సిన సమయంలో అత్యధిక భాగం విదేశీ భాషను నేర్చుకోవడానికీ దానిమీద పట్టుసాధించడానికీ కేటాయించాల్సి వచ్చిందనీ సదరు విద్యావిధానం వల్ల భారతీయ భాషల అభివృద్ధి కుంటుబడిందనీ స్పష్టంగా ప్రకటించాడు.** భారతదేశంలా కాకుండా ఇతర ఆసియా దేశాలైన ఈజిప్టు, సిరియా, టర్కీ, పర్షియా, చైనా, జపాన్ మొదలైనవి ఆధునిక విద్యను అందిపుచ్చుకున్నా యూనివర్సిటీ స్థాయిల్లో కూడా బోధనా మాధ్యమంగా మాత్రం తమ తమ మాతృభాషల్నే వినియోగించినాయనీ, తద్వారా అవి సాధించిన అభివృద్ధి మన కళ్ళముందే కన్పిస్తున్నదనీ వివరించాడు. **భారతదేశ విద్యావ్యవస్థ ఆంగ్లేయుల చేతుల్లో కాకుండా భారతీయుల చేతుల్లో వుండివున్నట్లైతే వారు కూడా టర్కీ, జపానుల్లాగే తమ తమ మాతృభాషల్లోనే విద్యాభ్యాసం చేసి ఉండేవారనీ కానీ బ్రిటీష్ వలసవాదం ఆ అవకాశాన్ని త్రుంచివేసిందనీ అన్నారు.**

ఇంగ్లీషు భాష జాతీయ జీవనంపై వేసిన ప్రభావాన్ని గూర్చి తెల్పితే అది కొన్ని విషయాల్లో చెరుపు చేసినప్పటికీ కొన్ని విషయాల్లో మంచే చేసిందనేది అందరూ గుర్తించాలన్నారు. ఇంగ్లీషు చేసిన మంచి పనుల్లో ఒకటి వివిధ భాషలు కలిగి ఉపఖండంగా ఉన్న దేశంమొత్తంలో కాశ్మీరునుండి కన్యాకుమారిదాకా ఐక్యతను సాధించి, వివిధ ప్రదేశాల ప్రాదేశిక ప్రభుత్వాల, విశ్వవిద్యాలయాల, శాసన సభల మధ్య ఒక లంకెలా పనిచేయడం. అంతర్జాతీయ స్థాయిలో కూడా మధ్యవర్తి అవసరం లేకుండానే (అనువాదకులు) భారతదేశానికి గుర్తింపూ వివిధ దేశాలతో సంబంధాలూ ఇంగ్లీషుద్వారానే యేర్పడ్డాయి. అయినప్పటికీ ఇంగ్లీషును ప్రభుత్వ కార్యాలయాల్లోనూ, విద్యా సంస్థల్లోనే ఎంతో కాలం కొనసాగించలేమని ఆజాద్ అభిప్రాయపడ్డారు. క్రమక్రమంగా భారతీయ భాషలు దాని స్థానాన్ని ఆక్రమించాల్సిన అవసరం ఉందని నొక్కి వక్కాణించారు. తన విద్యాభ్యాసాన్ని గూర్చి వివరిస్తూ తాను ఎప్పుడేగాని ఏ ఆంగ్ల విద్యాసంస్థలోనూ చదువుకోలేదనీ, తన విద్యాభ్యాసమంతా పర్షియన్, అరబిక్‌లతో ఇంట్లోనే సాగిందనీ, తన సొంత ప్రయత్నం ద్వారానే ఇంగ్లీషు నేర్చుకొన్నాననీ, కాబట్టి భారతీయుల విద్యావిధానంలో ఇంగ్లీషు స్థానానికి సంబంధించి తాను నిష్పాక్షికమైన అభిప్రాయాల్ని వెలిబుచ్చగలననీ వివరించారు.

భాషా సమస్య రెండు విషయాలకు సంబంధించిందనీ, ఒకటి ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిందైతే యింకోటి విద్యకు సంబంధించిందని తెలియజేశారు ఆజాద్. **ఆయన ప్రకారం కేంద్రప్రభుత్వం, రాష్ట్రప్రభుత్వాలు ఐదు సంవత్సరాలపాటు ఇంగ్లీషుతో పాటుగా ప్రాంతీయ భాషల్ని కూడా పాలనా వ్యవహారాల్లో ఉపయోగించాలి. ఈ ఐదేండ్లలోపు ప్రాంతీయ భాషను పాలనా భాషగా అభివృద్ధిచేసి ఆరో సంవత్సరం నుండే ఇంగ్లీషు స్థానంలో దాన్ని ప్రవేశపెట్టి ఇంగ్లీషును పూర్తిగా తీసివేయాలి.** అంటే ఐదేండ్ల వరకు అధికారభాషలుంటాయి - ఒకటి ప్రాంతీయభాష, రెండోది ఇంగ్లీషు. ఆరో సంవత్సరం నుండి కేవలం ప్రాంతీయ భాషొక్కటే అధికార భాషగా చలామణీ అవుతుంది. ఇంగ్లీషు పూర్తిగా తప్పుకుంటుంది.

ఆజాద్ ప్రకారం ప్రాథమిక స్థాయి నుండీ విశ్వవిద్యాలయ స్థాయి వరకూ మాతృభాషలోనే విద్యాబోధన జరగాలి. ప్రాథమిక మాధ్యమిక స్థాయిల వరకు సమస్య లేదుకాని ఉన్నతవిద్యలో మాత్రం మాతృభాషలో విద్యాబోధన సవాళ్ళతోకూడుకొన్నదని అన్నారు. అయినప్పటికీ ఈ విషయంలో వెంటనే పని ప్రారంభించాలనీ ఇక్కడ కూడా ఒక ఐదు సంవత్సరాల కాలవ్యవధిని యేర్పాటు చేసుకోవాలనీ ఈ మధ్యకాలంలో ఎంతటి అభివృద్ధిని సాధించాలంటే ఆరో సంవత్సరంనుండి ఉన్నత విద్యకు చెందిన అన్ని శాఖల్లోనూ

మాతృభాషే బోధనా మాధ్యమంగా ఉండేలా చూడాలని స్పష్టం చేశాడు. ఇలా అంటున్నామంటే మన విద్యావ్యవస్థలో ఇంగ్లీషుకు అసలెలాంటి స్థానమూ లేకుండా చేయడం కాదనీ, యూరప్, అమెరికాల్లో సాధించిన అభివృద్ధితో సంపర్కంలో ఉండడానికి ఇంగ్లీషు సాంగత్యం అవసరమనీ, **ఇంగ్లీషు అంతర్జాతీయ భాషగా ఉంది కాబట్టి మన ప్రయోజనాలకోసమే దాన్ని ఒక ముఖ్యమైన ద్వితీయభాషగా చదువుకోవాలనీ తెలియజేశారు.** ('సెలెక్టెడ్ వర్క్స్ ఆఫ్ మౌలానా అబుల్ ఆజాద్' రవీంద్రకుమార్ (సంపాదకులు), సంపుటి. 3 పుటలు 97-106).

1948 జనవరి 13న సెంట్రల్ అడ్వైజరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ 14 వ సమావేశంలో మాట్లాడుతూ **"ఒక విదేశీ భాష ద్వారా విద్యనందించడం ప్రాథమికంగా తప్పు" అని నిక్కచ్చిగా అభిప్రాయపడిన మౌలానా ఆజాద్ ఒక విదేశీ భాషద్వారా (ఇంగ్లీషుద్వారా) విద్యాభ్యాసం చేయడం ఒక మద్రాసీకి గాని, పంజాబీకి గాని, బెంగాలీకి గాని కష్టం కానపుడు ఒక భారతీయ భాషద్వారా (మాతృభాష) విద్యాభ్యాసం చేయడం వారికేవిధంగా కష్టమౌతుందని ప్రశ్నించారు. ఆంగ్లం కాకుండా ఏదేని భారతీయ భాషద్వారా విద్యాభ్యాసం చేయడంద్వారా కూడా భారతీయులు మేధోపరమైన ఐక్యతను సాధించగలరనీ, నిజానికి భారతీయ భాషల్లో విద్యాభ్యాసం చేయని పక్షంలోనే మన మేధోపరమైన ఐక్యత తప్పకుండా దెబ్బతింటుందనీ స్పష్టంగా చెప్పారు. కాబట్టి విశ్వవిద్యాలయ స్థాయి బోధన కూడా మాతృభాషా మాధ్యమంలోనే జరగాలని నొక్కివక్కాణించారు.** (సంపుటి 3పు.113) విశ్వవిద్యాలయ స్థాయిలో బోధనా మాధ్యమ మార్పుకు సంబంధించిన విషయాన్ని చర్చించడానికి 1948 లో విశ్వవిద్యాలయాల ఉపకులపతులతో సమావేశాన్ని యేర్పాటు చేశాడు. అందులో క్రమక్రమంగా ఇంగ్లీషుకు నుండి మాతృభాషలకు మారడానికి నిర్ణయం తీసుకోవడంతోపాటుగా ఉన్నత విద్యకు తోడ్పడే విధంగా పారిభాషిక పదాలను తయారు చేసుకోవడానికి ఒక బోర్డును నియమించడానికి సంబంధించి కూడా నిర్ణయం తీసుకోవడం జరిగింది. (సంపుటి.6,పు.233)

1951 మార్చి 15న ఆల్ ఇండియా కాన్ఫరెన్స్ ఆఫ్ లెటర్స్ మొదటి సమావేశంలో ప్రసంగిస్తూ **బ్రిటీష్ పరిపాలనా కాలమంతటిలోనూ యూనివర్సిటీ స్థాయిలో మాతృభాషలు బోధనామాధ్యమంగా లేకపోవడంచేత వాటి అభివృద్ధి కుంటుపడిందనీ, స్వతంత్ర భారతదేశంలో వాటికి గుర్తింపూ, గౌరవం లభించాయి కాబట్టి, రాబోయే 15 సంవత్సరాలలో అవి యూనివర్సిటీ స్థాయిలో ఇంగ్లీషు స్థానాన్ని ఆక్రమించబోతున్నాయి కాబట్టి ప్రభుత్వాల తోడ్పాటుతోనూ, యూనివర్సిటీ స్థాయి విద్యాబోధనతోనూ దేశీయభాషలు (మాతృభాషలు) అభివృద్ధి చెందబోతున్నాయని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.** (సంపుటి5,పు.15)

ఉన్నత విద్యలో మాతృభాషా మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించుకున్నాక ఈ మార్గాన్ని సులభతరం చేసుకోవడానికి పారిభాషిక పదాలను తయారు చేసుకోవాల్సిన అవసరం గూర్చి ఆలోచించారు మౌలానా ఆజాద్. 1948 జనవరి 16న కొత్తఢిల్లీలో జరిగిన 'ఆల్ ఇండియా ఎడ్యుకేషనల్ కాన్ఫరెన్స్'లో ప్రారంభోపన్యాసం చేస్తూ **పారిభాషిక పదాలు అంతర్జాతీయంగా ఆమోదం పొందినవి కాబట్టి వాటిని దేశీయభాషల్లోకి అనువదించుకోవాల్సిన అవసరం లేదన్నారు. సెంట్రల్ అడ్వైజరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ కూడా దీనికి అంగీకరించిందని తెలియజేశారు.** తన వాదనకు వత్తాసుగా ఈజిప్టును ఉదహరించారు. అది అరబిక్ నుండి పారిభాషిక పదాలను తయారుచేసుకున్నప్పటికీ తర్వాత వాటిని యథాతథంగా వాడడానికే నిశ్చయించుకొంది; ఎందుకంటే పారిభాషిక పదాలు అంతర్జాతీయంగా ఆమోదించబడి ఉన్నాయి. టర్కీ, ఇరాక్, చైనా, జపాన్‌లుకూడా ఈ పద్ధతినే అవలంబించాయని తెలిపారు. అయినప్పటికీ తత్త్వశాస్త్రం, తర్కం, గణితం, మొదలైన వాటిల్లో ప్రాచీన భారతదేశంలో వాడుకలో ఉన్న పదజాలాలను వాడాలని సలహా ఇచ్చారు. (సంపుటి3,పు.121-122)

కానీ 1950 నాటికి పారిభాషిక పదాలను యథాతథంగా వాడాలనే ఆలోచనను ఆయన మార్చుకొన్నట్లుంది. 1950 మార్చి 15 న పార్లమెంటులో సాధారణ బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతూ యూనివర్సిటీ స్థాయిలో మాతృభాషలో విద్యాబోధన చేయాలంటే పారిభాషిక పదాలకు సంబంధించిన అదిపెద్ద సమస్యను ఎదుర్కొనాల్సివస్తోందని వివరించారు. అందుకే హిందీకి సంబంధించినంతవరకు పారిభాషిక పదాలను తయారు చేయడానికి ఒక బోర్డును నియమించడానికి కేంద్ర విద్యాశాఖ నిర్ణయం తీసుకున్నదని తెలిపారు. సదరు బోర్డుకు పారిభాషిక పదాల నిఘంటువును తయారుచేసే బాధ్యతను అప్పగిస్తామన్నారు. దీనికోసం బడ్జెట్‌లో కొంతమొత్తం కేటాయించినట్లుకూడా తెలిపారు. వివిధ రాష్ట్రప్రభుత్వాలు కూడా తమతమ ప్రాంతీయ భాషల్లో పారిభాషిక పదాల నిఘంటువులను తయారు చేయాలని వాంఛించాయి. (సంపుటి.4.పు.217)

భాషాపరమైన మైనారిటీల హక్కులకు సంబంధించి కూడా మౌలానా ఆజాద్‌కు స్పష్టమైన అభిప్రాయాలుండేవి. వారి హక్కుల పట్ల ఆయన మిక్కిలి సున్నితత్వాన్ని ప్రదర్శించాడు. ఏదేని ఒక రాష్ట్రంలో ఆ రాష్ట్రభాషకు భిన్నమైన మాతృభాషను కలిగి ఉండిన భాషాపరమైన మైనారిటీల సమూహానికి తమ మాతృభాషలో విద్యాభ్యాసం చేసే హక్కూ, అవకాశమూ ఉండాలని నొక్కిచెప్పారు మౌలానా ఆజాద్. సెంట్రల్ అడ్వైజరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో ఈ విషయానికి సంబంధించి నిర్ణయం తీసుకోవడం జరిగింది. దీని ప్రకారం ప్రాథమిక స్థాయిలో కనీసం 40 మంది విద్యార్థులూ, మాధ్యమిక స్థాయిలో "తగినంతమంది" ఉంటే వారి మాతృభాషలో విద్యనందించే విధంగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు తగిన యేర్పాట్లు చేయాలని కోరారు. 1949 ఫిబ్రవరి 25 న కేంద్రశాసన సభలో ఈ విషయానికి సంబంధించి జి.యస్.గుహ అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. కొన్ని రాష్ట్రాల్లో భాషాపరమైన మైనారిటీలు మాతృభాషలో విద్యార్జన హక్కుకు సంబంధించిన ఉల్లంఘనలకు సంబంధించి తనకు ఫిర్యాదులందుతున్నాయని ఆవేదనతో అన్నారు. (సంపుటి.4, పు.67)

1949 ఆగష్టు 19న కొత్తఢిల్లీలో జరిగిన వివిధ రాష్ట్ర ప్రభుత్వాల

విద్యాశాఖామంత్రుల సమావేశంలో భాషాపరమైన మైనారిటీల మాతృభాషల్లో విద్యార్జన హక్కును గూర్చి ప్రత్యేకంగా నొక్కిచెప్పారు మౌలానా ఆజాద్. వివిధ రాష్ట్రాల్లో ఉన్న భాషాపరమైన మైనారిటీల మీద ఆయా రాష్ట్రాల్లోని మెజారిటీ భాషల్ని రుద్దడంగూర్చి ఆందోళన వ్యక్తం చేశారు. **భాషాపరమైన మైనారిటీలు ఉపయోగించే భాషలు కూడా భారతీయ భాషలే కాబట్టి విద్యార్జన కోసం / బోధనా మాధ్యమంగా వాటిని ఉపయోగించడంలో ఏలాంటి సమస్యా ఉండకూడదన్నారు. మన లక్ష్యం ఐక్యతను సాధించడమైనప్పటికీ ఐక్యత అనేది మెజార్టీ భాషల్ని రుద్దడం ద్వారా సాధించలేమన్నారు.** అందుకే సెంట్రల్ అడ్వైజరీ బోర్డు ఆఫ్ ఎడ్యుకేషన్ కనీస సంఖ్యలో విద్యార్థులుంటే ప్రాథమిక స్థాయిలోనూ, తగినంతమంది కోరితే మాధ్యమిక స్థాయిలోనూ విద్యాబోధన భాషాపరమైన మైనారిటీల మాతృభాషలోనే జరగాలని ఏకగ్రీవంగా తీర్మానించిందని తెలిపారు. **పిల్లల మాతృభాష ఏదో వాళ్ళ తల్లిదండ్రులు తప్ప మిగిలినవారు నిర్ణయించగలరా అని ప్రశ్నించారు.** కొత్తగా సంపాదించుకొన్న స్వాతంత్ర్యం సందర్భంలో భాషా సమస్యకు సంబంధించి సంతృప్తికరమైన సమాధానాన్ని సాధించడం అత్యంత ప్రధానమైందన్న ఆజాద్-మాతృభాషలాంటి ప్రాథమిక విషయాలకు సంబంధించి సమస్యలు వచ్చేవిధంగా మనం ప్రవర్తిస్తే అది మన జాతిజీవనానికే ప్రమాదం కలుగజేస్తుందని హెచ్చరించారు. కాబట్టి భాషాపరమైన మైనారిటీల మాతృభాషల్లో విద్యాబోధనకు సంబంధించి విశాల హృదయంతోనూ, ఉదారంగానూ వ్యవహరించాలని ఆకాంక్షించారు. (సంపుటి.4,పు.118-123).

భాషాపరమైన మైనారిటీలకు వారి భాషల్లో విద్యాబోధన మాధ్యమిక స్థాయి వరకు మాత్రమే యివ్వగలమనీ, యూనివర్సిటీ విద్యకై వారు తామున్న రాష్ట్ర భాషను తప్పకుండా నేర్చుకోవాల్సిందేననీ ఖచ్చితంగా చెప్పారు మౌలానా ఆజాద్. 1949 మార్చి 18న కేంద్ర శాసనసభలో మొత్తం విద్యనంతటినీ - ప్రాథమిక స్థాయి నుండీ యూనివర్సిటీ స్థాయి వరకు - మాతృభాషలోనే ఎందుకివ్వకూడదు అని మౌలానా హజ్రత్ మోహాని (ఉత్తర ప్రదేశ్) మౌలానా ఆజాద్‌ను ప్రశ్నించాడు. ఉర్దూ మాధ్యమంలో ఉన్నత విద్య ఎందుకివ్వకూడదనేది హజ్రత్ మోహాని పరోక్ష ప్రశ్న. దీనికి సమాధానమిస్తూ మాధ్యమిక స్థాయి వరకూ అది సాధ్యమేనని, కానీ యూనివర్సిటీ విద్యమాత్రం ఒకే రాష్ట్రంలోని వివిధ భాషల్లో ఉదాహరణకు హిందీ, ఉర్దూ లేదా తెలుగు, ఉర్దూ - యివ్వడం కుదరదని యూనివర్సిటీ విద్యమాత్రం ఒక ప్రాంతంలోని ఒకే ప్రాంతీయ భాషలో ఉండాలన్నారు. మాతృభాషలో విద్యాభ్యాసానికి సంబంధించి హజ్రత్ మోహాని చాలా దూరం వెళ్ళారు. చాలా ఆదర్శంగా ఆలోచించారు. వాస్తవానికి పరిస్థితులు భిన్నంగా ఉండినాయి. వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు ఉదాహరణకు ఉత్తర ప్రదేశ్, బీహార్-భాషాపరమైన మైనారిటీల మాతృభాషలో విద్యార్జనకు సంబంధించిన హక్కును ఉల్లంఘిస్తున్నాయని తనకు అనేక ఫిర్యాదులందుతున్నాయని మౌలానా ఆజాద్ తెలిపారు. (ప్రాథమిక, మాధ్యమిక స్థాయిలకు సంబంధించే పరిస్థితి ఇలా ఉంటే, యూనివర్సిటీ విద్యగూర్చి ఎలా ఆలోచించగలమనేది అజాద్ వాదన.) ఈ విషయానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చిస్తోందని, త్వరలోనే వివిధ రాష్ట్రాల విద్యాశాఖ మంత్రులతో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. (సంపుటి.4,పు.85)

స్వాతంత్ర్యం సిద్ధించాక దేశంలోని వివిధ వ్యవస్థలను ముఖ్యంగా విద్య, సాంస్కృతిక రంగాలను నిర్వలనీకరించడంలో వలసభావాలనుండి విముక్తి చేయడంలో ప్రముఖ పాత్ర పోషించారు మౌలానా ఆజాద్. అంటే జాతీయ పునాదిపై సదరు రంగాలను గట్టిగా రూపుదిద్దాలనుకున్నారు. భారత దేశ విద్య, అందులోనూ మాతృభాషలో విద్య, స్త్రీ విద్య, మైనారిటీల విద్య పట్ల మౌలానా ఆజాద్ ప్రదర్శించిన క్రాంతదర్శిత్వం ద్యోతకమవుతుంది. ఎందుకంటే ఆయన లేవనెత్తిన అనేక ప్రశ్నలకు ఆయనే సూచించిన సమాధానాల సాధన దేశంలో కొనసాగుతూనే ఉంది. **ప్రజాస్వామ్యాన్ని పరిపుష్టం చేయగల అంశాల్లో విద్య ప్రాణసమానమైందని గుర్తించాడు ఆజాద్. ఏకకాలంలో విద్యను ప్రజాస్వామీకరించడం విద్యలో భాషను ప్రజాస్వామీకరించడాలను పరమ లక్ష్యాలుగా గుర్తించాడాయన.** సాంకేతిక విద్య బలాన్ని పరిగణించాడు. సామాజిక శాస్త్రాల ఆత్మిక సౌందర్యాన్ని విస్మరించలేదు. విద్యకు సాంస్కృతిక రంగాలతో ఉన్న భావసారూప్యతను నిలబెట్టదలచాడు. ఆంగ్లం దేశంలో వివిధ భాషల ప్రజలమధ్య భావ సంశయాన్ని అనుసంధానం చేస్తే దాన్ని గౌరవిస్తూనే దేశభాషల అభివృద్ధిద్వారా వాటి ఆత్మగౌరవాన్ని దేశ సాంస్కృతిక వైవిధ్యాన్ని నిలబెట్టటానికి పూనిక వహించాడు. వర్తమాన దేశ విద్యా వ్యవస్థ సాగుతున్న దిశలో సాధించిన విజయాలు మౌలానా ఆజాద్ ప్రారంభించినవేనని, ఎదుర్కొంటున్న అపజయాలు,సవాళ్ళు ఆయన దృక్పథాన్ని సాకారం చేసుకోవడంలో మనం మిగుల్చుకున్న వైఫల్యాలేనని ఆయన ప్రతిపాదనలు రుజువు చేస్తున్నాయి.

డాక్టర్ షేఖ్.మహబూబ్ బాషా
మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ విశ్వవిద్యాలయం
చరిత్ర విభాగంలో సహాయ ఆచార్యులు
డాక్టర్ మొహమ్మద్ కరీం రీసెర్చ్ అసిస్టెంట్,
ఐ.క్యూ.ఏ.సీ., మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ

సి. వి. క్రిష్ణయ్య
93965 14554

అక్షరాలతో ఆటలు - 2

గత సంచికలో పిల్లలు భాషా సాహిత్యాలతో ఆనందించాలనీ, అందుకు లిపి నేర్చుకునేటప్పుడే అక్షరాలతో ఆటుకోవడం నేర్వాలని చెప్పుకొన్నాం. ఈ సంచికలో అక్షరాలతో ఆటలు ఎలా తయారుచేయాలో, ఎలా నేర్వాలో, పిల్లలు తెలుగు భాషను ఇష్టపడేటట్లు ఎలా చేయవచ్చో తెలుసుకొందాం.

ఇందుకు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. సాధారణంగా తరగతి గదిలో ఒకరిద్దరు పిల్లలు చురుగ్గా ఉండి, అన్నీ తామే చెబుతూ ఉంటారు. మిగిలిన పిల్లలు ప్రేక్షకులుగా మిగిలిపోతారు. స్వయంగా ఆలోచించడం మరచిపోయి ఉంటారు. ప్రతి అబ్బాయి ప్రతి అమ్మాయి పాల్గొనేలా ప్రయత్నించాలి. ఇందుకు రెండు పద్ధతులు పాటించాలి. 1. జట్టు పద్ధతి. (ఇద్దరు లేదా ముగ్గురు విద్యార్థులు) 2.ఏకాంతంగా ఒక్కరే పాల్గొనడం. ఏకాంతంలో ఆలోచిస్తారు. జట్టులో చర్చిస్తారు.

ప్రస్తుతం 3వ తరగతి స్థాయి, ఆపై తరగతుల పిల్లలకు ఉపయోగపడేట్టు ఉన్న ఆటలు పరిచయం చేస్తున్నాను. ఒకే ఆటను పిల్లల స్థాయినిబట్టి తేలికనుండి క్లిష్టతరంగా ఉండేటట్లు పదజాలం పరిచయం చేయవచ్చు.

3వ తరగతి పిల్లల స్థాయి ఎలా ఉంటుంది? ఇప్పుడిప్పుడే కూడికూడి చదువుతూ ఉంటారు. సరిగ్గా రాయడం రాదు.

ఇప్పుడు మనం పిల్లలకు కొత్త పదజాలం పరిచయం చేయడంలేదు. వారికి తెలిసిన పదాలను బయటకు లాగి వాటిని పలురకాలుగా వాక్యాలలో ప్రయోగించి అర్థాలు తెలుసుకొనేటట్లు చేస్తున్నాం.

మన మెదదుకూడా కంప్యూటర్ లాంటిదే. కంప్యూటర్‌లో మనకు కావలసిన దానిని ఎలా వెదుకుతామో, అలాగే మన మెదడులో ఉన్న జ్ఞాపకాలను (జ్ఞానాన్ని) వెలికితీయాలి. ఇందుకు మనం సరైన ప్రశ్నను సంధించాలి. మళ్ళీ ఎదురు ప్రశ్న వేసేటట్లు (సందేహించేటట్లు) ప్రశ్న ఉండకూడదు.

ఈ క్రింది ప్రశ్నలను చూడండి.

1.ఏదో ఒక పదం చెప్పండి?

ఏ పదం చెప్పాలి? అనే ప్రశ్న ఉదయిస్తుంది.

2. ఒక చెట్టు పేరు చెప్పండి?

ఏ చెట్టు పేరు చెప్పాలి? అనే ప్రశ్న ఉదయిస్తుంది.

3. ఒక పండ్ల చెట్టు పేరు చెప్పండి?

అరటి, మామిడి, జామ, సపోటా - ఇలా చాలా పదాలు వరసగట్టి వస్తాయి.

ఇలాగే భాషకు సంబంధించి “అ”తో వచ్చే పదాలు చెప్పండి. ‘క’తో వచ్చే పదాలు చెప్పండి అని అడిగినప్పుడు ఆయా పదాలు వెంటనే గుర్తుకొస్తాయి. ‘క’ గుణింతం చెప్పండి అని అడగడానికి, రాయమని చెప్పడానికి బదులు మొదటి అక్షరం దీర్ఘం ఉండే పదాలు (కాయ, పాప, తాత) రాయండి అని అడిగితే పిల్లలకు ఉత్సాహంగా ఉంటుంది. ‘ప’గుణింతం ఉన్న పదాలు రాయండి. (పిలక, పీట, పూలు, చేప, సపోటా) అని అడగవచ్చు. కేవలం ఒక అక్షరానికి సంబంధించి గుణింతం (క,కా,కి, కీ,కు......) రాసినందువల్ల పిల్లల్లో ఆలోచనలు రావు.

ఇందులో సృజనాత్మకత లేదు. విసిగిపోతారు. ఇంతకంటే మెరుగైన పద్ధతులు చాలా ఉన్నాయి.

తెలుగు భాషలో ప్రాసకు చాలా ప్రాధాన్యత ఉంది. అకారాంత, ఉకారాంత పదాలు (పలక, పడక) (వారు, తాడు) ఎక్కువ. ఇలాగే అచ్చతెలుగు ద్విత్వాక్షర పదాలు (అట్ట, జిడ్డు) కూడా ఎక్కువే. ఈ పదాలతో ప్రాసవచ్చేటట్లు ఆటలు రూపొందించుకోవచ్చు.

1. కాలు, పాలు.....(చివర “లు” ఉండే పదాలు రాయండి)

2. పాము, రాము.....(చివర “ము” ఉండే రెండు అక్షరాల పదాలు రాయండి)

3. అట్టు, చెట్టు.....(చివర “ట్టు” ఉండే పదాలు రాయండి)

1. ప్రాస పదాల పట్టిక - పూరించండి.

1.	0	కు	చు	డు	పు	గు	జు	డు	దు	బు	ను	ము	రు	లు
2.	కా	-	చు	టు	పు	గు	-	-	దు	-	ను	ము	రు	లూ
3.	చా	కు												
4.	తా	కు												
5.	పా	కు	-	టు	-	గు	-	డు	దు	-	-	ము	రు	లు
6.	దా													
7.	బా	కు												
8.	రా	కు												
9	సా	కు												
10	లా													

2. ప్రాస పదాల పట్టిక – పూరించండి.

	1	2	3	4	5	6	7	8	9	10	11
1		క్కు	ట్టు	గ్గు	ఢ్డ	ద్దు	మ్మ	న్న	ర్రు	ల్లు	ళ్లు
2	క	క్కు	ట్టు	–	–	ద్దు	మ్మ	న్న	ర్రు	ల్లు	ళ్లు
3	త	–									
4	ప	–									
5	గ	–									
6	జ	–									
7	ద	క్కు									
8	మ	క్కు									
9	త	క్కు									
10	వ	–									

పై పట్టికలో నిలువు మొదటి వరుసల్లో ఉన్న అక్షరాలతో అడ్డం మొదటి వరుసల్లోని అక్షరాలను కలుపుతూ ఏవి అర్థవంతమైన పదాలుగా వస్తాయో ఆ అక్షరాలను గడుల్లో నింపాలి. విడిగా వాక్యాలలో ప్రయోగించాలి. ఉదాహరణకు ఒకటవ పట్టిక చూద్దాం. 1వ పట్టికలో నిలువు ఒకటో నెంబరు వరుసలోని అక్షరాలను అడ్డం 1వ నెంబరు వరుసలో అక్షరాలు కలిపితే వచ్చే పదాలు మొదటి వరుస "కా" కు కలిపి చూద్దాం . కాచు, కాటు, కాపు, కాగు, కాదు, కాను, కాము, కారు, కాలు, నీరు కాచుకొంటారు. పాము కాటు వేస్తుంది. చెట్టు కాపుకు వచ్చింది. నీళ్లు కాగుతున్నాయి. తీపి ఆరోగ్యానికి పంచిదికాదు. నేను చెడ్డదాన్నికాను. మేము ఈ వూరి వాళ్లము కాము. కారులో ఊరికి వెళ్లాము. కాలు నొప్పిగా ఉంది.

పిల్లలు అర్థాలు విడిగా చెప్పలేకపోతే టీచర్ వాక్యంలో ప్రయోగించి అర్థం అడగాలి.

పట్టికలో అడ్డం వేరే అక్షరాలు ఉపయోగించి మళ్ళీ కొత్త పదాలు సృష్టించవచ్చు. నిలువు అక్షరాలు మార్చి కొత్త పదాలు సృష్టించవచ్చు – ఇలా వందల పట్టికలు తయారవుతాయి.

5.అంత్య ప్రాసలతో ఆటలు

అక్క	తుక్కు	అన్న	కన్ను	అట్ట	అట్టు
నక్క	చెక్కు	నిన్న	తున్ను	కట్ట	పుట్టు
చక్క	పొక్కు	మొన్న	జున్ను	తట్ట	చెట్టు

ఈ పట్టికలో ఉన్నట్లు బోర్డు మీద రాసి పిల్లల్ని తమ నోట్ పుస్తకంలో రాసుకొని వాటి కింద అలాంటి పదాలే రాయమని అడగాలి.

(అ)ఏకాంతంగా ఎవరికి వారు ఆలోచించి స్వయంగా రాయాలి.

(ఆ) ఇద్దరు లేదా ముగ్గుర్ని జట్టులుగా చేసి రాయమని చెప్పాలి.

(ఇ) పిల్లల్ని జట్లుగా చేసి జట్టుకు నెంబర్లు ఇచ్చి – ఒక్కో జట్టు నుండి ఒక్కొక్కరే వచ్చి ఏదోఒక పదంరాసి పొమ్మనాలి. జట్టులో ముగ్గురుంటే మూడు రౌండ్లు లేదా ఆరు రౌండ్లు రాసేవరకు ఆట సాగాలి. జట్టులో రాని పిల్లలకు నేర్పించి పంపవచ్చు.

6. ఇచ్చిన అక్షరాలతో మాత్రమే పదాలు తయారు చేయండి

వ,క,డ,ం,ప – పడవ, పడక, పకపక, వడ, వండడం, వంపడం, వంక, వడకడం, కడవ, కండ, కడ, కంప, కడప,

7. ఇచ్చిన అక్షరాలు, వాటి గుణింతాలు వత్తులతో పదాలు చేయండి. మ,క–మామ,మమ్ము,మిమ్ము,మేము,ముక్కు మేక,మైకా, మొక్కు, మెక్కుమాకు, కాక, కాకి, కేకు, కోక, కైక, కుక్క, కిక్కు, కూకో, కక్కు, కామా, కమ్ము, కమ్మీ, కొమ్ము, మమ్ము, కైమా– కేవలం రెండక్షరాలతో ఇన్ని పదాలా అని ఆశ్చర్యపోతారు.

8.రెండక్షరాల ప్రాస : పదం చివర రెండక్షరాలు మారకూడదు. మొదటి అక్షరం మార్చి మరిన్ని పదాలు రాయండి.

పీపాలు	అలుగు	గొడుగు	అరుగు	నలుపు	అమల
నేపాలు	కలుగు	అడుగు	పరుగు	తెలుపు	కమల

9. ఇచ్చిన ఆధారంతో అక్షరాలు పూరించండి

ప _ వ (నీటిలో ప్రయాణిస్తుంది.)

ప _ పు (ఒక రంగు)

ప _ లు (రాత్రి కాదు)

_ నస (ఒక పండు)

పం – (ఒక జంతువు)

ఏవైనా మంచి విషయాలు, విజ్ఞానదాయకమైన విషయాలు ఆసక్తిగా చెప్పాలనుకున్నప్పుడు ఆధారంతో కనుక్కోమని అడగవచ్చు. ఉదా॥______________ కూరలు (ఈ కూరలు తింటే రక్తం ఉత్పత్తి అవుతుంది. క్యా___________(ఈ దుంప తింటే కంటికి మంచిది)

విశ్లేషణ – చదువులో ఆసక్తి ఉండాలి. తెలుసుకోవాలనే కుతూహలం కల్గించాలి. ఎప్పుడైతే కుతూహలం పుడుతుందో ఆలోచిస్తారు. అన్వేషిస్తూ ఆలోచిస్తే ఆనందం కల్గుతుంది.

ఆకలి తీర్చుకోడానికి ఆహారం సంపాదిస్తే సరిపోదు. దాన్ని తినాలి. మన పిల్లలు అక్షరాలు పదాలు నేర్చుకుంటారు. చదవడం నేర్చుకొంటారు. కాని వాటిని ఆనందంగా వినియోగించుకోరు. నేర్చుకొన్నందువల్ల ఉపయోగం ఏమిటి?

చూచిరాత, ఉక్తలేఖనం(డిక్టేషన్) వంటి సంప్రదాయ పద్ధతులను కూడా క్రీడలుగా మలచవచ్చు. విషయ జ్ఞానాన్ని, పజిల్స్ ద్వారా వినోదపూర్వకంగా నేర్పవచ్చు. పజిళ్లు ఎలా తయారు చేయాలో చూచిరాత డిక్టేషన్లు ఎలా అటలుగా ఆడించవచ్చో వచ్చే సంచికలో 3వ భాగంలో చూడండి.

జె.డి.ప్రభాకర్
8500227185

మాతృభాషా విద్యామాధ్యమం- దేశ ఆర్థికాభివృద్ధి

దేశ ఆర్థిక ప్రగతి దేశంలో ఉన్న వనరుల వినియోగం, దానికి కావలసిన నైపుణ్యాల మీద ఆధారపడి ఉంటుంది. శ్రామికుల నైపుణ్యాలను మెరుగుపరిచే నాణ్యమైన విద్యతో అది సాధ్యపడుతుంది. మనిషిచేసే ఏ పనికి అయినా మూలం జ్ఞానమే. మానవుడు సంఘజీవిగా ఎదుగుతున్న క్రమంలో అనుభవంలో నుంచి తాను చేస్తున్న పనిని మెరుగుపరుచుకుంటూ సంపద సృష్టి మొదలుపెట్టాడు. పనికి నైపుణ్యాన్ని జోడిస్తూ పనిని ఆధునీకరించాడు. దాని ఫలితమే నేడు కోకొల్లలుగా వెలసిన పరిశ్రమలు, సేవా సంస్థలు మొదలగునవి. దాని కారణంగానే నేటి చదువులు కూడా నైపుణ్యాలను తీర్చిదిద్దే దిశగా మలచడం జరిగింది. దేశంలో ఆరోగ్య రంగం, పారిశ్రామిక రంగం, సేవా రంగం, వ్యవసాయం ఇలా ఏ రంగం అయినా పటిష్టంగా ఉండాలంటే నాణ్యమైన విద్యను అభ్యసించిన వారు వాటిలో పనిచేస్తూవుండాలి. మానవాభివృద్ధిని ఎటువంటి ప్రమాణాలతో కొలిచినప్పటికి వాటన్నిటా ఉమ్మడిగా కనిపించేది-మనిషి సంపాదించిన జ్ఞానము. అభివృద్ధి నాణ్యమైన విద్యతోనే సాధ్యపడుతుంది. విద్యార్థి దశ నుండే పాఠ్యపుస్తకాల ద్వారా వాటిని అభ్యసిస్తూ ప్రగతి దిశగా ప్రయాణించాలని నూతన విద్యావిధానం2020లో కూడా చేర్చడం జరిగింది. విద్యారంగంలో భాష క్రియాశీలక పాత్ర పోషిస్తోంది. జూలై29, 2020న కేంద్ర మంత్రివర్గం ఆమోదించిన జాతీయవిద్యావిధానం(NEP), పాఠశాలల్లో బోధనా మాధ్యమం సాధ్యమైన చోట 5వ తరగతి వరకు- ప్రాధాన్యంగా 8వ తరగతి వరకు- మాతృభాష లేదా స్థానిక లేదా ప్రాంతీయ భాష ఉంటుందని తెలిపింది. అలాగే కాలానుగుణంగా ప్రభుత్వం కూడా విద్యపై జాతీయ స్థూల ఆదాయం(GDP) పెంచుతూ వస్తోంది. ప్రస్తుత ప్రభుత్వం 2014లో నుండి ఇప్పటివరకు 3.8 శాతం GDP భాగాన్ని 4.6 శాతం GDP భాగానికి పెంచి విద్యారంగాన్ని మెరుగుపరచడానికి ఉపయోగిస్తోంది. ప్రభుత్వం విద్యారంగంపై ఖర్చు పెట్టడమే కాకుండా అందులో ఉపయోగించే భాష కొరకు కూడా ఖర్చు పెడుతూంది.

విద్యావిభాగం(రెవెన్యూఖాతా)ద్వారా రంగాలవారీగా విద్యపై ఖర్చు.
కేంద్రం మరియు రాష్ట్రాలు/యుటిలు శాతం వాటాతో 2017-18 (రూ. కోటి)


రంగం	రాష్ట్రాలు/యుటిల ఖర్చు	రాష్ట్రంవాటా శాతం	కేంద్రం ఖర్చు	కేంద్రవాటా శాతం	మొత్తం ఖర్చు	మొత్తంవాటా శాతం
ప్రాథమిక విద్య	213861.97	49.98	34228.53	42.90	248090.50	48.87
మాధ్యమిక విద్య	146325.96	34.20	11859.14	14.86	158185.10	31.16
వయోజన విద్య	566.89	0.13	368.58	0.46	935.47	0.18
భాషా అభివృద్ధి	1731.11	0.40	454.13	0.57	2185.24	0.43
విశ్వవిద్యాలయం మానవవనరుల విద్య	47913.30	11.20	17045.78	21.37	64959.08	12.80
సాంకేతిక విద్య	13784.55	3.22	15556.49	19.50	29341.04	5.78
సాధారణ విద్య	3707.54	0.87	273.30	0.34	3980.84	0.78
మొత్తం విద్య	427891.32	100.00	79785.95	100.00	507677.27	100.00

మూలం: మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం2017-2018 నివేదిక

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాథమికవిద్య పైన ఎక్కువ దృష్టి కేంద్రీకరించి 48.87 శాతం ఖర్చు పెట్టారని తెలిపారు. మాధ్యమిక విద్యకు 31.16 శాతం, విశ్వవిద్యాలయాలు మరియు ఉన్నత విద్యకై 12.80 శాతం, సాంకేతిక విద్యకు 5.78 శాతం ఖర్చు చేసినట్టు వెల్లడించారు.

మాతృభాష మాధ్యమ విద్యతోనే నాణ్యమైన విద్య

సమాజంలో ప్రజల ఆర్థిక అసమానతలకు, నిరుద్యోగానికి, పేదరికానికి అనేక కారణాలు ఉన్నప్పటికీ అందులో విద్యా మాధ్యమం ముఖ్యమైనది. ఇంగ్లీష్ మీడియం సమాజంలో ఆర్థిక అసమానతలకు దారితీస్తుంది. అటువంటి చదువులు చదవక స్తోమతకు నోచుకోక నిరక్షరాస్యతా, నిరుద్యోగం పెరుగుతాయి. మనిషి జీవితంలో ఆహ్వానించదగని విషయాలు చోటు చేసుకున్నప్పుడు మూలాల్లోకి వెళ్లి సమస్యను పరిష్కరించాల్సి ఉంటుంది. **పిల్లలకి ప్రాథమిక, మాధ్యమికవిద్య తమ జీవితంలో మూలంగా నిలుస్తుంది. తల్లి ఒడిలో ఏ భాష నేర్చుకుంటాడో, చుట్టూ సమాజం ఏ భాషలో వ్యవహరిస్తుందో ఆ భాషలోనే ప్రాథమిక విద్య, మాధ్యమిక విద్య ఉండాలి. చిన్ననాటి నుండే నాణ్యమైన విద్యను అందించాలి.** ఈ విధంగా మాతృభాషలోనే విద్యను అభ్యసింప చేసినప్పుడు ఆలోచన విధానంలో సృజనాత్మకతను అలవర్చుకున్నాడు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ జరిపిన సర్వేలో మాతృభాష మాధ్యమంలో చదివిన విద్యార్థులు పరాయి భాష మాధ్యమంలో



మూలం: మానవవనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ, భారత ప్రభుత్వం 2017–2018 నివేదిక.

చదివిన విద్యార్థులకంటే చదవడంలోనూ, రాయడంలోనూ, ఆలోచనా విధానంలోనూ ఎక్కువ సృజనాత్మకత కలిగి ఉన్నారని తెలిపారు.

మాతృభాష విద్యామాధ్యమ ప్రయోజనాలు:

- విద్యకు ఖర్చు తక్కువ అవుతుంది
- తక్కువ సమయంలోనే ఎక్కువ విషయాలు నేర్చుకోవచ్చు
- ఇంటి భాష– బడి భాష అనే అడ్డుగోడలు ఉండవు
- పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకుంటారు
- గ్రహణ శక్తి పెరుగుతుంది
- తరగతి గదిలో చురుకుగా పాల్గొంటారు
- ప్రశ్నించే తత్వం పెరుగుతుంది
- సృజనాత్మకత పెరుగుతుంది
- బడి మానేసే వారి సంఖ్య తగ్గుతుంది

యువతకు పారిశ్రామిక శిక్షణా మాధ్యమ భాష

ప్రపంచంలో అత్యధిక యువత ఉన్న దేశాలలో భారతదేశం ప్రథమ స్థానంలో ఉంది. 356 మిలియన్ల యువత కలిగిన దేశం ఆర్థికంగా ఇంకా వెనుకబాటులోనే ఉంది. పారిశ్రామిక వెలుగుబాటతో మానవ అభివృద్ధి విషయాలలో ఇప్పటికీ అభివృద్ధి చెందుతున్న దేశంగానే మిగిలిపోయింది. దేశానికి బలం అని చాటే విధంగా నేటి యువత పారిశ్రామిక రంగంలో దూసుకుపోవాలని కేంద్ర ప్రభుత్వం 'మేక్ ఇన్ ఇండియా' ద్వారా యువతను పారిశ్రామిక పరంగా ప్రోత్సహిస్తున్నారు. దీని ద్వారా2025 నాటికి పారిశ్రామిక రంగంలో25% జాతీయ స్థూల ఉత్పత్తి(GDP) పెరిగే ఈ విధంగా లక్ష్యాన్ని రూపొందించారు. మన దేశంలో గ్రామీణ పట్టణ యువతకు కావాల్సిన శిక్షణనిస్తూ... వస్తుఉత్పత్తి, పరిశ్రమల నిర్మాణం, వాటి అభివృద్ధి లక్ష్యంగా అడుగులు వేస్తోంది. అదేవిధంగా 'స్కిల్ ఇండియా' పేరుతో40 కోట్ల మంది యువతకి, మహిళలకి శిక్షణ ఇచ్చి 2022 నాటికల్లా నైపుణ్యం గల యువతను, మహిళలను తయారుచేయాలని కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోంది. అయితే **యువత, మహిళలు నైపుణ్యాన్ని నేర్చుకోవాలన్న, పనికి కావాల్సిన అవగాహన కలగాలన్నా, పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలన్నా శిక్షణ పాఠ్యాంశాలు స్థానిక భాషలో ఉండాలి. గ్రామీణ పేద మధ్యతరగతి యువకులకు నైపుణ్యత కేవలం వారి స్థానిక భాషలతోనే సాధ్యపడుతుంది.** 'స్కిల్ ఇండియా'లో ఉన్న వివిధ విభాగాలు మరియు శిక్షణ కార్యక్రమాలు స్థానిక భాషల్లో లేకపోవడం వలన అనుకున్న లక్ష్యాన్ని సాధించడం కష్టమవుతుంది. కాబట్టి స్థానిక భాషల ప్రాముఖ్యతను తెలుసుకుని శిక్షణ కార్యక్రమాలను, పుస్తకాలు స్థానిక భాషల్లోకి అనువదించినట్లయితే దేశ ఆర్థికాభివృద్ధి మరింత వేగంగా జరుగడానికి అవకాశం ఉంటుంది.

దేశంలో ఉన్న ప్రతి రంగానికి కేంద్ర బిందువు పాఠశాలలే. ప్రాథమికవిద్య దేశ భవిష్యత్తుకి ప్రధాన పాత్ర వహిస్తుంది. కాబట్టి పిల్లలకు ప్రాథమిక విద్యను 8వ తరగతి వరకు మాతృభాషలోనే అందించడం ఉత్తమం. నూతన విద్యావిధానం కూడా అన్ని భాషలకు, సంస్కృతులకు సమాన న్యాయం అందించేలా ఉండాలి. ప్రభుత్వ పాఠశాలలకు మంచి వసతులు కలిగిస్తూ నాణ్యమైన విద్యను మాతృభాష అందించడానికి కేంద్ర ప్రభుత్వంతోపాటు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా చిత్తశుద్ధితో పని చేయాలి. విద్యారంగానికి జాతీయ స్థూల ఉత్పత్తిలో4.6 శాతం నుండి 6 శాతానికి పెంచాలని విద్యావేత్తలు ప్రతిపాదించినట్టుగా కేంద్ర ప్రభుత్వం దీనిపై నిర్ణయం తీసుకోవాలి. విద్యపై పెట్టే పెట్టుబడితో దేశానికి ఆరోగ్యకరమైన ఆర్థిక వ్యవస్థను రూపొందించుకోగలము. శిక్షణ మాధ్యమంలోనూ స్థానిక భాషల పాత్రను గుర్తెరిగి, అమలుపరిచినట్లయితే దేశంలో యువత నైపుణ్యతతో మరింత బలోపేతమయ్యి దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుగా నిలుస్తారు. **మాతృభాష విద్యామాధ్యమమే దేశ ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతుంది.**

ఈ వ్యాసరచయిత పరిశోధక విద్యార్థి,
హైదరాబాదు విశ్వవిద్యాలయం.

స.వెం.రమేశ్

కొత్తమాటల పుట్టింపు

5

"అన్నయ్యా, నువ్వేమో తెలుగుమాటలకు గూటాలు ఉండవు, ఉండకూడదు అంటావు. అయితే అన్ని ఆకికల్లోనూ అందరూ, ముప్పై, నలబై,ఏబై,డెబ్బై,తొంబై అనే మాటలకు గూటలను పెట్టే రాస్తున్నారే! ఇవి తెలుగుమాటలు కావా, లేకుంటే కావాలనే తప్పుగా రాస్తున్నారా?" అడిగినాడు చిన్నయ్య.

"నాకు కూడా చాన్నాళ్లుగా అరగలి(సందేహం) ఇది. ఇవి తెలుగు మాటలే. మూడుపదులు ముప్పది. అదే ముప్పయి అయింది. 'పది'లో 'ప'కు గూటం లేదుకదా. ముప్పయి, నలబయి, ఏబయి, డెబ్బయి, ఎనబయి, తొంబయిలలో ఎలా వచ్చిందో!" నారాయణ కూడా అడిగాడు.

"అబ్బాయిలూ చెపుతాను వినండి. మీకేకాదు, తెలుగు వ్రాతలు నేర్చుకొన్నప్పటి నుండి నాకు కూడా అరగలే ఇది. కొన్నేళ్ల కిందట జరిగిన ముచ్చటను చెప్పాలి ఇక్కడ. ఏడాది నాకు సరిగ్గా గురుతు లేదు కానీ, తెలుగు తెలివరులు, తెలుగునుడికి కూడా చెన్నుడి(క్లాసికల్ లాంగ్వేజ్) గుర్తింపు ఇవ్వాలని గట్టిగా అడుగుతున్న నాళ్లు అవి. మైసూరులో బారతనుడుల నట్ట తెట్టువ(సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్) నుండి నాకూ మా బాబాయికీ పిలుపు వస్తే బయలుదేరి వెళ్లినాం"

"బాబాయి అంటే అమ్మనుడి ఆకిక కూర్పరి సామల రమేష్‌బాబుగారే కదా" నడుమన దూరి అడిగినాడు చిన్నయ్య.

"అవును ఆయనే. అప్పుడు ఆకికపేరు అమ్మనుడి కాదు, నడుస్తున్న చరిత్ర అని ఉండేది. మేమిద్దరమూ నుడివరులం కాము. కానీ తెలుగు ఎదుగుదల మీద అక్కర ఉన్నవాళ్లం. అందుకే కావచ్చు మాకు కూడా పిలుపువచ్చింది. మునివాపు వేళకు మైసూరుకు వెళ్లినాం. మాకు ఒక విడిదిలులో ఒక గదిని చూపించినారు. పైకి పోసుకొని(స్నానమాడి), ఉడుపులు మార్చుకొని, విడిదిలు బయటకు వచ్చినాం. చక్కని పచ్చికబయలులో చల్లగా కూర్చుని ముచ్చట్లాడుకొంటున్నారు ఏడెనిమిదిమంది పెద్దలు. అందరూ తెలుగువారే. అందరూ నుడివరు(బాషావేత్త)లే. మేము వెళ్లి వాళ్లతో కలిసినాం. నాకేమో కాస్త జంకుజంకుగా ఉంది. ఎందుకంటే నుడెసిది(బాషాశాస్త్రం)లో తలపండిన వాళ్లు వాళ్లంతా. ఏం మాట్లాడితే ఏం చిక్కు వస్తుందో అని మెదలకుండా కూర్చునున్నాను. వారిలో నేనెరిగిన వారు ముగ్గురున్నారు. బాబాయి నోరు విప్పినారు. ముప్పయి, నలబయి వంటి తెలుగుమాటలకు గూటాలు పెట్టడం తప్పుకాదా అని అడిగేసినారు..."

"ఏమయింది ఆనక? నువ్వు అడిగుంటే మారాడకపోయి ఉండవచ్చు. పెద్దాయనే అడిగేసినారు కదా, ఏదో ఒకటి చెప్పుండాలే" తమిగా అడిగినాడు చిన్నయ్య, నడుమన దూరి.

"అవును చిన్నయ్యా, నువ్వన్నది నిక్కమే. ఆ మాటను నేను అడిగి ఉంటే పట్టించుకొని ఉండరు. నన్నేమిటి, పెద్దాయననే పట్టించుకోలేదు కాసేపు. ఇంకా నొప్పి కొద్దిగానైనా సలుపుతూనే ఉంది నన్ను ఇప్పటికీ. అంచల గుంపులోకి రెండు కాకుల వెళితే ఊరుకొంటాయా, చీదరించుకొంటాయి, పొడిచి తరుముతాయి. కానీ వెళ్లింది కాకులు కాదు, పదునైన గోళ్లూ ముక్కులూ ఉన్న గ్రద్దలు. తరుమలేక పట్టించుకోనట్లు ఊరుకొన్నాయి..."

"అన్నయ్యా, వెక్కసం మాటలాడవద్దని నన్ను ఎప్పుడూ కసరుతుంటావు. నువ్వు ఇలా మాట్లాడుతున్నావేమిటి?" అన్నాడు చిన్నయ్య.

"చిన్నయ్యా, నడుమన దూరకు. అన్నయ్యను మాట్లాడనీ. ఇంకా ఎన్నాళ్లని ఈ తలవంపుల్ని దాచిపెట్టుకొని ఉంటాడు. బయటపెట్టనీ. అన్నయ్యవి వెక్కసపు మాటలు కావు. నొప్పితో పలుకుతున్న పలుకులు. చెప్పనీ ఊరకుండు" అన్నాడు నారాయణ.

"సరే అన్నయ్యా, నడుమన దూరను. ఇంతకీ ఏమయిందో చెప్పు" అడిగినాడు చిన్నయ్య.

"కాసేపు పట్టించుకోనట్లు ఉండి, వారిలో ఒకరు, 'అవి రూఢి(వాడుక) అయిపోయిన మాటలండీ, వాటిని ఇప్పుడేమీ చేయలేం' అన్నారు. 'ఏదో చేయాలని కాదండీ, అలా వాడడం సరయినదేనా' అన్నారు బాబాయి. 'సరయినదే. అది తెలియాలంటే, మీకు ద్రావిడనుడులన్నిటి గురించీ కొంతయినా తెలిసుండాలి. నుడెసిదిని సుంతయినా చదివుండాలి. తమిళంలో ముప్పదు, నాప్పదు అనే మాటల్లో 'ప్' వినిపిస్తుంది కదా. అదే పెద్దుసురు(మహాప్రాణం)గా మారింది తెలుగులో. దానిని గూటం అనకూడదండీ' అని తేల్చేసినారు. ఇంకొక పెద్ద. నేను ఊరుకోలేక, 'మరి ఐంబదు, ఎళువదు, ఎంబదు, తొన్నూరులలో 'ప్' లేదు కదండీ. ఏబయి, డెబ్బయి, ఎనబయి, తొంబయిలకు గూటాలు ఎందుకొచ్చినాయి?' అని అడిగినాను. వారి మోము నల్లబడింది. ఇంకొక పెద్ద కల్పించుకొని, 'తినేసి పడుకోవాలి కదా లేవండి' అంటూ ముగించేసినారు. పొగరుతో చెపుతున్నది కాదు నారాయణా. ద్రావిడనుడులు అన్నిటి గురించీ కొంతయినా తెలిసుండాలి అని, తమిళాన్ని ఆనుగా తెచ్చుకొన్న పెద్దకంటే, నాకే ఎక్కువ తమిళం తెలుసు. అది వారికి అప్పటికి తెలియదు అంతే. ఇటువంటి పట్టనితనాలూ పక్కకు తోసివేయడాలూ పిలిచి గొడవ పెట్టుకోవడాలూ చాలా చేసినారు నాపట్ల కొందరు. ముందుముందు మరికొన్ని చెప్పుకొందాంలే" అంటూ మారాడినాను.

"ఇంతకీ ఆ ముగ్గురిపేర్లు చెప్పనేలేదు అన్నయ్యా నువ్వు" అడిగినాడు చిన్నయ్య.

"అక్కరలేదు చిన్నయ్యా, చెప్పాలనుకొని ఉంటే అన్నయ్యే చెప్పేవాడు కదా" అన్నాడు నారాయణ.

"అవును చిన్నయ్యా, వాళ్లు ముగ్గురూ నిక్కంగానే చాలా గొప్పవారు. తెలుగునుడికి ఎంతో ఉడిగం చేసినారు. పేర్లు అచ్చుకు

ఎక్కించి అగడుచేయడం పాడి కాదు" అన్నాను.

" అది సరే అన్నయ్యా, ముప్పై, నలభై, ఏభై...లకు గూటాలను పెట్టాలనా వద్దా?" గురుతు చేసినాడు చిన్నయ్య

"పెట్టకూడదు చిన్నయ్యా. పెట్టనే పెట్టకూడదు. అన్ని నుడులలో ఉన్నట్లే తెలుగులోనూ అలవు(ప్రామాణిక)నుడి, నెలవు(మాండలిక) నుడి ఉన్నాయి కదా. నెలవునుడిలో కూడా కుదురు(కులం)నుడి విడిగా ఉంటుంది కదా. అలాంటి ఒక కుదురునుడిలోనివే పై సదులు. పారు(బ్రాహ్మణు)ల నోళ్లలో మట్టుకే ఉండే నెలవునుడిని అలవునుడిగా మార్చేసినారు తెలివరులు. ఎవరు చేసినా తప్పుతప్పే. చదువుకొన్న పారులలో తప్ప మరొకరిలో ఈ సదులు వినబడవు. వాళ్లు కూడా రాసేటప్పుడు గూటాలను తగిలించి ముప్పయి నలబయిలను రాయడం ముమ్మాటికీ తప్పే. నెలవునుడిలో కతలూ కట్టురలూ రాసుకొనేటప్పుడు రాయవచ్చు కానీ, ఎసిదిని రాసేటపుడూ ఆకికల్లో అలవునుడిలో రాసేటపుడూ గూటాలను పెట్టకూడదు కాక పెట్టకూడదు. అలవునుడిలో ఒడ్లు, అడ్లు అని రాయకూడదు, వడ్లు అనే రాయాలి. సిన్న, సెంబు అని రాయకూడదు, చిన్న, చెంబు అనే రాయాలి. ఇక్కడ కూడా అంతే, ముప్పయి, నలుబయి, ఏబయి, డెబ్బయి, ఎనబయి, తొంబయి అనే రాయాలి. గూటాలతో రాయకూడదు" చెప్పినాను.

''బాగుందన్నయ్యా, తెలుగుమాటలకు గూటాలను తగిలించకూడదని తెలుసుకొన్నాం. ఏదయినా ఒక చేర్పును గురించి చెప్పన్నయ్యా" అన్నాడు నారాయణ.

"అన్నయ్యా, ఈయన ఎవరో, ముద్రణాలయం అనే పెరమాటకు అచ్చుగుడి అనే తెలుగుమాటను వాడినారు చూడు" అన్నాడు చిన్నయ్య.

"బాగానే ఉంది కానీ, గుడికి మారుగా ఏదయినా చేర్పును కలిపి పొందించి ఉంటే ఇంకా బాగుండేది. కార్యాలయాన్ని పనిగుడి అంటే బాగుంటుందా?" అన్నాడు నారాయణ.

"నువ్వన్నది నిక్కమే నారాయణా. చేర్పు అనేది, కుదురుకు అంటుకొనేదిగా కంటే కలసిపోయేదిగా ఉంటే మరింత చిన్నమాటలను పొందించవచ్చు. పైగా గుడి అంటూనే అందరికీ వేలుపు వెలసిన చోటుగా మట్టుకే తోస్తుంది. తెలుగులో 'ఇలు' అనే మాట ఉంది. 'ఇల్లు' అని ఈమాటకు తెల్లం. ఈమాటను నన్నయ కూడా వాడినారు. గుడి అంటే కూడా ఇల్లు అనే కదా తెల్లం. గుడికి తెన్నాటి(ఇప్పటి తమిళనాటి) తెలుగుమాట కోయిలు. కళింగ తెలుగులో కోవెల. కో అంటే వేలుపు. వేలుపు ఉండే ఇలు కాబట్టి కోయిలు అయింది. ఈ 'ఇలు' ను చేర్పుగా చేసుకొని కొత్తమాటలను పుట్టించవచ్చు" అంటూ మొదలిడినాను.

1. అగవు+ఇలు = అగవిలు ఆఫీస్.
(కార్యాలయం అంటున్నారు. అగవు అంటే పని)
2. అచ్చు+ఇలు = అచ్చిలు ప్రింటింగ్‌ప్రెస్.
(ముద్రణాలయం).
3. అడకు+ఇలు = అడకిలు బ్యాంక్.
(అడకు అంటే దాచి ఉంచి కావాలసినపుడు తిరిగితీసుకోవడం. తెన్నాటి తెలుగుమాట ఇది).
4. అరుగు+ఇలు = అరుగిలు ఆడిటోరియం.
(రంగమండపం అంటున్నారు).
5. ఉచ్చ+ఇలు = ఉచ్చిలు యూరినల్స్.
(మూత్రశాల అంటున్నారు. దాదాపు రెండువేల ఏళ్ల కిందట, ఇక్ష్వాకుదొరలు, నాగార్జునకొండ దగ్గర ఒక పలుచదువిలును నెలకొల్పినారు. అక్కడ యూరినల్స్‌కు 'ఉచ్చకుటి' అని రాతిపలకను చెక్కించి పెట్టినారు)
6. ఎరుక+ఇలు = ఎరుకిలు అకాడెమీ.
(ఎరుక అంటే జ్ఞానం)
7. ఎస+ఇలు = ఎసిలు/ఎసగిలు మ్యూజిక్ తియేటర్.
(ఎస అంటే సంగీతం. తెన్నాటి మాట)
8. కనబరుచు+ఇలు = కనబరపిలు ఎగ్జిబిషన్
(ప్రదర్శనశాల అంటున్నారు.).
9. కాల్చు+ఇలు = కాల్పిలు క్రిమెటోరియం.
10. కూడు+ఇలు = కూటిలు రెస్టారెంట్.
(బోజనశాల అంటున్నారు.)
11. కోగు+ఇలు = కోగిలు బార్బర్‌షాప్/సెలూన్.
(క్షౌరశాల అంటున్నారు. కోగు=గొరుగు.)
12. కోలు+ఇలు = కోలిలు పోలీస్‌స్టేషన్.
(రక్షకబట నిలయం అంటున్నారు. కోలు=కావలి; కోలుకారు=పోలీస్)
13. గూడు+ఇలు = గూటిలు డార్మెటరీ.
14. చదువు+ఇలు = చదువిలు కాలేజ్.
(కళాశాల అంటున్నారు)
15. చలిదాపు+ఇలు = చలిదాపిలు కోల్డ్‌స్టోరేజ్.
(శీతలగిడ్డంగి అంటున్నారు)
16. చలువ+ఇలు = చలువిలు లాండ్రీ.
17. తగవు+ఇలు = తగవిలు కోర్ట్.
(న్యాయస్తానం అంటున్నారు. తగువు = న్యాయం)
18. తమ్మ+ఇలు = తమ్మిలు పాన్‌బూత్.
19. తానేగి+ఇలు = తానేగిలు ఆటోస్టాండ్.
(తానేగి అంటే ఆటోరిక్షా)
20. తెరాట+ఇలు = తెరాటిలు సినిమా తియేటర్.
(చలనచిత్ర మందిరం అంటున్నారు)
21. తేనీరు+ఇలు = తేనీరిలు టీస్టాల్.
22. దంచు+ఇలు = దంపిలు ఫ్లోర్‌మిల్.
23. దొంతి+ఇలు = దొంతిలు అపార్ట్‌మెంట్.
24. నట్టువ+ఇలు = నట్టువిలు నాట్యమందిరం.
25. ననుపు+ఇలు = ననుపిలు ఫ్యాక్టరీ.
(కార్మాగారం అంటున్నారు. ననుపు=వృత్తి)
26. నారు+ఇలు = నర్సరీ.
27. నిలవ+ఇలు = నిలవిలు గోడౌన్.
(గోదాము అంటున్నారు.)
28. నోయి+ఇలు = నోయిలు లైబ్రరీ.
(గ్రందాలయం అంటున్నారు. నోయి=గ్రందం. ఇది తెన్నాటి తెలుగుమాట)
29. పట్టేగి+ఇలు = పట్టేగిలు రైల్వేస్టేషన్.

(ధూమశకట నిలయం అంటున్నారు. పట్టేగి=ట్రైన్)

30. పలుకు+ఇలు = పలుకిలు టెలిఫోన్ బూత్.

31. పలుచదువు+ఇలు= పలుచదువిలు యూనివర్సిటీ. (విశ్వవిద్యాలయం అంటున్నారు.)

32. పాలు+ఇలు = పాలిలు మిల్క్‌బూత్.

33. పేరేగి+ఇలు = పేరేగిలు బస్‌స్టేషన్.

34. మంట+ఇలు = మంటిలు ఫైర్‌స్టేషన్. (అగ్నిమాపక కేంద్రం అంటున్నారు).

35. మనుము+ఇలు = మనుమిలు జూ. (జంతుప్రదర్శనశాల అంటున్నారు. మనుము = జంతువు. తెన్నాటి తెలుగుమాట).

36. మరుగు+ఇలు = మరుగిలు టాయ్‌లెట్. (శౌచాలయం అంటున్నారు)

37. మిను+ఇలు = మిన్నిలు కరంటు ఆఫీస్. (విద్యుత్ కార్యాలయం అంటున్నారు)

38. వసతి+ఇలు = వసతిలు హోటెల్/ లాడ్జ్. (విశ్రాంతి గృహం అంటున్నారు)

39. విరుగు+ఇలు = విరుగిలు హాస్పిటల్. (వైద్యశాల అంటున్నారు. విరుగు = చికిత్స/ వైద్యం)

40. వేచు+ఇలు = వేచిలు వెయిటింగ్ రూమ్

41. వేలిమి+ఇలు = వేలిమిలు యజ్ఞశాల (వేలిమి=యజ్ఞం)

42. సంత+ఇలు = సంతిలు షాపింగ్‌మాల్

6

''అన్నయ్యా, నువ్వేమో నన్ను అందరితో అణకువగా ఉండుమంటావు. తెలుగును ఎవరన్నా అలకువగా మాట్లాడితే అణచుకోవడం నావల్ల కావడం లేదు" అంటూ వచ్చినాడు చిన్నయ్య.

చిన్నయ్య గురించి తెలిసిందేగా! నవ్వుతూ "అణచుకొమ్మని చెప్పలేదు చిన్నయ్యా, గట్టిగానే ఎదురుకోవాలి. అయితే ఆ ఎదురుకోవడంలో దురుసుతనమూ వెక్కసమూ ఉండకూడదు, ఇంతకీ ఏమయింది?" అన్నాను.

"ఆఁ, ఎవడో గొట్టంగాడు, తెలుగుదేముంది, సంసుక్రుతపు కాలిగోటికి చాలదు మీ తెలుగు అన్నాడు. నాకు మండిపోయి చెడామడా కడిగిపారేసినాను" అన్నాడు.

''చూడు చిన్నయ్యా, మనచుట్టూ వేలమంది తెలివరులు, సంసుక్రుతం అనేది వేలుపునుడి అనీ అది మందినోటినుండి పుట్టినది కాదు అనీ నమ్ముతుంటారు. వాళ్లందరూ తెలిసో తెలియకో తెలుగును చిన్నచూపు చూస్తుంటారు. అలాంటి చదువులే చదివి వచ్చినారు వాళ్లంతా. అది తప్పు, అన్ని నుడులూ గొప్పవే అని చెపుతున్నవాళ్లం వదులలెక్కలో కుడా లేము. కాబట్టి మనం గట్టిగా ఎదురుకోవలసిందే. అంతేకాని దూకుడుగా కడిగిపారేయకూడదు. అది సరేకానీ, నువ్వు వస్తూ వస్తూ మంచి చేర్పును వెంట పెట్టుకొని వచ్చినావు తెలుసా" అన్నాను.

"చేర్పునేమిటి, నేను వెంటపెట్టుకొని రావడమేమిటి, నువ్వంటున్నది నాకేమీ ఎరుకపడడం లేదు అన్నయ్యా" చిన్నయ్య అన్నాడు.

"వస్తూ నువ్వు పలికిన పలుకుల్లో అణకువ, అలకువ అనే రెండుమాటలు ఉన్నాయి కదా. ఆ రెండింటిలో 'ఉవ' అనే చేర్పు ఉంది చూడు" చెప్పినాను.


"నాకు ఎంతో ఎలమి(సంతోషం)గా ఉందన్నయ్యా, నాకు తెలియకుండానే, నేను కూడా ఒక చేర్పును వాడినాను" అన్నాడు చిన్నయ్య.

''నువ్వే కాదు చిన్నయ్యా, తెలుగువాళ్లం అందరమూ వాడుతున్నవాటినే, మనం విడదీసి విడమరచి చెపుతున్నాం. నమ్రత, అపక్వం, న్యూనత, సంకోచం, కోపం, నివాసస్తలం, స్తిరత్వం, ప్రయత్నం, జ్ఞానం, ఇవన్నీ సంసుక్రుపు మాటలు. పేరనికలు(నామవాచకాలు). వీటికి తెలుగుమాటలు లేవా అంటే ఉన్నాయి. అణకువ, అఱుకువ, అలకువ, అళుకువ, అలుకువ, ఉనుకువ, ఉంకువ, ఊకువ, ఎఱుకువలు వరనగా-ఆ తెలుగుమాటలు. ఇవన్నీ తెలుగు నుడిగంటులలో ఉన్నవే. బడిపొత్తాలలో, ఆకికలలో తెలుగుమాటలు కాక పెరమాటలనే వాడడం వలన తెలుగు నెన్నొడి మరుగున పడిపోయింది. ఉన్న నెన్నొడిని వాడడం లేదు. కొత్త నెన్నొడిని పుట్టించుకోవడం లేదు. ఇక తెలుగు ఎలా ఎదుగుతుంది? పై తొమ్మిది మాటలలోనూ 'ఉవ' అనే చేర్పుఉంది. ఈ చేర్పును అగవనిక(క్రియావాచకా)లకు చేర్చితే పై పేరనికలు ఏర్పడినాయి. అణగు, అఱుగు, అలగు, అళుకు, అలుగు, ఉనుకు, ఉంకు, ఊకు, ఎఱుగు అనేవి ఆ అగవనికలు. ఇటువంటి అగవనికలను ఏరుకొని, వాటికి 'ఉవ'ను చేర్చితే కొత్తమాటలు పుడుతాయి. మచ్చుకు కొన్నిటిని పుట్టిదాం పట్టు" అని మొదలుపెట్టినాను.

1. అంకు+ఉవ అంకువ లాబం అంకు=లబించు.
2. అగు+ఉవ అకువ ప్రాప్తం అగు=ప్రాప్తించు.
3. అడకు+ఉవ అడకువ గోప్యత అడకు=దాచు.
4. అదుకు+ఉవ అదుకువ శ్రేణి అదుకు=పేర్చు.
5. అదుకు+ఉవ అదుకువ ఏకాగ్రత అదుకు=లగ్నంచేయు.
6. అనగు+ఉవ అనకువ సంపర్కం అనగు=కలయు.
7. అరుగు+ఉవ అరుకువ ప్రయాణం అరుగు=వెడలు.
8. అవుకు+ఉవ అవుకువ సంకోచం అవుకు=వెనుదీయు.
9. ఆగు+ఉవ ఆకువ విరమణ ఆగు=విరమించు.
10. ఇంకు+ఉవ ఇంకువ నష్టం ఇంకు=నష్టపోవు.
11. ఇగ్గు+ఉవ ఇక్కువ ఉద్వాసన ఇగ్గు=ఉద్వాసనచేయు.
12. ఇడుగు+ఉవ ఇడుకువ వికాసం ఇడుగు=వికసించు.
13. ఇనుకు+ఉవ ఇనుకువ శుష్కం ఇనుకు=శుష్కించు.
14. ఇరుగు+ఉవ ఇరుకువ అంతర్భూతం ఇరుగు=ఇముడు.
15. ఇలుగు+ఉవ ఇలుకువ మరణం ఇలుగు=మరణించు.
16. ఈగు+ఉవ ఈకువ ప్రవేశం ఈగు= ప్రవేశించు.
17. ఉడుగు+ఉవ ఉడుకువ త్యాగం ఉడుగు=త్యజించు.
18. ఉతుకు+ఉవ ఉతుకువ తాడనం ఉతుకు=బాదు.
19. ఉదుకు+ఉవ ఉదుకువ నాశనం ఉదుకు=నశింపచేయు.
20. ఉబుకు+ఉవ ఉబుకువ సంతోషం ఉబుకు=సంతోషించు.
21. ఉరుకు+ఉవ ఉరుకువ లంగనం ఉరుకు=లంగించు.

శ్రద్ధాంజలి

శ్రీ గుత్తి (జోళదరాశి) చంద్రశేఖరరెడ్డి కనుమరుగు



బళ్ళారి ప్రాంత తెలుగు సాహిత్యాభిమానులకు అత్యంత అప్పుడు, ఆత్మీయుడు, సన్నిహిత స్నేహ బాంధువుడు, తెలుగు సాహితీసింధువు, తెలుగు కన్నడ భాషాసాహిత్యాల సేతువు – శ్రీ గుత్తి (జోళదరాశి)చంద్రశేఖరరెడ్డి గారు. 'దేశభాషలందు తెలుగులెస్స' అని చాటి చెప్పిన, శ్రీకృష్ణదేవరాయలనినా, రాయలవారు అభిమానించిన తెలుగుభాష అనినా, చంద్రశేఖరరెడ్డిగారికి ఎనలేని అభిమానం. చంద్రశేఖరరెడ్డిగారు పుట్టింది, బళ్ళారికి దగ్గరలోనే ఉన్న జోళదరాశి అనే ఊరిలో. తండ్రి నారాయణరెడ్డిగారు కూడా తెలుగు అభిమాని. తండ్రినుంచి తెలుగు అభిమానాన్ని, తెలుగు ఆవేశాన్ని పుణికి పుచ్చుకున్న తనయుడు రెడ్డిగారు.

బళ్ళారిలో ఎల్లప్పుడూ తెలుగు కనిపిస్తూ వినిపిస్తూ ఉండాలి. బళ్ళారి తెలుగు కనుమరుగు కాకూడదు, అని ఎప్పుడూ ఆరాటపడుతుండేవారు రెడ్డిగారు. బళ్ళారిలోనూ కర్నాటకలోనూ తెలుగు రెండవ అధికార భాషగా గుర్తింపు పొందాలని, అందుకు తెలుగు కన్నడ ప్రభుత్వాలు రెండూ పూనుకోవాలని, తను పాలుపంచుకున్న వేదికలమీదంతా ఘోషించేవారు వీరు.

బళ్ళారిలోని రాఘవ స్మారక సమితి, ఆంధ్రకళాసమితి, బళ్ళారి కల్చరల్ అసోసియేషన్, తెలుగు సంస్కృత సమితి మొదలైన సంస్థలలో సన్నిహిత సంబంధాలను చివరివరకూ కొనసాగించారు. తండ్రిగారి పేరుతో 'గుత్తి నారాయణరెడ్డి స్మారక పురస్కారం'ను ఏర్పాటు చేసి, ప్రతి ఏడాదీ, తెలుగురాష్ట్రాలకు బయట ఉండి తెలుగుకు సేవ చేస్తున్న వారిని గుర్తించి, జోళదరాశికి పిలిపించి, పురస్కారంతో గౌరవించేవారు.

హైదరాబాద్‌లో కుదురుకొన్నా, ఆయన మనసు ఎల్లప్పుడూ బళ్ళారి చుట్టూ తిరుగుతుండేది. ఆరోగ్యం సహకరించకపోయినా చివరిదినాలలో ఆయన బళ్ళారికి వచ్చారు. అఖండ బళ్ళారి జిల్లా పోరాట ఉద్యమాల్లో పాల్గొన్నారు. కాళ్లు సహకరించకపోయినా వేదికలెక్కారు. గొంతు సహకరించకపోయినా చైతన్యాన్ని రగులుకొల్పే ఉపన్యాసాలనిచ్చారు. చివరిరోజున కొనవూపిరిదాకా బళ్ళారి తెలుగు గురించి కలవరిస్తూ, తెలుగు పలుకులను పలుకుతూ కనుమూశారు. కవిగా, రచయితగా, విమర్శకుడిగా, చారిత్రక పరిశోధకుడిగా, అనువాద రచయితగా, నటుడిగా తెలుగన్నడ భాషాసాహిత్యాలకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయాలు.

'మా తెలుగు తల్లికి మల్లెపూదండ, మా కన్నడాంబకు మంగళారతులు' అంటూ ఉపన్యాసాన్ని మొదలుపెట్టే చంద్రశేఖరరెడ్డిగారి గొంతు, బళ్ళారిలో,కర్ణాటకలో, తెలుగువాళ్లు ఉన్నంతకాలమూ వినిపిస్తూనే ఉంటుంది. తెలుగును వదలిపెట్టవద్దని మా వెంటపడుతూనే ఉంటుంది.

కె. సురేంద్రబాబు,
విశ్రాంత తెలుగు ఉపన్యాసకులు, బళ్ళారి

22. ఉఱుకు+ఉవ ఉఱుకువ ఉద్గారం ఉఱుకు=ఉద్గతమగు.
23. ఉలుకు+ఉవ ఉలుకువ అసూయ ఉలుకు=అసూయపడు.
24. ఉసుగు+ఉవ ఉసుకువ సంగర్షణ ఉసుగు=నలుగు.
25. ఎదుగు+ఉవ ఎదుకువ అభ్యుదయం.
26. ఎమకు+ఉవ ఎమకువ శోదన ఎమకు=శోదించు.
27. ఎఱగు+ఉవ ఎఱకువ నమస్కారం ఎఱగు=నమస్కరించు.
28. ఎసగు+ఉవ ఎసకువ విజృంబణం ఎసగు=విజృంబించు.
29. ఏకు+ఉవ ఏకువ శాపం ఏకు=తిట్టు.
30. ఒగ్గు+ఉవ ఒక్కువ వ్యాప్తి ఒగ్గు=వ్యాపించు.
31. ఒడుకు+ఉవ ఒడుకువ హాజరు ఒడుకు=ప్రవేశపెట్టు.
32. ఒదుగు+ఉవ ఒదుకువ విదేయత ఒదుగు=విదేయుడగు.
33. ఒరగు+ఉవ ఒరకువ శిదిలం ఒరగు=శిదిలమగు.
34. ఒలుకు+ఉవ ఒలుకువ స్రావం ఒలుకు=స్రవించు.
35. ఒసగు+ఉవ ఒసకువ అంకితం ఒసగు=అర్పించు.

"ఉవతో నూర్లమాటలను పుట్టించవచ్చు. అయితే అగవనికలకు మట్టుకే ఉవను చేర్చాలా అనే అరగలి వస్తుంది. పై మాటలన్నీ అగవనికలే కదా. పేరనికలకు కూడా ఉవను చేర్చవచ్చు అనడానికి కొన్ని మచ్చులు కనబడుతున్నాయి. వేగు+ఉవ = వేకువ; పెక్కు+ఉవ= పెక్కువ ; టెక్కు+ఉవ = టెక్కువ వంటివి. ఒక మచ్చు దొరికినా మనం అల్లుకుపోవాలి. చిక్కు+ఉవ= చిక్కువ = క్లిష్టం; ముక్కు + ఉవ = ముక్కువ = అనునాసికం వంటి మరిన్ని మాటలను పుట్టించవచ్చు ఈ ఉవతో" అని ముగించినాను.

(తరువాయి వచ్చే సంచికలో...)

తెలుగువారందరూ తమ రోజువారీ వ్యవహారాలను తెలుగులో జరుపుకోగలగాలి. 'కలగాలి' అంటే రెండు అర్థాలు: ఒకటి, తెలుగులో జరుపుకోవాలి అని ఎవరూ శాసించకుండానే, స్వచ్ఛందంగా ప్రజలు అనుకొని జరుపుకోవడం. రెండు, అందుకు తగ్గ పరిస్థితులు, సదుపాయాలు మనకు మనం కల్పించుకోవడం.

డా॥ పి. శివరామకృష్ణ 'శక్తి'
94414 27977

'పోలవరం' కింద మునిగిపోతున్న తెలుగుజాతి కీర్తి గుర్తులు

గతవైభవం పేరిట, దేవుళ్ళ పేరిట, కులాల పేరిట కొట్టుకుంటున్న వర్గాలు ఈ చారిత్రక సంపదను భద్రపరచుకోకపోతే-భావితరాలు చరిత్రహీనులైపోతారు. పోలవరం ప్రాజెక్టుకు గేట్లు బిగింపు, నిర్వాసితుల తరలింపు జరుగుతున్నంత వేగంగా ఈ శిథిలాల సేకరణ, మ్యూజియం నిర్మాణం, దేవాలయాల పునఃప్రతిష్ఠ కూడా జరగాలి.



1323 కాకతీయ సామ్రాజ్యం అస్తమించాక వారి సేనాధిపతులలో ముసునూరి ప్రోలయ, సింగమనాయకులు, వేమారెడ్డి స్వతంత్ర రాజ్యస్థాపనకు పూనుకున్నారు. పోలయ తరువాత అతని పినతండ్రికొడుకు కాపయ రాజైనాడు. వీరందరూ ఏకమై 1336లో ఓరుగల్లును స్వాధీనం చేసుకున్నారు. పోలవరం కాపవరం గ్రామనామాలు వీరి పేరిటివే.

పోలయ కాపయలు మాల్యవంతం అంటే పాపికొండలలోని నేటి వరరామచంద్రపురం మండలంలోని రేకపల్లి రాజధానిగా ఆంధ్రదేశాధీశ్వర బిరుదంతో గద్దె నెక్కారు. వారి ఇష్టదైవం శ్రీరామగిరిలోని సుందరరాముడు. గిరిజన సంప్రదాయ ప్రకారం ఈ రాముడికి దొంగపెళ్ళి చేసిన తరువాతనే భద్రాచలంలో కళ్యాణం చేస్తారు. ఈ ప్రాంతం ఒకనాడు రుద్రమదేవి వేటలభూమిగా రుద్రమకోట అని జనం చెప్పుకుంటారు.

కాపయనాయకుడు తూర్పుగోదావరిలో కోరుకొండ పక్కన శ్రీరంగపట్నం రాజధానిగా పాలిస్తున్న ముప్పయ నాయకునకు తన సోదరినిచ్చి పెళ్లి చేసాడు. దేవీపట్నం పక్కనగల తొయ్యేరులో తన ప్రతినిధిగా అనపోతనాయకుని నియమించాడు. క్రమంగా ఈ ప్రాంతం గజపతులపాలై వారి కొన్ని గ్రామాలకు వారిపేర్లు పురుషోత్తమపట్నం, రఘుదేవపురం వచ్చాయి. పోలవరం రాజమహేంద్రి రెడ్డిరాజుల 'రెడ్డిపోలవరం' అయింది. పోలవరం కింద పట్టిసీమ పైన మునిగిపోనున్న మహానందీశ్వరం వారి ప్రాభవాన్ని చాటుతాయి. 'పావనంబైన తమిలేటి పరిసరమున వేగి కురువాటికా దేశవిపినభూమి' అని ఈ అడవులను శ్రీనాథ మహాకవి వర్ణిస్తాడు. బస్తర్‌లో మద్దేటి రాయభూపాలపట్నం పాలకులు గోదావరిమీదుగా వలస వచ్చి రంప, కొత్తపల్లి, పోలవరం, లక్ష్మీనారాయణదేవ్ పేట, మంగపతి దేవ్ పేటలలో వారి



సామంతులుగా స్థిరపడ్డ క్రమాన్ని రెడ్డిరాజులు 'దండకారణ్య మధ్య రంభాహి వంశజులకు అభయమొసగి' నారని మహాకవి వర్ణిస్తాడు. స్థానిక పాలకులు ముఠాదార్లు, ఈ పాలకులు వారిని సమర్థించిన తెల్లవాళ్ళతో తలపడిన సుదీర్ఘ పోరాటమే రంపపితూరి.. పాపికొండలలో కొరుటూరు సుబ్బారెడ్డి నానాసాహెబ్ పిలుపు మేరకు ప్రథమ స్వతంత్ర సంగ్రామంలో పాల్గొన్నానని రాజమండ్రి కోర్టులో మరణ వాంగ్మూలమిచ్చి ఉరికంబమెక్కాడు. రేకపల్లిలో కొండ్లభీమిరెడ్డి రంపపితూరి నాయకులలో ఒకరు. ముసునూరి నాయకులలో ఒకరు కూనయనాయకుని పేరిటి కూనవరంలో గల ఒకనాటి పోలీస్ స్టేషన్ చారిత్రాత్మకమైనది. కొచ్చెర్లకోట వారు వేలంలో పోలవరం కొనుక్కున్నారు.

నైజాం రాజ్యంలోని పేరంటపల్లిలో ఎక్కడినుంచో వచ్చిన స్వామి బాలానంద, రామకృష్ణ మునివాటం నిర్మించుకొని గిరిజనాభివృద్ధికి కృషి చేసారు. తొలితరం లోకసభ, శాసనసభ మహిళాసభ్యులు రాధాబాయి ఆనందరావు, వాణిరమణరావు ఆయన చదివించిన వారే. ఈ ప్రాంతంలో ప్రఖ్యాత మానవశాస్త్రవేత్త హైమెండర్ఫ్ దంపతులు ఇక్కడి కొండరెడ్డితెగ మీద పరిశోధన చేసి 'ది రెడ్డీస్ ఆఫ్ బైసన్ హిల్స్'అనే పెద్ద గ్రంథాన్ని రాసారు. కొండమొదలు ముఠాదారు లింగారెడ్డి నుండి నాటి కంపెనీ ప్రభుత్వం అతను వసూలు చేసుకునే గోదావరి రవాణా సుంకానికి 50రు. పరిహారమిచ్చి కొనుక్కున్నది. సర్ ఆర్థర్ కాటన్, నేటి ఛత్తీస్‌ఘర్‌లోని కుంటలో కట్టకట్టి సంవత్సరం పొడుగునా గోదావరినది మీదుగా రవాణా సౌకర్యం కల్పించాడు. జానపద వాఙ్మయోద్ధారకుడు నేదునూరి గంగాధరం రాజమహేంద్రిలో గుండువారి రేవు నుండి పర్ణశాల దాకా భక్తుల శ్రీరామనవమి లాంచీ ప్రయాణం వివరంగా వర్ణిస్తారు. బాపు 'అందాల రాముడు' నుంచి శేఖర్ కమ్ముల 'గోదావరి' దాకా ఈ పోలవరం ముంపు ప్రాంతంలో ఎన్నో సినిమాలు తీసారు. కాని ఈ చరిత్ర నెవరూ పరోక్షంగానైనా ప్రస్తావించలేదు.. దశాబ్దం పైగా లాంచీ సౌకర్యం ముమ్మరమై యాత్రికులు ఎడతెరపి లేకుండా ఈ గోదావరిలో విహరిస్తున్నారు.

ముంపుప్రాంతం - మ్యూజియం

2017లోనే ఈ ముంపు ప్రాంతంలో 28 ప్రదేశాలలో గల చారిత్రక సంపదను తరలించి ఒక మ్యూజియంలో పెట్టాలని ప్రభుత్వం



నిధులు విడుదల చేసింది. ఈ శిధిలాలు సేకరించి రాజమహేంద్రి, ఏలూరు మ్యూజియాలలో పడేసినట్లు, ప్రాక్చారిత్రక యుగం సమాధులకోసం తవ్వకాలు జరుపుతున్నట్లు వార్తలొస్తున్నాయి.

మన ముందుతరం, నాగార్జున సాగర్‌లో మునిగిపోనున్న పురావస్తు సంపదను నాగార్జున కొండలో భద్రపరిచి, నది మధ్యలోనే ఒక స్ఫూర్తి కేంద్రాన్ని నిర్మించారు. మన తరంలో ఇంత చరిత్ర మునిగిపోతుంటే ఏమి జరుగుతుందో పట్టించుకొనే వారే లేరు.

ముంపు బారిన పడుతున్న దేవాలయాలు, పవిత్రస్థలాలు, చారిత్రక స్థలాలు, (ఒకనాటి పోలవరం ప్రాజెక్టు రిపోర్టు ప్రకారం)..

శివగిరి గ్రామం, ఒక కోట ,శిధిలమైన దేవాలయం, గండిపోచమ్మ, కొమరందిబ్బ, దేవీపట్నం, పెంకులపాడు, కచ్చులూరు, దేవరగొంది, కటుకూరు, పేరంటపల్లి, శ్రీరామగిరి, రావిగూడెం, చీరపల్లి, పోచవరం, దుర్గంకోట, రాజుపేట, ఏలూరుపాడు, చిగురుమామిడి, టేకూరు, ఎటిపాక, ఏలేరు, రుద్రంకోట, అబిచెర్ల, చొప్పల్లె, రామవరం, సీతంపేట, ఇసునూరు, కొరుటూరు, కొండమొదలు, కొమరారం, మాదాపురం, కుమారరాంపురం మొదలైనవి.

ధూప దీప నైవేద్యాలు, ఉత్సవసేవలు ఈ మునిగి పోయే వాటిలో కొన్ని ధూపదీపనైవేద్యాలతో, ఉత్సవసేవలతో విలసిల్లుతున్నాయి. వాటిలో ఒకటి ముసునూరినాయకుల శ్రీరామగిరి. పెదజియ్యర్ స్వామి ఇక్కడ శ్రీరామక్రతువు నిర్వహించారు. చినజీయర్ స్వామి 2000 సంవత్సరంలో దర్శించారు. మరి ఈ పరిస్థితి వారి దృష్టికి వచ్చిందో లేదో ! ఇటువంటి దేవాలయాలను ఎగువ ప్రాంతంలో పునఃప్రతిష్ఠ చేయాలి. కొన్ని విగ్రహాలు చెరువుకట్టల మీద, రచ్చబండల దగ్గర గ్రామదేవతలుగా ఉన్నాయి.. ప్రభుత్వానికి వదిలేస్తే అరకొరగా సేకరించిన శిధిలాలు మ్యూజియంలలో పడి ఉంటాయి. **గతవైభవం పేరిట, దేవుళ్ళ పేరిట, కులాల పేరిట కొట్టుకుంటున్న వర్గాలు ఈ చారిత్రక సంపదను భద్రపచుకోకపోతే భావితరాలు చరిత్ర హీనులైపోతారు.**

ఒకనాడు చరిత్రవేత్తలు పుట్టపర్తి శ్రీనివాసాచారి, కృష్ణశాస్త్రి, చల్లా రాధాకృష్ణ, నాగార్జునసాగర్ కింద మునిగేపోయే శిధిలాలను పునర్నిర్మాణం చేసారు. గడియారం రామకృష్ణశర్మ తుంగభద్ర కింద జోగులాంబ దేవాలయం మునిగిపోకుండా కరకట్ట కట్టించారు. ఈ



సంఘ్ (ఆర్.ఎస్.ఎస్.) 'ముసునూరి నాయకుల'ను పట్టించుకోరా?

పోలవరం నిర్మాణంతో మునిగిపోనున్న శ్రీరామగిరి దేవాలయంతో పాటు అనేక వారసత్వ గుర్తులు, చరిత్ర కనుమరుగైపోనున్నది. విదేశీ దురాక్రమణలను ఎదిరించి నిలబడిన ముసునూరి నాయకుల గుర్తులు కూడాచెరిగిపోనున్నాయి. సంఘ్(ఆర్.ఎస్.ఎస్)శాఖల్లో ప్రతిరోజూ గానం చేసే ఏకాత్మతాస్తోత్రంలోని 'ముసునూరినాయకౌ'ను వారు పట్టించుకోవాలి కదా?

దక్షిణాపథాన ముస్లిం దురాక్రమణదారులను తరిమికొట్టి హిందూరాజ్యస్థాపన చేసిన తెలుగువారి తొట్టతొలి చక్రవర్తి ముసునూరి కాపయ నాయకుడు.

ముసునూరి కాపయనాయకుడు(క్రీ.శ. 1332-1368) ముస్లిం పాలన నుంచి ఆంధ్రాను విముక్తం చేసి ఎన్నో హిందూ రాజ్యాల స్థాపనకు స్ఫూర్తినిచ్చిన అరివీర భయంకరుడు. వీరివల్ల స్ఫూర్తిపొందిన రాజ్యాల్లో హోయసల, ద్వారసముద్రము మరియు అరవీటి రాజులు, హరిహర మరియు బుక్క రాయలు హోయసల రాజ్యమును జయించి విద్యారణ్యులవారి బోధనలవల్ల ఆనెగొందిలొ విజయనగర రాజ్యము స్థాపించారు.

ప్రోలయ నాయకుడి మరణానంతరం ఆయన పినతండ్రి కుమారుడైన ముసునూరి కాపయ నాయకుడు క్రీ.శ.1332లో ఆంధ్రదేశ విముక్తి ఉద్యమానికి నాయకత్వం వహించాడు. కాపయ నాయకుడి చరిత్రకు ముఖ్య ఆధారాలు ఇతడు వేయించిన పోలవరం, పిల్లలమర్రి, గణపేశ్వర శాసనాలు. అంతేకాకుండా రేచర్ల వెలమల చరిత్రను వివరించే వెలుగోటి వారి వంశావళి, ఫెరిస్టా రచనలు ప్రధాన ఆధారాలుగా ఉన్నాయి.

మహ్మదీయుల ఆధీనంలో ఉన్న ఓరుగల్లు కోటను కాపయ నాయకుడు కర్ణాటక హోయసాల పాలకుడైన మూడో వీరభల్లాలుడి సహాయంతో స్వాధీనం చేసుకున్నాడు. అప్పటి ఓరుగల్లు దుర్గ పాలకుడైన మాలిక్ మక్బుల్ యుద్ధం నుంచి పారిపోయాడు. కాపయ నాయకుడు క్రీ.శ.1337లో ఓరుగల్లును ఆక్రమించాడు. తెలంగాణలోని మెతుకుసీమ, ఇందూరు(నిజామాబాద్)లోని కౌలాసకోట, నల్గొండ, పానగల్లు, దేవరకొండ, భువనగిరి ప్రాంతాలతోపాటు కృష్ణా, గోదావరి నదీ తీర ప్రదేశాలు కూడా ఇతడి రాజ్యంలోకి వచ్చాయి. కాపయ నాయకుడు తన పాలనను రేకపల్లి దుర్గం నుంచే నిర్వహించాడు. క్రీ.శ.1346 నాటి గణపేశ్వర శాసనం ఇతడిని 'అనుమనగంటి పురవరాధీశ్వర' అనే బిరుదుతో ప్రస్తావించింది. ఉత్తర తెలంగాణ, కృష్ణానది పర్యంతం ఉత్తర తీరాంధ్ర ప్రాంతంపై కాపయ నాయకుడు ఆధిపత్యం చెలాయించినట్లు చెప్పొచ్చు.

తరం చరిత్రకారులు ఈ వివరాలు వెలుగులోకి తేవాలి. పోలవరం ప్రాజెక్టుకు గేట్లు బిగింపు, నిర్వాసితుల తరలింపు జరుగుతున్నంత వేగంగా ఈ శిధిలాల సేకరణ, మ్యూజియం నిర్మాణం, దేవాలయాల పునఃప్రతిష్ఠ జరగాలి.

మాటల నిర్మాణం

–వాచస్పతి

(గత సంచిక తరువాయి...)

పదనిష్పాదనకళ 7

The joy of coining new words!

నాలుగో అధ్యాయం

తెలుగులో క్రియాకల్పన సాధనాలు

తెలుగువారి పూర్వీకులు క్రియాకల్పన చేసిన విధానం :

మన ప్రాచీన తెలుగుపూర్వీకులు రెండక్షరాల నామవాచకాలకీ, విశేషణాలకీ కొన్ని ప్రత్యయాలు చేర్చడం ద్వారా వాటిని క్రియాధాతువులుగా మార్చారు. మనం ఇప్పటికీ వాటిని వాడుతూనే ఉన్నాం. ప్రతి మూడక్షరాల తెలుగు క్రియాధాతువూ ఇలా ఏర్పడినదే. వారు చేర్చిన ప్రత్యయాలు

(i) యు, చు, ఇంచు, ఇల్లు మొ.

'యు' చేఱిన పదాలు కొన్ని :

పులి = పులుపు; పులియు = పులుపుగా అగుట

తడి = చెమ్మ; తడియు = చెమ్మగా అగుట

తడ = ఆలస్యం; తడయు = ఆలస్యం చేయు; తడవు = సేపు, కాలవ్యవధి (ఇంత తడవు మొ.)

తెలి = తెలుపు; తెలియు = తెలుపుగా అగుట

విరి = పువ్వు; విరియు = పువ్వులా విచ్చుకొనుట మెఱ = ప్రకాశము మెఱయు = ప్రకాశవంతమగుట

(ii) 'చు' చేఱిన పదాలు కొన్ని :

మొల = కింద; మొలచు = కింద నుంచి వచ్చు

నెఱ =నేర్పు; నెఱచు→ నేర్చు = అభ్యసించుట

వెఱ = భయం; వెఱచు = భయపడుట (→వెఱపు)

చెఱ = బంధనం; చెఱచు = బంధించి అనుభవించుట

తల = మెదడున్న శరీరభాగము; తలచు = తలతో పనిచేయుట

వల = ప్రేమ/శృంగారభావము; వలచు = శృంగారపరముగా ప్రేమించు

కల = అలజడి; కలఁచు = అలజడి కలిగించు (కలఁత) మల = ఱాయి; మలచు = ఱాతి మీద పనిచేయు

పొడ = శరీరం (రూపాంతరం = పొడలు → ఒడలు) పొడచు = శరీరములోకి దించుట

కోఱ = పదునైన పక్క పన్ను; కోఱచు→ కఱచు = పంటితో పట్టుకొనుట

నడ = కదలిక (నడపీనుఁగు = కదిలే శవం); నడచు = కాళ్ళతో కదులుట

తెఱ = అడ్డుగా కట్టిన గుడ్డ; తెఱచు = అడ్డుగా కట్టినవాటిని తీయుట

ముడి = పొడవు–వెడల్పులను తగ్గించుట; ముడుచు = సంకోచింపజేయుట

నిల = నేల; నిలచు = నేలపై ఉండు

(iii) 'గు' చేఱిన పదాలు కొన్ని :

కల = అలజడి; కలఁగు = అలజడికి లోనగు (కలఁత/కలఁక)

నలి = సూక్ష్మం, కృశించుట; నలుగు = ముడతలు పడి కృశించుట (నలఁత = జబ్బు)

వెలి = తెలుపు; వెలుఁగు = తన పరిసరాల్ని తెల్లగా చేయుట

మొఱ = చప్పుడు మొఱఁగు = (కుక్క) చప్పుడు చేయుట మ్రోయు/మ్రోగు = చప్పుడు చేయుట

కొఱ్ఱు = పై భాగం; కొఱుగు → గొఱుగు = పై భాగాన్ని తొలగించు; గొఱగ = గొఱగబడ్డవాడు, శివభక్తుడు (తల గొఱిగించుకున్నవాడు) (కొఱితి మరన్ (మ్రాన్) →కొత్తిమెర = ఆకుల పై భాగాలు కోసుగా ఉన్న మొక్క)

(iv) 'కు' చేఱిన పదాలు కొన్ని :

కోఱ = పదునైన పక్క పన్ను; కోఱకు → కొఱకు = పంటితో గ్రుచ్చు

వెద = విత్తనం; వెదకు = విత్తనాలు ఏరడం

పల్లు = పన్ను; పలుకు = ఉచ్చరించుట

కుఱు = కింద/చిన్న; కుఱుకు → కూర్కు → కులుకు = పడుకొనుట; కుఱుంకు = క్రుంకు = సూర్యుడు అస్తమించుట కుఱుంగు = క్రుంగు = మనిషి తగ్గిపోవుట

ఇవి కాక రెండక్షరాల విశేషణాల (adjectives)కి 'ఇల్లుక్, ఇంచుక్' చేర్చి క్రియాధాతువుల (verb-roots)ని నిష్పాదించారు :

సన్న + ఇల్లుక్ = సన్నగిల్లు; ఏవ = అసహ్యం (ఇప్పుడు యావ అంటున్నారు); ఏవ + ఇంచుక్ = ఏవగించు

ఈ చర్చ ఎందుకు చేశామంటే, ఇంగ్లీషులో లాగా తెలుగులో కూడా ఏ నామవాచకాన్నైనా క్రియాపదంగా మార్చి వాడుకునే సౌలభ్యం ఉందని తెల్పడానికే! సౌలభ్యాలకేం, ఎన్నో ఉన్నాయి సిద్ధాన్నంలా! కాని వినియోగించుకునేవారే కఱువయ్యారు. ఒకవేళ వినియోగించినా చెవులకేదో కొత్తగా వినిపిస్తోందని వాడడం మానేస్తున్నారు. ఇలాంటి భాషాభేషజాల నుంచి బయటపడి స్వేచ్ఛగా, నిర్మొహమాటంగా తెలుగుపదాల్ని ప్రయోగించే మంచిరోజులు రావాలని ఆశిద్దాం.

మనం 3 రకాల పదాల్ని కల్పించాల్సిఉందని ఇదివఱకు అనుకున్నాం. వాటిల్లో మొదటి విభాగం క్రియాధాతువులు. ఏ భాషలోనైనా ప్రాథమికక్రియలు కొన్నే ఉంటాయి. మిగతా క్రియలన్నీ నామవాచకాల (nouns)నీ, విశేషణాల్నీ (adjectives) రూపాంతరించగా ఏర్పడ్డవై ఉంటాయి. ఇలా క్రియల్ని కల్పించడానికి తెలుగు అందిస్తున్న సౌకర్యాల గుఱించి మనం ఇప్పుడు చర్చిస్తున్నాం.

తెలుగులో క్రియా ధాతువులు అంతమయ్యే విధానాన్ని ముందు

అధ్యయించాలి..

1. "చు" తో అంతమయ్యే రెండు అక్షరాల క్రియాధాతువులు.
ఉదా :- కాచు, గీచు, చాచు, తోచు, దాచు, దోచు, పాచు, రాచు, వాచు, వీచు, వేచు మొదలైనవి.

2. అనుస్వార పూర్వకమైన (సున్న ముందు గల) 'చు'తో అంతమయ్యే రెండు అక్షరాల క్రియాధాతువులు.
ఉదా :- దంచు, దించు, తెంచు, మించు, ఉంచు, ఎంచు, పంచు, వంచు మొదలైనవి.

3. ద్విరుక్త (వత్తు) 'చు' తో అంతమయ్యే రెండు అక్షరాల క్రియాధాతువులు.
ఉదా :- తెచ్చు, గుచ్చు, నచ్చు, నొచ్చు, పుచ్చు మొదలైనవి.

4. "చు" తో అంతమయ్యే మూడు అక్షరాల క్రియాధాతువులు.
ఉదా :- నడచు, ఒలుచు, పొడుచు, విడచు మొదలైనవి.

5. 'ఇంచుక్' ప్రత్యయంతో అంతమయ్యే అచ్చతెలుగు క్రియాధాతువులు.
ఉదా :- గుఱించు(addressing), ఆకళించు(explain), సవరించు (amend), సవదరించు(edit)మొదలైనవి.

6. 'ఇంచుక్' ప్రత్యయంతో అంతమయ్యే ప్రేరణార్థక క్రియా ధాతువులు.
ఉదా :- చేయించు ("చేయు" కు ప్రేరణార్థకం); కదిలించు ("కదులు"కు ప్రేరణార్థకం) మొదలైనవి.

7.'ఇంచుక్' ప్రత్యయంతో అంతమయ్యే తత్సమ (సంస్కృత/ ప్రాకృత) క్రియా ధాతువులు (ఇవి లెక్కకు మిక్కిలిగా ఉన్నాయి) :
ఉదా :- ధరించు, బోధించు, సంహరించు మొదలైనవి.

8. 'యు' తో అంతమయ్యే రెండు అక్షరాల క్రియాధాతువులు.
ఉదా :- ఏయు, కాయు, కోయు, కూయు, డాయు, తీయు (తివియు), తోయు, మోయు, మ్రోయు, వేయు మొదలైనవి.

9.'యు' తో అంతమయ్యే మూడు అక్షరాల క్రియాధాతువులు.
ఉదా :- తడియు, వడియు, జడియు, అలియు, తెలియు, పులియు, ఉమియు, విరియు మొదలైనవి.

10. 'ను' తో అంతమయ్యే క్రియాధాతువులు.
ఉదా :- తిను, కను, విను, మను, అను, చను, కొను మొదలైనవి.

11. సామాన్య క్రియాధాతువులు
ఉదా :- సాగు, వెళ్ళు, అదురు వదులు, పగులు, మిగులు మొదలైనవి.

12. విశేష క్రియాధాతువులు (special verbs)
ఉదా :- ఉండు, పోవు, చూచు, అగు, వచ్చు, ఇచ్చు, చచ్చు, తెచ్చు మొదలైనవి.

13. కొన్నిసార్లు ఉనికిలో అప్పటికే ఉన్న రెండక్షరాల క్రియాధాతువులకి మళ్లీ కు, గు ఇత్యాది ప్రత్యయాల్ని అదనంగా చేర్చి కొత్త ధాతువుల్ని నిష్పాదించడం జఱిగింది. ఉదా:

ఉబ్బు + కు = ఉబుకు; అద్దు + కు + అదుకు/ అతుకు;

మెత్తు + కు = మెదుగు; ఒత్తు + గు = ఒదుగు; ఎత్తు + గు = ఎదుగు మొ॥

మఱొక విషయం :- తెలుగులో క్రియలు రెండు విధాలుగా ఉంటాయి. 1. సకర్మక క్రియలు (transitive verbs) 2. అకర్మక క్రియలు (intransitive verbs).

సూత్రం-1. సకర్మక క్రియలకి మాత్రమే చివఱ "ఇంచుక్" ప్రత్యయం వస్తుంది.

అంటే చేయడాన్ని ఇంచుక్ సూచిస్తుంది.

ఉదా :- ధరించు- ఆయన కిరీటం ధరించాడు. (ఇక్కడ ధరించు అనే క్రియకు కిరీటం కర్మ కనుక ఇది కర్మ గలిగిన సకర్మక ధాతువు)

సూత్రం-2. అకర్మక క్రియలకి చివఱ "ఇల్లుక్ "వస్తుంది.

అంటే, కావడాన్ని ఇల్లుక్ సూచిస్తుంది.

ఉదా :- ఆమె అతని హృదయేశ్వరిగా విరాజిల్లింది. (ఈ వాక్యానికి కర్మ లేదు కనుక 'విరాజిల్లు' అకర్మక ధాతువు)

ఈ మార్గంలో కల్పించదగిన కొన్ని పదాలు :

సన్నగిల్లు = సన్నగించు (సన్నగా అయ్యేలా చేయు); పరిఢవించు = పరిఢవిల్లు; తొందఱించు = తొందఱిల్లు మొదలైనవి.

'ఇంచుక్, ఇల్లుక్' లని సమయోచితంగా పదాలకు చేర్చడం ద్వారా అంతులేనన్ని కొత్త క్రియాధాతువుల కల్పనకి తెలుగు భాష అవకాశమిస్తోంది. రెండూ ముఖ్యమైనవే. **'ఇల్లుక్' చేర్పు తెలుగు నుడికారానికి స్వాభావికం కాని కర్మార్థక** (passive voice) **ప్రయోగాల ఆవశ్యకతని గణనీయంగా తగ్గిస్తుంది.**

1. ఉదా (సవరిత వాడుక - modified usage):- ఆ వేగుతో అతను హెచ్చఱిల్లాడు = హెచ్చఱించబడ్డాడు - మేలుకున్నాడు (He got alert with the mail)

2. ఉదా (నిష్పన్న వాడుక - Coined usage) :- భవిష్యత్తులో వంద డాలర్ల లోపలే కంప్యూటర్లు అందుబాటిల్లుతాయి. (అందుబాటులోకి వస్తాయి = దొఱుకుతాయి. (Future PCS could be accessed/ accessible at just $ 100)

ఇక్కడ కొన్ని నియమాలు ప్రవర్తిస్తాయి. మనం కల్పించే పదాల శ్రావ్యతని బట్టి వాటిని పాటించడమో మానుకోవడమో చెయ్యొచ్చు.

3. ఉర్దూ పదాలకు "ఇంచుక్/ఇల్లుక్" చేర్చడానికి ముందు ఆ పదాల చివర 'ఆయ్' చేఱుతుంది. ఉదా :- ఉడ్ (ఎగరడం) - ఉడ్ + ఆయ్ = ఉడాయ్ + ఇంచుక్ = ఉడాయించు (to decamp) బనా (తయారు చెయ్యడం) - బనా + య్ = బనాయ్ + ఇంచుక్ = బనాయించు (to frame a criminal charge)

అభ్యాసకార్యములు

I. రెండక్షరాల నామధాతువుల్ని క్రియాధాతువులుగా మార్చడం - వ్యాకరణకార్య సూచనలు (grammar hints)

(అ) ప్రత్యయాల్ని చేర్చేముందు రెండో అక్షరం ద్విత్వమైతే ఆ ద్విత్వాన్ని తొలగించాలి.

(ఇ) ఆ అక్షరం కచటతపల్లో ఒకటైతే దాన్ని గసడదవలుగా మార్చాలి.

(ఉ) అది ఏ అచ్చును కలిగి ఉన్నప్పటికీ అంతిమంగా దాన్ని అకారసహితం చేయాలి.

ఉదా:- పెచ్చు= (విశే.) హెచ్చు, అదనం; పెచ్చు + పు = పెచ్చపు = పెచపు = పెసపు

నేను దీనికి ఇస్తున్న అర్థం – మఱింత పదార్థాన్ని, సామగ్రినీ మీద పేర్చి బలోపేతం చేయడం to reinforce.

ఈ అధ్యాయంలోని సూచనల్ని అనుసరించి ఈ క్రింద ఇచ్చిన అచ్చతెలుగు నామవాచకాల్ని క్రియాధాతువులుగా మార్చి మీరు అనుకుంటున్న అర్థాన్ని జోడించండి :

1.అడి = అధికము, వ్యర్థము 2. అని = యుద్ధము 3. అబ్బ = తండ్రి 4. అబ్బి = మనిషి (మగవాడు) 5. అఱ = సగము 6. అరి = పన్ను 7. అఙ్జ = ముసలి ఆవు 8. అల = చిఱుకెఱటం 9. అల్ల = మందము 10. అవ్వ = తాతభార్య 11. ఇడి = సేమియా 12. ఇట్టి = మగజింక 13. ఇల్లి = ఉపవాసము 14. ఉడ్డ = రాశి 15. ఉట్టి = కప్పుకు వ్రేలాడదీసిన పాలకుండ మొ॥ 16. ఉల్లి = ఒక శాకము 17. ఉరి = ఉద్బంధనము 18. ఉమ్మ = ఆవిరి 19.ఉలి = శిల్పాలు చెక్కే పనిముట్టు 20. ఎడ = చోటు, అంతరం, మనస్సు, హృదయం, సమయం 21. ఎద = మనస్సు,హృదయం 22. ఎన = సాటి, సమం 23. ఎమ్ము = ఎముక 24. ఎర = బలి, ఆహారము 25. ఎల = లేత, యౌవనములోని 26. ఎల్ల = అన్నీ 27. ఎస = మిక్కిలి 28. ఒగి = వరుస, క్రమము 29. ఒజ్జ = గురువు 30. ఒర = కత్తిని ఉంచే కోశం. 31. బరి = ప్రక్కన 32. గఱి = ఱెక్క 33.అల = చిఱుకెఱటం 34. ఆన = ఒట్టు 35. బాన = గుండ్రని కాగు 36. వాన = వర్షం 37. జేన (జాన) = వయోజనుల (adutls) అరిచేతిని పూర్తిగా చాపినప్పుడు బొటనవేలి కొస నుంచి మధ్యవేలి కొస దాకా వచ్చే పొడవు 38. చెఱ = బంధనం 39. అర = కొయ్యసామగ్రిలోని గడి 40. మర = యంత్రం 41. వల = చేపలుపట్టడానికి వాడే అల్లికపని 42. కడ = అంతం 43. వడ = మినపప్పుతో చేసే ఒక భక్ష్యం 44. తెగ = ఉపజాతి 45. నగ = ఆభరణం 45. పగ = ప్రతీకారవాంఛ 46. గది = ఇంటిలో ఒక భాగం 47. రొద = రణగొణధ్వని 48. పొద (పొదరు) = మొక్కల గుబురు. 49. చెద = తెల్ల పురుగుల గూళ్ళు 50. వెల= మూల్యం

(తరువాయి వచ్చే సంచికలో...)

శ్రద్ధాంజలి


అమ్మకు విప్లవ వందనాలు
ప్రభలకుమారికి కుమార్తె బీనాదేవి కన్నీటి వీడ్కోలు



తిరుపతి మావోగా ప్రసిద్ధి పొందిన త్రిపురనేని మధుసూదనరావు సతీమణి(73) ఈ జనవరి 13న తీవ్ర అనారోగ్యానికి గుర్తై మరణించడం బాధాకరం. ఆమెకు కొడుకు విజయకుమార్ కుమార్తె బీనాదేవి వున్నారు. కృష్ణాజిల్లా గుడివాడ సమీపంలోని నందివాడకు చెందిన ప్రభలకుమారి త్రిపురనేని జీవిత సహచారిగా ఆయన విప్లవ సాహిత్య రాజకీయ అడుగు జాడల్లో నడిచారు. ఎమర్జెన్సీ సమయంలోనూ, చిత్తూరు, సికింద్రాబాదు కుట్రకేసుల్లో త్రిపురనేని అరెస్టు అయి లెక్చరర్ ఉద్యోగం నుంచి సస్పెండ్ అయినప్పుడూ, ఇతర నిర్బంధ సమయాల్లోనూ ఆమె ఎన్నో కష్టాలు, బాధలు భరించారు. ఎన్నడూ ధైర్యం కోల్పోలేదు. పశ్చాత్తాపం చెందలేదు. పిల్లల భవిష్యత్తును భర్త పట్టించుకోకున్నా, కుటుంబం ఎంతో– విప్లవమూ అంతే అని నమ్మింది. ఆమె ఉద్యమంలో చేసే విద్యార్థులు, రచయితలు ఆమెకెంతో ప్రీతిపాత్రులు. వాళ్ళ బాగోగులు, ఉద్యమకార్యక్రమాల గురించి మాతో వెళ్ళినప్పుడంతా మాట్లాడేది ప్రభలకుమారి. సాధారణ గృహిణేకాదు అసాధారణ మహిళ కూడా. సంప్రదాయం ఆచారాలకు భిన్నంగా తిరుపతి గోవిందధామంలో ఆమె అంత్యక్రియలను కుటుంబ సభ్యులు నిర్వహించారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ త్రిపురనేని కుటుంబంతో తనకు విడదీయరాని అనుబంధం వుందని గుర్తుచేసుకున్నారు. ప్రభలకుమారి భౌతికకాయంపై చంద్రశేఖర్, జ్యోతి, శ్రీరాములు ఎర్రజెండా కప్పి వివాళి అర్పించారు. దహనపేటిక మీద అమ్మను చూస్తూ బీనాదేవి 'మా అమ్మ లేకుండా మా నాన్న లేరు'. అమ్మా నన్ను కన్నందుకు విప్లవాభినందనాలు' అని కన్నీళ్ళతో వీడ్కోలు పలికారు.

–సాకం నాగరాజు

సీమ వాకిట... కథా నిలయం 'కారా'బాటలో 'అరా'!



మంచి పనుల్ని కొంతమంది మంచివాళ్ళు అందిపుచ్చుకుంటారు. అలాంటి మంచివాళ్ళలో జనవరి 31న కన్నుమూసిన అబ్బిగారు రాజేంద్రప్రసాద్ ఒకరు. కారా మాస్టారు 'కథానిలయం' స్థాపించారని చాలా మందికి తెలుసు. అలా తెలుసుకున్న అబ్బిగారి రాజేంద్రప్రసాద్(అరా) ఓ కథానిలయాన్ని నందలూరులో స్థాపించి అందులో వేలాది పుస్తకాలను సేకరించి పెట్టారు. కానీ కాళీపట్నం కథానిలయంతో అబ్బిగారి కథానిలయానికి పోలిక తగని కార్యం. కథానిలయం పేరు – ఓ ముచ్చట అబ్బిగారికి. ఆ పేరుమీద 15 సం॥రాల పాటు కవుల జయంతులు, వర్థంతులు, పుస్తక ఆవిష్కరణలు, రచయితల సత్కారాలు, ఆవిష్కరణలు,.... లెక్కేలేదు. విద్యార్థి దశలో వామపక్షభావచైతన్యం, కడప ఆర్ట్స్ కళాశాల విద్యార్థి సంఘం చైర్మన్ పదవి రాజేంద్రకు పేరు తెచ్చిపెట్టింది. ఎదుటి మనిషిని పలకరించడంలో ఆత్మీయత గుబాళించడం ఇంకో గొప్పదనం. పుస్తకాన్ని రచయితను నెత్తిన పెట్టుకొని ఊరేగిన వ్యక్తిగా గుర్తింపు పొందిన ధన్యజీవి అ.రా.1962 జూన్ 15న పుట్టిన రాజేంద్రప్రసాద్ అరవై ఏళ్లలోపే కనుమరుగు కావటం సమాజంలో ఎంతో లోటును మిగిల్చింది.

–సాకం నాగరాజు

ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి
98481 23655

పడమటిగాలితో నివురు తొలగిన తెలుగు భాషా సాహిత్య సంపద 10

భారతదేశం అనాదిగా సహజ జల సంపద, అటవీ సంపద, భూగర్భంలో దాగిన ఖనిజ సంపద మొదలయినవి పుష్కలంగా ఉన్న సంపన్న వనరులున్న నేల మనది. మన పూర్వీకులు ఒక మాట అనేవారు. మనదేశంలో భూమిపైన ఎంత సంపద ఉందో దానికి వేలరెట్లు భూమిలో కోటానుకోట్ల సంవత్సరాల వరకూ నిక్షిప్తమైన తరగని సంపద ఉంది అనేవారు. అందుకేనేమో మన దేశం పైన ప్రపంచ దేశాలు దండెత్తి సహజ సంపదను యథోచితంగా దోచుకున్నారు. నిజానికి ఒకనాటి రోజుల్లో భారత దేశమంతా చిన్నిచిన్ని రాజ్యాలుగా సుభాలుగా, పరగణాలుగా, ప్రాంతాలుగా విభక్తమయి ఉండేది. బలవంతుడయిన రాజుకు చిన్నిచిన్ని రాజ్యాలు కప్పంకడుతూ జీవించేవాళ్ళు. క్రీస్తుపూర్వం రాజ్యం చేసిన చక్రవర్తులు, రాజులయిన అశోకుడు, చంద్రగుప్తమౌర్యుడు సముద్ర గుప్తుడు, బిందుసార, పుష్యమిత్ర శుంగుడు లాంటివాళ్ళు క్రీస్తుపూర్వం నాటి వాళ్ళు. క్రీస్తుశకంలో మహేంద్రవర్మ, స్కాందగుప్త, దంతిదుర్గ, శిముఖ, సింహ, విష్ణుగుప్త, చాళుక్య, శ్రీకృష్ణదేవరాయ మొదలయిన రాజులెందరో పరిపాలించారన్నది చారిత్రక సత్యం.

ఈ నేపథ్యంలో భారతదేశంపై దండెత్తి మనపై రాజ్యం చేసిన తురుష్కులు, మహమ్మదీయులు, అరబ్బులు, మంగోలులు పాశ్చాత్య దేశాలయిన పోర్చుగీస్, డచ్, ఫ్రెంచ్, ఇంగ్లండ్ మొదలయిన ఈస్టిండియా కంపెనీలు భారతదేశాన్ని ఆక్రమించి వర్తక వాణిజ్య వ్యాపారాలు చేస్తూ మనగడ్డపై మనలను కూలీలుగా, బానిసలుగా, సేవకులుగా చేశారన్నది స్తవము కాని వాస్తవం. భారతదేశ సహజ సిద్ధమైన సంస్కృతి సంప్రదాయాలతోపాటు ఇతర దేశాల సంస్కృతి, సంప్రదాయాలు, ఆహారపుటలవాట్లు, పండుగలు, వినోదాలు, ఆటపాటలు, వస్త్రధారణ, భాషలో ఆదాన ప్రదానాలు మొదలయినవన్నీ మనదేశీయ సంస్కృతిలో, సంప్రదాయాల్లో కలిసిపోయాయి. పాలకుల ప్రభావం పాలితులమీద ఉంటుందన్నమాట అక్షరాక్షరసత్యం. అన్ని రకాల ఆటుపోట్ల మధ్య మనకంటూ మిగిలిన సంస్కృతి, సంప్రదాయలు, చరిత్ర ఏదీ గ్రంథస్తం కాలేదు. దీనికిగాను కాళ్ళకు బలపాలు కట్టుకొని శ్రమించిన కల్నల్ కాలిన్ మెకంజీ (1754-1821) లాంటి వారికి చేదోడు వాదోడుగా నిలిచిన కావలి వెంకట బొర్రయ్య, కావలి వెంకట లక్ష్మయ్య, రామస్వామిల సహకారం మరువలేనిది. **వీరిని కావలి సోదరులు అనేవారు.** వీరిలో బొర్రయ్య జీవించింది 27 సంత్సరాలే అయినా (1776-1803) ఆంధ్రదేశం మాత్రమే కాకుండా భారత దేశమంతా ఋణపడేటంత కృషి చేసి తరగని చారిత్రిక విషయ విజ్ఞాన సంపద మనకు అందించాడు.

కావలి వెంకట సుబ్బయ్య రెండో కుమారుడు కావలి వేంకట బొర్రయ్య పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు వాసి 1776లో జన్మించారు. స్వగ్రామంలోని వీధిబడిలోనే విద్యాభ్యానం ప్రారంభమయింది. పన్నెండేళ్ళు వచ్చేసరికి సంస్కృత కావ్యాలు అధ్యయనం చేయడంతోపాటు స్వంతగా సంస్కృత శ్లోకాలు అల్లడం నేర్చుకున్నాడు. సంస్కృతంతోపాటు ఉర్దూ, తెలుగు నేర్చుకున్నాడు. పద్నాలుగో ఏట ఏలూరుకు తూర్పుగా ఉన్న కొత్తూరు జాగీర్‌దార్‌గారి కాజీగారి దగ్గర పారశీక, హిందూస్తానీ భాషలు నేర్చుకున్నాడు. బొర్రయ్య కున్న చురుకుదనం, అపారమేధాసంపత్తిని గుర్తించిన కాజీగారు ఆప్యాయంగా, ఆనందంగా అమిత శ్రద్ధతో భాషల అధ్యయనంపై ఆసక్తిని కలిగించాడు.

బొర్రయ్యకు పద్నాలుగు ఏళ్ళు వచ్చేసరికి బందరులో మోర్గాన్ దొర నేతృత్వంలో ఉన్న ఇంగ్లీషు బడిలో అతికొద్దికాలంలోనే ఇంగ్లీషు చదవడం, రాయడం, మాట్లాడడం నేర్చుకున్నాడు. బొర్రయ్యకున్న ప్రావీణ్యం శ్రద్ధను గమనించిన దొరలు కూడా బాగా ప్రోత్సహించారు. దీనికి తోడు బొర్రయ్య అన్న నారాయణప్ప, అప్పటికే కుంఫిణీ కొలువులో ఉద్యోగిగా ఉన్నాడు. నారాయణప్ప నమ్మకం గల సేవకుడిగా పేరుంది. అన్న నారాయణప్ప వినయం, విధేయత, విశ్వాసం, నమ్మకంగల కుంఫిణీ ఉద్యోగి అయినందువల్ల అన్నలాగే కుంఫిణీ ఉద్యోగం సంపాదించాలనే కోరిక కూడా బొర్రయ్యకు ఉంది పైగా ఆరోజుల్లో కుంఫిణీ ఉద్యోగి అంటే సమాజంలో ఎనలేని గౌరవ మర్యాదలుండేవి. అది గొప్ప హోదాగా భావించేవారు. అన్నగారి లక్షణాలన్నీ పుణికి పుచ్చుకున్న బొర్రయ్య అంటే పైఅధికారులకు, ఆనాటి దొరలకు మంచి అభిప్రాయం ఉండేది. దేశీయ పటాలానికి అధికారిగా ఉన్న కర్నల్ పియర్స్ దొరకు బొర్రయ్య అభిమాన పాత్రుడయ్యాడు. అందునా బహుభాషాప్రావీణ్యం ఉన్నందువల్ల పియర్స్ దొర ప్రోత్సాహం బొర్రయ్యకు లభించింది. పియర్స్ దొర సిఫారసుతోనే బొర్రయ్యకు బందరు పే మాస్టర్ కచేరిలో ఉమేదువారిగా చేరే అవకాశం కలిగింది. **ఉమేదువారీ అంటే జీతంలేని తాత్కాలిక గుమాస్తా అని అనేవారు**. ఇది ఒక రకంగా ఉద్యోగిగా చేరడానికి ముందు పనినేర్చుకునే విధానం. వారి ప్రవర్తన పనిని బట్టి ఉద్యోగం లభిస్తుంది. నేర్చుకునేకాలంలో వారి పనిసామర్థ్యం బట్టి కొద్ది జీతంతో మొదలయి పెద్దపెద్ద పదవుల వరకూ వెళ్ళగలిగేవారు. బొర్రయ్య సహజంగా నమ్మకస్తుడిగా, వినయ వివేకశీలిగా ఉన్నందువల్ల అనతి కాలంలోనే మంచి జీతానికి కుదిరాడు. రైటరు ఉద్యోగంలో చేరడం అంటే ఆరోజుల్లో గొప్ప ఉద్యోగమే. ఉద్యోగంలో ఆనుపానులన్నీ కరతలామలకం చేసుకున్నాడు. అది బొర్రయ్య భావి జీవితానికి ఎంతో

మేలయింది. దొరల అభిమానానికి పాత్రుడయ్యాడు. అందువల్ల ఒంగోలు, మునగాల, కొండపల్లి కసుబాలలో ఉండే సైనిక దళాలకు జీతాలు బట్వాడా చేసే స్థాయికి ఎదిగాడు ఎంతో నమ్మకమైన వ్యక్తికి మాత్రమే వేలకు వేల వరహాలు ఇచ్చి బట్వాడా చేసే అవకాశం ఉండేది. ప్రతి పనిలోనూ నమ్మకంగా ఉండేవాడు. పని చిన్నదా పెద్దదా అని కాకుండా, యిచ్చిన పని నమ్మకంగా చేసేవాడు. అదే అతన్ని ఉన్నత శిఖరాలకు చేర్చింది.

ఈ నేపథ్యంలో బొర్రయ్య మాధవాయపాలెంలో ఉన్న డెంటుదొర దగ్గర రైటరుగా కుదిరాడు. ప్రతిభవున్నవాడు కేవలం రైటరుగా పనిచేయడం అన్న నారాయణప్పకు నచ్చలేదు. అందువల్ల మళ్ళీ పియర్స్ దొరవద్ద హెడ్ రైటర్‌గా నియమించే ఏర్పాటు చేశాడు. ఇదే బొర్రయ్య జీవితంలో పెద్ద మలుపు. ఒక ఏడాది తిరిగేలోగా కల్నల్ మెకంజీ బొర్రయ్య పనితీరు గమనించి తన కొలువులో హెడ్ ఇంటర్ ప్రెటర్‌గాను, ట్రాన్స్ లేటర్‌గా (అనువాదకుడిగా) తీసుకున్నాడు. అంతే బొర్రయ్య జీవితకాలం మెకంజీ దగ్గరే వివిధ హోదాల్లో పనిచేశాడు. మెకంజీతోపాటు బొర్రయ్య హైదరాబాదు వెళ్ళవలసి వచ్చింది. అక్కడ భారతీయ భాషల్లో పరిచయం లేని సర్వే ఇంజనీర్లకు కుడి భుజమయి మన దేశీయ విజ్ఞానం గొప్పదనాన్ని ప్రదర్శించేవాడు. అదే బొర్రయ్యను శాసన లిపి పరిష్కరించే విధంగా తీర్చిదిద్దింది. ఈ కాలంలోనే ప్రాచీన నాణాల సేకరణ, ప్రాచీన తాళపత్ర గ్రంథాల సేకరణ, భారతీయ భాషా విజ్ఞాన సంపద గుది కూర్చిన గ్రంథాలు సేకరించి ఒక సంస్థ ఏర్పాటు చేసే స్థాయి కలిగించాడు. ఈ కాలంలోనే మెకంజీ నేతృత్వంలో నేర్చుకున్న గణితశాస్త్రం, రేఖాశాస్త్రం, భూగోళశాస్త్రం, ఖగోళశాస్త్రం మొదలయిన వాటిని క్షుణ్ణంగా అధ్యయనం చేసి అభ్యసించి ఆచరణలో పెట్టాడు. ఈ శిక్షణలోనే వివిధ భాషల్లో ప్రావీణ్యం సంపాదించాడు. అంతకుముందే మెకంజీ సేకరించిన తమిళ, కన్నడ, సంస్కృత శాసనాలను చదివి విపుల వ్యాఖ్యానాలు తయారు చేశాడు. ఈ అధ్యయనంలోనే భూగోళ పటాలు తయారు చేసే పద్ధతి నేర్చుకుని అది కార్య రూపంలో చూపాడు. దీనికి ఓ కారణం ఉంది. హైదరాబాదు నుంచి మద్రాసుకు మెకంజీతో పాటు కాలినడకన బయలు దేరవలసి వచ్చింది. ఈ పర్యటనవల్ల దేశీయ పటాలు తయారు చేసే అవకాశం అనుభవం కలిగింది. **మెకంజీ తన జ్ఞాన సంపత్తి అంతా బొర్రయ్యకున్న అపార మేధాసంపత్తిని జోడించి దక్షిణ భారతదేశ నిర్మాణ పట రచనకు పురికొలిపింది.**

బొర్రయ్యకు మరో ప్రత్యక్ష అనుభవం కలిగింది. 1779లో రంగపట్టణం ముట్టడి సమయంలో దారి పొడవునా కలిగిన అనుభవాలు సన్నివేశాలు వివరణాత్మకంగా ఒక డైరీ రాశాడు. అన్నీ పద్యరూంలోనే రూపొందించాడు. 1777 మే 4వ తేదీనాడు టిప్పు రాజధాని అయిన శ్రీరంగ పట్టణం పతనాన్ని బొర్రయ్య స్వయంగా చూశాడు. శ్రీరంగ పట్టణం ముట్టడిని ఆనాటి బీభత్స దృశ్యాలన్నింటినీ పద్యాలతో ఆవేశపూరితంగా వర్ణించాడు. బ్రిటీషు వారు టిప్పుసుల్తాన్ మృతదేహం కళ్ళారా చూచేవరకూ శ్రీరంగ పట్టణం తమ వశమయిందని నమ్మలేకపోయారు. రెపరెపలాడే బ్రిటీష్ పతాకం జాక్ కోట బురుజుల మీద ఎగరటాన్ని కవితగా వర్ణించాడు. బొర్రయ్య రచనల్లో ఇది చెప్పుకోదగినది. 1799 నాటికి అచ్చయింది. సర్ ఆర్థర్ వెల్లస్లీ 1800లో ధుండే అనే మహారాష్ట్ర నాయకునితో చేసిన పోరాటాన్ని ఒక కావ్యంగా రాశాడు. బొర్రయ్య రచనల్లో శ్రీరంగ చరిత్రము, శ్రీరంగరాజా వంశావళి, యాదవరాజ వంశావళి, కాంచీపుర మహత్మ్యము, నూరు శ్లోకాలున్న సత్పురుష వర్ణనము అనే సంస్కృత శతకం మొదలయినవి ముఖ్యంగా కన్పిస్తున్నాయి.

బొర్రయ్య పర్యటించే ప్రతిచోట ప్రాచీన నాణాలు సేకరించేవాడు. ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రాచీన శాసనాల ప్రతిబింబాలు తీసి అవసరమైనచోట అనువదించి మెకంజీకి యిచ్చేవాడు. శ్రీరంగపట్టణం ముట్టడి తర్వాత ఒక హళె కన్నడ శాసనాన్ని చదివి అప్పటికప్పుడు అర్థం చెప్పాడు. **బొర్రయ్య భాషా నైపుణ్యం ప్రశంసిస్తూ మెకంజీ ఆ శాసన శిలకింద బొర్రయ్య పేరు చెక్కించి రాయల్ ఏషియాటిక్ సొసైటీకి పంపాడు.**

నిజాము రాజ్యాల దేశపటం తయారు చేసి మద్రాసుకు సమర్పించిన ఘనత బొర్రయ్యకే దక్కుతుంది. బొర్రయ్య శ్రమకు మెచ్చి రెండువందల వరహాలు పారితోషికంగా యిచ్చాడు. ఈ ప్రోత్సాహం వల్ల బొర్రయ్య తన కింద మరి కొంతమందిని తయారుచేసి విషయ సేకరణ ఎలా చేయాలో నేర్పించాడు. వివిధ ప్రాంతాలకు పంపి, వారు చేసేపని విధానం నేర్పించాడు. వీరి సేకరణలో దేశ చరిత్రలు, స్థానిక చరిత్రలు, భూగోళం, వైద్యం, సాహిత్యం , రసాయనిక శాస్త్రం, ప్రాచీన శాసనాలు నాణాలు, ప్రాచీన వస్తువులు, బొమ్మలు హస్తకళలకు సంబంధించిన ఆకృతులెన్నో సేకరించారు. బొర్రయ్యకు సహకరించన వారిలో పురిగడ్డ మల్లయ, నారాయణరావు, ఆనందరావు, నిట్టల నాయిని, వెంకట్రావు మొదలయిన వారున్నారు. వీరు ఏరోజుకారోజు తమ దిన చర్యను అంచె టపాల ద్వారా బొర్రయ్యకు చేరవేసేవారు. వీరందరి కృషి వల్ల దక్షిణ భారతదేశంలోని ప్రతిగ్రామ చరిత్ర మత సంబంధమైన దేవాలయాలు, ఆశ్రమాలు, మశీదులు, శిల్పకళా నైపుణ్యం ప్రదర్శించే కట్టడాలు, తాళపత్ర గ్రంథాలు మొదలయినవి ఉన్నాయి.

మెకంజీ సంపుటాల్లో తెలుగు(ఆంధ్ర) భాషకు సంబంధించిన సంపుటాలు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారు నిడదవోలు వెంకటరావు, ఆచార్య చల్లా రాధాకృష్ణశర్మ, పర్యవేక్షణలో ఎత్తి రాయించారు. ఈ సంపుటాలు కొన్ని తెలుగు విశ్వ విద్యాలయంవారి గ్రంథాలయంలో కూడా ఉన్నాయి. ఈ సంపుటాల్లో గ్రామ వృత్తాంతాల చరిత్రలేకాకుండా స్థానిక ప్రభువుల, దేశ పాలకుల వంశ వృతాంతాలు, క్షేత్ర మహాత్మ్యాలు, నదులు, చెరువులు, దారులు, మొదలయిన వివరాలు ఉన్నాయి. బొర్రయ్య తనతోపాటు తన తమ్ముళ్ళయిన వెంకటలక్ష్మయ్య, రామస్వామినీ మెకంజీ వద్ద కొలువులో చేర్పించాడు. **బొర్రయ్య మెకంజీ కొలువులో పని చేసింది కేవలం ఆరు సంవత్సరాలు మాత్రమే. ఒక జీవితకాల కృషి చేశాడు.** కాని 1803లో తన 26 వ యేట సన్నిపాతంవల్ల మరణించాడు.

బొర్రయ్య మరణం మెకంజీని కలచివేసింది. మద్రాసు సముద్ర తీరంలో బొర్రయ్య అంత్యక్రియలు చేసిన ప్రదేశంలో ఒక శిలా ఫలకం వేయించాడు.

బొర్రయ్య మరణానంతరం లక్ష్మయ్యను మెకంజీ ప్రోత్సహించాడు 1815 నాటికి మెకంజీ భారతదేశానికి సర్వేయర్ జనరల్‌గా నియమితుడయ్యాడు. అనంతరం తనకు సహాయంగా ఉన్న లక్ష్మయ్యకు మద్రాసు పరిసరాల్లో ఉన్న ఒక గ్రామం ఈనాముగా యిచ్చి రెండు తరాలు దాకా అనుభవించే హక్కు ఏర్పాటు చేశాడు. 1811లోనే ఒక విల్లు రాస్తూ తన ఆస్తిలో పదోవంతు లక్ష్మయ్య కుటుంబానికి, అతని తమ్ముడయిన రామస్వామి కుటుంబానికిచెందే విధంగా రాశాడు **తన దగ్గర పనిచేసిన కావలి సోదరుల కుటుంబాలకు జీవితకాలం ఏ లోటూ లేకుండా ఉండాలనే సత్సంకల్పం గల మెకంజీ ఔదార్యం తరతరాలకు మార్గదర్శకం.**

మెకంజీ సేకరించిన సంకలనాలు అమూల్యమైనవి, అవి వెలకట్టలేనవి. దేశ చరిత్రకు కావలసిన ఆకరాలు సమకూర్చిన కావలి సోదరుల కృషి భావితరాలకు తరగని సంపద. **నిజానికి తొలి తెలుగు ఎపిగ్రఫిస్టు, ఆర్కియాలజిస్టు కావలి బొర్రయ్య అనే చెప్పాలి.** భాషా పరంగా కొన్ని విషయాలు రేఖామాత్రంగా స్పృశించవలసిన అవసరం ఉంది.

లేఖన సంప్రదాయాలు

బొర్రయ్య ఆయన అనుచరులు సమకూర్చిన తెలుగు వృత్తాంతాల్లోని భాష ఆనాటి క్లిష్ట వ్యావహారికమనే చెప్పాలి. వీరి సేకరణలో ఆయా గ్రామాల్లోని వృద్ధులను, గ్రామాధికారులను, ఆయా కులాల పెద్దలను అడిగి సేకరించిన విషయాలతోపాటు తాళపత్ర గ్రంథాల్లోని వివరాలు ఆనాటి కైఫీయతులు. మెకంజీ సంకలనాలలో లేఖన సంప్రదాయాలు 7 విధాలుగా వర్గీకరించవచ్చు. ఆనాటి భాషలో తెలుగు శాసన భాష బాగా కనిపిస్తుంది.

1. పూర్ణబిందువు: పూర్ణబిందువు తర్వాత అక్షరం ద్విత్వం కావడం మెకంజీ సంకలనాల్లో ఉంది. ఉదా: మహారాజులుంగ్గారు (మెకంజీ సంపుటి 398 పుట 2) మచ్చలిబంద్దరిలో (మెకంజీ సంపుటి 47 పుట 33) ద్విత్వ లేఖనానికి మారుగా బిందువు రాయడం ఉదా: ఇంణి దరబారుకు పిలిపించి – మెకంజీ సంపుటి 80 పుట 105. కొన్ని సందర్భాల్లో నిర్హేతుకంగా పూర్ణ బిందువు రాయడం కూడా కనిపిస్తుంది. ఇది శాసన భాషలో కూడా కనిపిస్తోంది. శేరు సాహెబు ఆంమ్లీలో – మెకంజీ సంపుటి 45 పుట 43 ఆంలిస్తూన్నే – మెకంజీ సంపుటి 244 పుట 78

2. శాసన భాషలో రేఫకు బదులుగా వలవల గిలక రాయడం కనిపిస్తుంది. ఇది 1970 ప్రాంతం వరకూ ఉన్న ప్రామిసరీ నోట్లలోనూ, ఆస్తి మొదలయిన రిజిస్ట్రేషన్ పట్టాల్లోనూ కనిపిస్తుంది. ఉదా : బలగ ᒥ వ్వం బొప్పంగ – పండరంగని అద్దంకి శాసనం 770 ప్రాంతం. దర్వాజాకు తూప్పు ᒥ లోతటుట మెకంజీ సంపుటి 272 పుట 6 వెంకట నరసింహ్వా శాస్తుల్ల ᒥ తంముడు – మెకంజీ సంపుటి 104 పుట 1 వలపలగిలకకు పూర్వముందున్న అక్షరం ద్విత్వం పొందని రూపాలు కూడా కొన్ని ఉన్నాయి. కూచి ᒥ, ఖచు ᒥ మొదలయినవి.

3. పదమధ్యంలోపించి సంయుక్తత ఏర్పడం దస్తావేజుల్లోనూ ఉందని సి.పి. బ్రౌన్ A Dictionary of the mixed dialects and foreign words used in Telugu పుట 31లో పేర్కొన్నాడు. – మ్లేచ్ఛా క్రాంతములయినందున్న మెకంజీ సంపుటి 28 పుట 9 – మొదలయ్న వారితో మెకంజీ సంపుటి 113 పుట 102 ఇంకా వలశ్చి, కస్కు త్సఖా మొదలయినవి.

4. ఋకారానికి బదులు ఇత్వ సహిత రేఫ ప్రాచీనకాలంలో కనిపించే సంప్రదాయం. ఇదే మెకంజీ సంపుటాల్లో కూడా కనిపిస్తుంది.

క్రిష్ణాజీ పంతులు వారి తాకీదు – మెకంజీ సంపుటి 105 పుట 158 ప్రెత్తులుగా యేర్పరచినారు మెకంజీ సంపుటి 1 పుట 132

5. సంక్షేమ లిపి C contraction of the Script లేఖన సౌలభ్యం కోసం ఒక పదంలోని తొలి అక్షరాన్ని పదానికి మారుగా వాడటం నాటికీ నేటికీ ఉన్న సంప్రదాయం. కు॥ కుచ్చెళ్ళు – యెనిమిది కుచ్చెళ్ళన్నర మెకంజీ సంపుటి 1 పుట 74 భ॥ భరణము – భ 1కి అయిదు చవుతుల చొప్పున – మెకంజీ సంపుటి 20 పుట 4 అలాగే రూ॥ రూపాయి, శా॥ శాలివాహన చొ॥ చొప్పున తా॥ తారీఖుకు మొదలయినవి.

6. హ్రస్వం రాయవలసిన చోట దీర్ఘం రాయటం, దీర్ఘం రాయవలసిన చోట హ్రస్వం రాయటం విర్ని = వీరిని, విర్ని అందర్ని – మెకంజీ సంపుటి 93 పుట 61 బురూజు = బురుజు, బురూజు – మెకంజీ సంపుటి 80 పుట 93

7. గహ్వర, జిహ్వ మొదలయిన పదాలు రాసేటప్పుడు గంహ్వర, జింహ్వ అని రాయడం ఆనాటి కాలంలో ఉంది. నరసింహ్వ – మొదలుగునవి. – మహారాష్ట్రుల ప్రభావం ఆంధ్రదేశం పై ఉన్న దనడానికి కొన్ని ఉదాహరణలు చెప్పవచ్చు.

శివాజి పరిపాలనా కాలంలో పన్ను వసూలు చేసే పద్ధతిని చౌతు అనేవారు. అది ఆంధ్ర ప్రాంతంలో మనకు మహారాష్ట్ర నుంచి వచ్చిన పదం అని నిర్ధారణ. తెలుగు సీమలో రెడ్డి, కరణం, వెట్టి, తలారి మొదలయిన పన్నెండుమంది గ్రామోద్యోగుల్ని "బారాబలూతి" అని వ్యవహరించే సంప్రదాయం మహారాష్ట్ర నుంచి దిగుమతి అయిన పదం.

తెలుగు వారిలో కొందరి పేర్ల చివర రావు, పంతులు, అనే బిరుదు నామాలు మరాఠి సంప్రదాయ కరణమే. ఇవన్నీ మెకంజీ సంపుటాల్లో ఉన్నాయి. ఆరె మరాఠీలు – తెలుగు వారిపై ఉన్న భాషా ప్రభావాన్ని ఆచార్య పేర్వారం జగన్నాథం గారు వివరించారు. మెకంజీ సంకలనాల్లో ఉరుదూ, మరాఠీ, ఒరియా పదాలు గుర్తించి వివరించిన డాక్టర్ రాళ్ళబండి శ్రీరామశాస్త్రి, ఆచార్య దొణప్ప గారి పర్యవేక్షణలో పిహెచ్.డి. డిగ్రీ పొందిన వ్యాసంలో కూడా కొన్ని వివరాలు కన్పిస్తాయి.

ధారావాహిక

ఈమని శివనాగిరెడ్డి
98485 98446

అడుగుజాడలూ ఆనవాళ్లు–7

నా కనిగిరి – దొనకొండ యాత్ర

నేను వారసత్వ స్థలాలు, చారిత్రక కట్టడాలను చూడటానికి పల్నాడు వెళ్తున్నప్పుడల్లా, మా ప్రకాశం జిల్లా క్కూడా రావచ్చు గదా అని ప్రముఖ చరిత్రకారుడు విద్వాన్ డా॥జ్యోతి చంద్రమౌళిగారన్నమాట గుర్తుకొచ్చింది. గుర్తుకురావటమే కాదు. పల్నాడుకు పయనం కట్టినపుడల్లా, ఆయన నా కళ్లముందు వాలిపోతుండేవాడు. అయినా అటువైపు వెళ్లటం కుదిరేది కాదు. ఎప్పటిలాగే ఒక శనివారంనాడు పల్నాడులోని మాచర్ల, జమ్మలమడక, తుమ్రుకోట, మల్లవరం, చూచిరావడానికి ఏర్పాట్లు చేసుకొని తెల్లవారుఝాము 3 గం॥లకు బయలుదేరి మాచర్ల వైపు వెళ్తామని డ్రైవర్ శివకు చెప్పి, సంచి సర్దుకుంటున్నానోలేదో,జ్యోతిచంద్రమౌళిగారు ఫోనుచేసి, అద్దంకి రమ్మని నాచేత ఒప్పించి, దారి మళ్లించారు. రాత్రి 9గం॥లకు అన్నంతిని మళ్లీ ఆఫీసుకెళ్లి ప్రకాశం, గుంటూరు జిల్లాల మ్యాపులు తీసుకొని ప్రయాణం గురించి డ్రైవర్‌కు, నా సహోద్యోగి దుర్గాసాగర్‌కు తెలియజేసి, ఇంటికొచ్చి పడుకొన్నాను. నిద్దరపడితేగా. ప్రకాశం జిల్లా అనగానే అద్దంకి పండరంగని శాసనం, ధర్మవరం జైన బసది, దర్శిదేవాలయం, పొదిలి కట్టడాలు, కనిగిరికోట కళ్లముందు ముసురుకున్నాయి. మానసిక తర్జనభర్జనల మధ్య మణికేశ్వరం, సురభేశ్వరకోన పోదామనుకున్నాను. కాదు, కొణిదెన, చదలవాడ, చందలూరు అయితే బాగుంటుందనిపించింది. కాదు, కాదు, మాలకొండ, సింగరకొండ, సింగరాయకొండ, మిట్టపాలెం, చెన్నపల్లి చూద్దామనుకొన్నాను. ఇన్ని గందరగోళాల మధ్య తన్నుకొని, తన్నుకొని, చివరికి కాటమరాజు తిరగాడిన కనిగిరి, పాలేటిగంగ, పంచలింగాల కొండ, పునుగోడు, గంగదొనకొండ, వల్లూరు, కురిచేడు వెళ్ళొస్తే బాగుండునని, మనసును స్థిమితపరచుకొన్నాను. వీరగాధలపై విస్తృత పరిశోధనలుగావించిన డా.తంగిరాల వెంకటసుబ్బారావుగారు గుర్తొచ్చి ఈ పర్యటనా స్థలాల వరుసను ఎంపిక చేసుకోవడంలో పరోక్షంగా సహకరించారు. మారిన బాటగురించి డ్రైవర్‌కు, జ్యోతిచంద్రమౌళిగారికి తెలిపాను. చంద్రమౌళిగారేమో, అద్దంకి, ధర్మవరం, అనమలూరు, మణికేశ్వరం చూద్దామన్నారు. కాదని, నాచూపు ఇప్పుడు కనిగిరి వైపు అని కరాఖండిగా చెప్పాను. సరేనన్నా, ఆయన కనిగిరి కరుణానిధికి ఒకసారి ఫోన్ చేయమన్నారు. అప్పటికే రాత్రి 11.00 గంటలైంది. కరుణానిధితో, తరువాతి రోజు కనిగిరి వస్తున్నాము. మొదటగా నేలటూరి గొల్లపల్లిలోని ఇనుప యుగపు సమాధులు చూద్దాం. ఉదయం ఆరింటికి సిద్ధంగా ఉండమన్నాను. అనుకున్నట్లుగానే 3.00గం॥లకు బయలుదేరి 4.00 గం॥లకు చిలకలూరిపేటలో ఆగి, టీతాగి, గణపవరం మీదుగా అద్దంకి చేరుకుని, చంద్రమౌళిగారిని కారులో ఎక్కించుకొని, కనిగిరి చేరుకున్నాం. ఇంకా తెల్లవారలేదు. అలికిడి మొదలైంది. కరుణానిధి ఫోను ఎత్తటం లేదు. కంగారు మొదలైంది. ప్రత్యామ్నాయంగా చంద్రమౌళి మాష్టారు శిష్యుడైన ఇంకో ఉపాధ్యాయుని ఇంటికెళ్ళాం. ఆయన్ను లేపి అడిగితే రావటం కుదరదని చెప్పి, టీ తాగి పొమ్మని బలవంతం చేశాడు. ఇంతలో కనిగిరి కరుణానిధి ఫోను! తాను కనిగిరి సెంటర్‌లో ఉన్నానని! ఆనందానికి అవధుల్లేవు. సగం కప్పుటీని అలానే వదిలేసి కరుణానిధిని కలిశాం. ముందుగా సి.యస్.పురం రోడ్డులోని నేలటూరు–గొల్లపల్లికి బయలుదేరాం. అప్పుడే రాత్రి తెరతొలగించుకొని వెళ్లిపోయింది. సూర్యుడు రాలేదు గానీ, వెలుగు రేఖలు పుంజుకుంటున్నాయి. పది నిముషాల ప్రయాణం తరువాత కారు ఒక కల్వర్టు దగ్గర ఆగింది. దిగి ఎడమవైపు చూస్తే, ఎప్పుడో కొట్టేసిన మోడువారిన చెట్ల మాదిరిగా, నిలువురాళ్ళు కనిపించాయి. చంద్రమౌళిగారు, ఇవే ఇనుపయుగపు ఆనవాళ్ళు అని చూపించారు. బాగా వెలుతురొచ్చింది. సూర్యుడు చెప్పాపెట్టకుండా ఎగబాకుతున్నాడు. గొల్లపల్లి రైతు ఒకాయన అటువెళుతుంటే వీటిని ఏమంటారని అడిగాను. ఇవి నిలువు రాళ్ళు, ఏనెలని కూడా అంటామని, ఈ నేలను నిలువురాళ్ల చెల్క అంటామన్నాడు. తమ పూర్వీకులు వీటిని పాండవుల గుళ్లు అనీ, రాక్షసబండలని పిలిచేవారని కూడ చెప్పాడు. నేను, చంద్రమౌళిగారు కలిసి దాదాపు 100 ఎకరాల్లో ఉన్న 30 నిలువురాళ్ళను ఒక్కో దాన్ని పలకరించాం. గతంలో ఇక్కడ 500 వరకూ ఉండేవనీ ఇళ్లకాలనీకి రోడ్డు, ప్లాట్లు వేసినపుడు తొలగించారని ఆరైతు చెప్పినపుడు నాకు చేతులు నరికేసినంత బాధేసింది. తెలుగు వారి తొలికాలపు సంతకాలు చెరిగిపోయాయనిపించింది. చారిత్రక ఆనవాళ్లను కూకటి వేళ్లతో పెకలించినట్లనిపించింది. నిట్టూర్పుటంకంటే ఏమీ చేయలేని మేం



ఒకరినొకరు చూచుకొని సముదాయించుకొన్నాం. కరుణానిధి, నేను కలిసి ఒక పది నిలువురాళ్ల కొలతలు తీసుకొన్నాం . ఒక్కొక్కటి భూమిమీద 9.0 అడుగుల ఎత్తు, రెండు నుంచి ఆరు అడుగుల వెడల్పు, ఆరంగుళాల నుంచి అడుగున్నర వరకూ మందం కలిగి ఉన్నాయి. ఒకే ఒక చోట పంటకాలువ తీయటాన ఒకటి రెండు నిలువురాళ్ల పునాదులు కూడా కనిపిస్తున్నాయి. భూమట్టం నుంచి 5.0 అడుగుల లోతులో

వాటిని పాతి ఉంచారు. ఒకచోట వీటిముందుగల ఐదారడుగుల గుంటలో నలుపు, నలుపు ఎరుపు కుండ పెంకులు కనిపించాయి. ఇనుపయుగంలో జనం ఒకచోట కుదురుగా ఉండటానికి గుడిసెలు వేసుకొని మరణించిన వారిని గుంట సమాధుల్లో పాతి, గుర్తుగా వాటి పక్కనే ఇలా నిలువు రాళ్లను పాతి పెట్టే ఆనవాయితీని ఇవి తెలియజేస్తున్నాయి. చిత్రమేమిటంటే, పాతిన నిలువురాళ్లలో, చాలావరకు శిలాజాలను పోలి ఉండటం, కొన్నైతే పెద్ద పెద్ద చెట్లు ఘనీభవించి కొయ్యరాళ్లలా మారిపోయాయా అన్నట్లున్నాయి. గతంలో ఇలాంటి నిలువురాళ్లవద్ద జరిపిన తవ్వకాల్లో బయల్పడిన పురావస్తువుల విశ్లేషణ ద్వారా క్రీ.పూ. 1500 – 1000 సం॥ల మధ్యకాలాల నాటి మానవులు ఇలాంటి సమాధులు, నిలువు రాళ్లను ఏర్పాటు చేసుకొన్నారని చెప్పవచ్చు. వెల్లటూరు – గొల్లపల్లి నిలువురాళ్లు కూడా క్రీ.పూ. 1000నాటి ఇనుపయుగపు ఆనవాళ్లేనని రుజువైంది. చుట్టుపక్కల ఉన్న ఆవూరి వాళ్లదగ్గరకెళ్ళి వీటి ప్రాచీనతను తెలిపి, పోయినవిపోగా ఉన్నవాటినైనా కాపాడుకోండి అనిచెప్పాం. 'కంకర కావలసిన వాళ్లు ఈ నిలువురాళ్లను, పడేసి కొట్టుకుపోతున్నారు. ఆపేవాళ్లే లేరని' వాళ్లు అక్కడి నుంచి వెళ్లిపోయారు. యుద్ధభూమిలో హోరాహోరీ పోరాడి నేలకొరిగిన వారు ఒరిగిపోగా, మిగిలి నిశ్చేష్టులై చూస్తున్న యోధుల్ని తలపిస్తున్నాయి– ఆ నిలువురాళ్లు.

సమయం ఉదయం 7.00 గంటలైంది. బయలుదేరి కనిగిరికి తిరిగొచ్చాం. కనిగిరిలోని చారిత్రక ఆనవాళ్లను వరుసగా చూపిస్తున్నాడు కరుణానిధి. కొండకింద గల ఆలయాలు, కోటగోడ, ద్వారాలను చూపించాడు. కాటమరాజు నిర్మించాడని చెప్పాడు. చారిత్రకాధారాల్ని పరిశీలిస్తే అద్దంకి రాజధానిగ పాలించిన ప్రోలయవేమారెడ్డి నిర్మించిన 84 దుర్గాల్లో కనిగిరి ఒకటని తరువాతి కాలంలో గజపతులు దీన్ని బలపరచి గిరిదుర్గంగా తీర్చిదిద్దారని, శ్రీకృష్ణదేవరాయలు ఈ కోటను స్వాధీనం చేసుకొన్నాడని చంద్రమౌళిగారు చెప్పింది సబబేననిపించింది.

కొండమీద కోటలో రెండు చెరువులు చెన్నమ్మక్కబావి అనే కోనేరు, అనేక శిథిలదేవాలయాలున్నాయి. కొండమీద కోటగోడను తిన్నగా లాగితే 25 కి.మీల పొడవున సాగుతుంది. ఈ కోటగోడలు, దర్వాజాలు, బురుజులు, గుళ్ళు, కట్టడాలను చూచి, మళ్లీ కాటమరాజే వచ్చి వీటిని బాగుచేయించుకుంటాడేమోనని సరిబుచ్చుకొన్నాం.

కోనేరు దగ్గర ఒక బండకు చెక్కిన ఒక 17వ శతాబ్ది ఆరుపంక్తుల శాసనంలో దాడింరెడ్డి కుమారుడు, దారియినేని రెడ్డి, రాబోయే ఒక ఆపద నుంచి తమను హనుమంతుడే రక్షించి కాపాడుతాడని ప్రార్థిస్తున్న వివరాలున్నాయి. ఉదయం గం॥9.30 ని. అవుతుంది. ఆకలి దంచుతుంది. కనిగిరిలో మంచి హోటల్‌కుపోయి టిఫిను చేద్దామనుకునేలోపు నా ఫోన్ మోగింది. ప్రముఖ కవి, కథకుడు, చిత్రకారుడు కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి గారిది. ఇక్కడే ఉన్నామని, టిఫిను చేసి కలుస్తామన్నా వినకుండా బలవంతపెట్టి వాళ్లింటి పక్కన ఒక కుటుంబం నడుపుతున్న వరంగల్ మట్టెవాడలాంటి పూటకూళ్లమ్మ గుర్తొచ్చేట్లున్న ఒక చావడి హోటల్‌కు తీసుకెళ్లారు. గరగరలాడే దోసె, దానిమీద సన్నగా చిన్నగా తరిగిన ఉల్లితొనలు, కారెట్టుముక్కలు, అల్లం, పచ్చిమిర్చి, కొత్తిమీర, మరేదో పొడిని, కొంచెం కారాన్ని చల్లి తిరగేసి పెణంమీంచి తీసిన అట్టుని తింటుంటే, రోజూ ఇక్కడే తింటే బాగుండనిపించింది. నంజుకొన్న కొద్దీ బలంపుంజుకునేట్టున్న వేరుశనగ చట్నీ, అల్లం పచ్చడి మానసోల్లాసాన్ని కలిగించాయి ఆతిథ్యంలో భాగంగా టిఫిన్‌ను అందించిన వెంకటేశ్వరరెడ్డి గారికి నమస్కరించాం. ఇంటికి తీసుకెళ్ళి ఆయన కవితాసంపుటి 'దుక్కిచూపు' నిచ్చి, తానువేసిన వర్ణచిత్రాలను చూపించాడు. వీడుకోలు తీసుకొని ఎక్కడికెళదామని కరుణానిధిని అడిగాం. పాలేటి గంగమ్మవాగు, వెంగళాపురం వెళదామనగా కారును అటు మళ్లించాం.


కనిగిరి నుంచి ఒక పావుగంట ప్రయాణించిన తరువాత ఒక నదిని దాటాం. చంద్రమౌళిగారు కలుగజేసుకొని, పక్కన కనిపిస్తున్న గ్రామం వెంగళాపురమని, ఇది పాలేటిగంగ(నది) అని చెప్పారు. పాలేటిగంగమ్మ దాటుతుండగా కాటమరాజుకథ మదిలో మెదిలింది. కాటమరాజు తన ఆలమందను 12 ఏళ్లపాటు శ్రీశైలంలో మేపింతర్వాత, శివుని ఆజ్ఞపై కాటమరాజు దక్షిణం వైపు వెళ్లగా–కరువువల్ల నీరు, గడ్డి దొరక్క ఇబ్బందులు ఎదుర్కొంటాడు. కాటమరాజు ఆలమంద చాలా పెద్దది. అతని పశుసంపదను గురించి కాటమరాజు కథలో "కుదురు ఆరామడ కదులు పన్నెండామడనే" సామెతకు కారణమైందని చెప్పబడింది. బలిజ వారి సలహా మేరకు నల్లసిద్ధిరాజ్యానికి మందను మళ్లిద్దామనుకొని పినతల్లి సిరిదేవికి చెప్పగా, వద్దని వారిస్తుంది. వినకుండా కాటమరాజు, తన వారితో కలిసి ఆలమందను పాలేటివాగు దగ్గరకు తోలుకొస్తాడు. గంగను దాటాలనుకుంటున్న కాటమరాజుతో గంగ తనను చేతులెత్తి మొక్కితేనే దాటనిస్తానంటుంది. ఇష్టపడని కాటమరాజు వాదోపవాదాల తరువాత, నమస్కరించగా, అంగీకరించిన గంగ, ఎండిపోయిన వాగులో నీటిని రప్పించింది. కాటమరాజు తన ఆలమందతో పాలేటిని దాటి నెల్లూరు సీమకు బయలుదేరి వెళ్ళిన సంఘటన గుర్తుకొచ్చింది. అలా నెమరు వేసుకుంటుండగా, వెంగళాపురంలోనున్న కాటమరాజు కథకు సంబంధమున్న అయితమరాజు విగ్రహం, పాలేటి గంగమ్మ అని పిలుస్తున్న మహిషాసురమర్దిని విగ్రహం దాని తరువాత అలవలపాడులోని వాగు ఒడ్డునున్న ఒక బండపై గల క్రీ.శ.1526 వ సం॥నాటి రాపూరి రాఘవరెడ్డి, తన తండ్రి బస్వరెడ్డి, తల్లి అమలాంబికకు పుణ్యంగా లింగాలకొండ సోమేశ్వరునికి, బంగాది గంగ (పాలేటిగంగ)కు కొండమరుసయ్యగారు ఇచ్చిన నాయంకరంలోని కనిగిరి, పోలచెర్ల, ముసుందూరి సీమలోని గంగపట్నాన్ని, షోడశోపచారాలకు ఇచ్చినట్లు పేర్కొంటున్న శాసనాక్షరాల్ని తడిమి చూచాం.

ఇంతలో, కరుణానిధి, మమ్మల్ని పంచలింగాల కొండవైపు మళ్లించాడు. పంచలింగాలకొండ కూడా కాటమరాజుకు

సంబంధమున్న ప్రదేశమే. అందుకు సాక్ష్యంగా అక్కడున్న మహిషాసురమర్ధిని విగ్రహం, శివలింగం, భూమిలోకి సగం పూడుకుపోయిన నందిని చూశాం. తరువాత, పునుగోడు వెళ్లి అల్లాడపల్లి



పెద్దిరెడ్డి, రాజశేఖరరెడ్డిగారి పొలంలో పడిఉన్న 10 అడుగుల పొడవుగల ఒక అప్రకటిత నల్ల శాసనపురాతి 17వ శతాబ్ది శాసనాన్ని చూచి, కేంద్ర పురావస్తు శాఖాధికారులకు సమాచారాన్నిచ్చాం. అదే గ్రామంలోని సిద్దేశ్వరస్వామి దేవాలయంలో నున్న 17వ శతాబ్దినాటి మలిపూడి ఓబుళయ్య వేయిలింగాలను ప్రతిష్ఠించి, గుడిగట్టించి, తంగమళ్ల



మాదశివులకు కొంత భూమిని కొనిపెట్టిన వివరాలున్న శాసనాన్ని చదివాను. ఇది **నెల్లూరు జిల్లా శాసన సంపుటి** 2లో కనిగిరి (36) శాసనంగా ప్రకటించబడింది. తరువాత మా ప్రయాణం గంగదొనకొండ. దాన్ని దొనకొండ అనేవాళ్లని, గ్రామంలోని ప్రాచీన గంగమ్మ గుడివల్ల ఆవూరికి గంగదొనకొండ అని పేరొచ్చిందంటారు. రోడ్డుకు ఎడమవైపుగల గంగమ్మ దేవాలయంలో ఏదో ఎత్తాటి నిలువురాయి కనిపించింది. కారాపి దిగి లోనికెళ్ళి చూశాను. అది 12 అడుగుల ఎత్తు, 2 అడుగుల వెడల్పు, 9 అంగుళాల మందంతో ఉన్న ఇనుపయుగపు ఆనవాలు. దీన్నిబట్టి అక్కడొక సమాధి ఉండేదని, ఈ ఆలయం నిర్మాణంలో భాగంగా గుండ్రంగా అమర్చిన బండరాళ్లను తొలగించి ఉంటారనిపించింది. బయటికొచ్చిన తరువాత ఎదురుగా ఉన్న శివాలయంలో కెళ్లాం. ఎన్నో శిల్పాలు, ఎన్నో శాసనాలు! మహిషాసురమర్ధిని, నాగదేవతలు, గణపతి, భైరవుడు, సూర్యుడు వరుసగా పాతి ఉన్నాయి. ఇంతలో నా దృష్టి ఒక పల్నాడు రాతి స్థంభంపై పడింది. చేత్తో తడిమి చూస్తే, అర్ధపద్మం కనిపించింది. రెండు వైపులా పలకలుగా చెక్కి ఉంది. ఖచ్చితంగా బౌద్ధస్థంభం అని గంగదొనకొండ, శాతవాహన కాలంలో ఒక బౌద్ధ స్థావరమనీ తేలింది. అక్కడే ఉన్న క్రీ.శ. 1406 నాటి దేవరాయలు, క్రీ.శ. 1430 నాటి రెండో దేవరాయలు, క్రీ.శ. 1477నాటి శాసనం, క్రీ.శ. 1525 నాటి శ్రీకృష్ణదేవరాయ శాసనాలను చూచి వాటిని భద్రంగా కాపాడమని ఆలయ



అధికారులను బతిమిలాడాను. తరువాత బ్రిటీషువాళ్లు 1942 లో ఇక్కడ 1365 ఎకరాల్లో నిర్మించిన విశాలమైన విమానాశ్రయం ఆనాటి రన్‌వే, 20 గదుల విశ్రాంతి మందిరం పక్కనే ఉన్న మిషనరీ -పాఠశాల ఆనాటి వాస్తు శైలికి, కట్టడ నైపుణ్యానికి అద్దంపడుతున్నాయి.

దాదాపు 2000సం॥ల నిరాటంక చరిత్ర గల, వేల ఎకరాల ప్రభుత్వ భూములున్న దొనకొండను రాష్ట్ర రాజధానిగా ప్రతిపాదించిన సంగతిని కూడ గుర్తుచేసుకున్నాను. ఇంకా చూడాల్సిన కల్లూరు, కురిచేడు, పొదిలి, కళ్లముందు ముసురుకున్నా, సమయం సాయంత్రం 6.00 గం.లు కావటాన, ఎక్కడో అలవైకుంఠపురానికి ఆమడ దూరంలో ఉన్న విజయవాడ చేరుకోవాలిగాబట్టి దొనకొండ రైల్వే స్టేషను దగ్గర చూరునీళ్లలాంటి ఉదారంగు టీని ముచ్చటైన చిట్టిగాజుగ్లాసులో కావాలని పోయించుకొని, తాగిన తరువాత, తిరుగు ప్రయాణమైనాము. కరుణానిధి వంక జాలిగా చూచి, అంతదూరం రాలేమని ఒంగోలు-కంభం అడ్డరోడ్డులో దింపి వెళ్లేముందు వెనక్కి తిరిగి చూస్తే కరుణానిధి కళ్లలో సుళ్లు తిరుగుతున్న నీళ్లు, అతని ఆప్యాయత, ఆదరణకు నికార్సయిన నిదర్శనాలనుకుంటూనే, బాధను భరిస్తూ ముందుకు సాగాం. ఈ ప్రాంత చరిత్ర శాసనాలపై చర్చోపచర్చలనడుమ మాకు తెలియకుండానే అద్దంకి రానే వచ్చింది. చంద్రమౌళి మాస్టారును దించి వెళదామంటే ఆయన మాకు సెంటర్లో పొట్టి శ్రీరాములుగారి విగ్రహం ఎదురుగా తన శిష్యుడు నడిపిస్తున్న ఆర్యవైశ్య భోజనశాలలో అన్నం తినిపించి మమ్మల్ని సాగనంపిన తీరు ఇంకా కళ్లముందు కదలాడుతూనే ఉంది. ఇలా కనిగిరి నుంచి దొనకొండ వరకూ ఇనుపయుగం నుంచి మధ్యయుగాల్లోని కాటమరాజు, విజయనగర రాజుల విక్రమ పరాక్రమాల్ని, శిల్పాలు, శాసనాల్ని తలచుకుంటూ ఆ శిధిలాలను పదిలం చేయలేమా అన్న నా ప్రశ్నకు సమాధానం వెతుక్కునేలోపు- ఇంటికి చేరుకొన్నాను. నిరాదరణకు గురై, నిర్లక్ష్యపు నీడలో చేరుతున్న శిల్పాలు, శాసనాల సంఖ్య పెరగడం పట్ల ఆందోళన పడుతున్న నాకు, తెలియకుండానే నిద్ర కమ్ముకొచ్చింది.

హోసూరు తావు
నవల

అగరం వసంత్
094883 30209



4

“**ఏంరా** కాకా! అబుడే కానుగకాయలు ఉదరిస్తా(రాలుస్తా) వుండావు” తాత మాట్లాడిచ్చె.

“ఈపొద్దుకి సరిగ్గా నెలపొద్దుకి ఓసూరు పరస(తిరునాళ్లు), కానుగ విత్తులు అమ్మి నాలుగు కాసులు వెనకేసుకొంటే పరస సెలవు(ఖర్చు)లకి తొందర వుండేలేదు కదనా” కాకన్న అనె.

“ఊర్లా వుండే అర్ధము చింతకాయలని కొట్టి చింతగింజలు కూడేసింది చాలదారా” తిరగా అనె తాత.

“నీకు వనగూడినట్ల (కలసివచ్చినట్ల) అందరికీ వనగూడాల కదనా, నాకు ఏడాదిలా ఈ నెలలా మాత్రమే నాలుగుకాసులు మిగిలేది. ఇంగ ఏడాదంతా కూలికి పోతే కూడు లేకుంటే బీడు అన్నెట్ల వుంటుంది” అంటా వుండాడు.

కాకన్న మాత్రమే కాదు మావూర్లా చానా జనాలు ఈ పట్టెంతా (ప్రదేశమంతా) పారాడి కానుగకాయలు ఉదరిచ్చి విత్తనాల్ని వ్యాపారగాళ్లకి అమ్మి సొమ్ము చేసుకొంటారు. అట్లే చింతగింజలు అమ్మి చీరలు, రవికలు తీసుకొనిన వాళ్ల చిత్రవిచిత్రాలు మీరు చూడొచ్చు.

మాపక్క ఈ పరసని ఒక పండగలా చేస్తారు. కొత్తబట్టలు పిండివంటలే కాదు నేలతల్లి కళాచారం తానుగా లేచి నాట్యము ఆడుతుంది. పెద్దోళ్లు, చిన్నోళ్లకి, సొంతమోళ్లకి కాసులిచ్చి పరసకి పంపి పరవశిస్తారు.

ఓసూరు పరసకి ముందే బాగలూరు తేరు జరుగుతుంది. మా చుట్టాలు రమ్మంటే నేనూ తాతా పోతిమి.

తేరు చానా ఎత్తరముగా వుంది. కొత్తబట్టలు పుసుపుకుంకుమ, రంగులజెండాలు, పువ్వులగమ్ములా మెరసిపోతా వుంది. తేరు కొనలా శికరము, మద్దిలా దేవుని విగ్రహము, అయివార్లూ వయసుసిన్నోళ్లూ ఎక్కి నిలిచిండారు. పూజ అయినంక తేరు కదిలె. “గోవిందా.. గోవిందా” అంటా జనాలు తేరుని ఈడ్చిరి.తేరు కదిలె. జనం కదలతా తేరుని కదిలిస్తా పోతావుండారు.

“దోవలా బండి, బండి వెనక బండి కదలి పోతావుండాయి. పట్టాలపైన రైలు కదలి పోతా వుంది. గాలిలా ప్లేను బెరోని (జోరుగా) కదలి కడలిని దాటి పోతా వుంది. ఇవన్నీ కదలతా పోతా వుండాయి. వీటిని మనిషి కదలిస్తా, కదలి పోతా వుండాడు. ఇది మనిషి కత. బూమమ్మ కదలి పోతావుంది. సెంద్రుడు కదలతా వుండాడు. పొద్దప్పుడు(సూర్యుడు) కూడా కదిలే పనిలా పడి కాలాన్ని మరిసినట్లుండాడు. ఎపుడు చూసినా కదలాడతా, కదలి పోతా కనిపిస్తాడు. గ్రహాలు, నక్షత్రాలు కదలిపోతా వుండాయి ఇది విశ్వం కత. ఎవరు కదలిస్తా వుండారో. ఏది కదిలిస్తా వుందో” అంటా ఆర్మోనియం వాయిస్తా గుడి మెట్ల పైన కూకోనుండాడు జడల గుర్రన్న.

జనం తేరుచుట్టూ చేరిండారు. గుడి ముందర బిచ్చగాళ్లూ కూకోనుండారు. “అమ్మా ఆకలి” అంటావున్నా వినబడనోళ్ల మాదిరిగా గుడిలోపలికి పోయి ఉండిగలా (హుండి) దుడ్లు వేసి వస్తావుండారు జనం.

‘‘కాయువే కైలాసము.. సాయువే సొర్గము..’’ గుడి శికరముపైనింకా తెల్లపావురం అంటా వుంది. దాని మాటలు ఎవరూ వింటా లేదు.


“రేయ్! మీకేరా చెప్పేది, చచ్చినపుడు పరమాన్నము చేసి మాకు పెట్టేది కాదురా, బతికినవాని కడుపుకు అంత కూడు పెట్టండ్రా, ఏమి జాతిరా మీ మనిషిజాతి” కాకమ్మ కసరుకొంటా వుంది.

తేరు దోవంతా తిరిగి ఇంక రవంత పొద్దుకి గుడితావుకి చేరుతుంది అని అంతా అనుకొంటా వున్నట్లే ఒగ పక్క చక్రం విరిగింది. చానా జనము చానా గాసిపడి తేరుచక్రము తిరిగి తిరిగే మాదిరిగా చేసిరి. మెల్లగా ఈడ్చి గుడితావ నిలిపిరి. మునిమాపు పొద్దు ఆవూరి పెద్దలంతా గుడిముందర చేరిరి.

“మా తాతల కాలములా చేసిన చక్రాలు అవి. ఎండకి ఎండి వానకి నాని పాడైపోయె. రవంత ఏమారింటే తేరు పడిపోయివుణ్ణు. వచ్చే ఏడాదికి కొత్త చక్రాలు, అచ్చులు తయారు చేసుకోవాల” పెద్దాయన అంటా వుండాడు.

“చానా పాతమాన్లు కావాల, ఏడ చిక్కుతాయి. ఏఏ మాను కావాలనేది అట్లే చెప్పండ” ఎవరో అనిరి.

“చక్రాలకి జాలిమాను, అచ్చులకి నల్ల అత్తిమాను, గుజ్జులకి టెంకాయమాను కావాల, ఇవ్వన్నీ ఏటిగడ్డలానే చిక్కుతాయి” అదెవరో



చెప్పిరి.

అందరూ చేరి వచ్చే ఏడాదికి కొత్తతేరు తయారు చేయాలని ముదువుకి వచ్చిరి.

బాగలూరు తేరుమాదిరిగానే మా తావుల్లా చానా తేర్లు కిందనింకా మిందగంటా పూర్తిగా మానుల్లా తయారు చేసిండే తేర్లు. కానీ మా ఓసూరు తేరు అట్ల కాదు. రాయిచక్రాలు, ఇనుము అచ్చులా సుమారుగా 20 అడుగుల పొడవు రాయిలానే తేరును చెక్కిండారు. దీనిపైన ఏడాది ఏడాది మానుతేరును కడతారు. ఈడ్నేకి ఇనుము సర్పిణిలు(గొలుసులు) అబుడే చేసి పెట్టిండారు. ఏకాలములో చేసిరో కానీ ఈ కాలానికీ చెక్కుచెదరకుండా ఉండాయి.

"యక్షగానం సురువు అవుతా వుంది. మీరింగా ఈడే వుంటే ఎట్ల" పూజారన్న అంటానే గుడి ముందర వున్నోళ్లంతా లేచిరి.

పాటలు, పద్యాలు, మాటలతో అపుటికే ప్రహ్లాదవిజయము జరగతా వుంది.

మునీశ్వరుని గుడితావ రోకలి ఆట ఆడతా వుండారని తెలిసి ఆడికి మాతాత కూడా పోతిని.

సుమారుగా ఆరు అడుగుల పొడవు వుండే రోకలిని తలపైన పెట్టుకొని కాళ్లకి గజ్జెలు కట్టుకొని ఎగరతా, దుమకతా గిరగిరా తిరగతా ఆట ఆడతా వుంటే చూసేకి బలేగా వుంది. రోకలి కింద పడకుండా బలే న్యాకు(జాగ్రత)గా ఆయప్ప ఆడేఆటకి ఆటతనానికి ఏమిచ్చినా తక్కువే. మునీశ్వరుని గుడితావ హరికత,బేటరాయ సామి గుడితావ బుర్రకత, ఎల్లమ్మ గుడితావ శనిమహాత్మ్యని కంసాళి కతలు, శివుని గుడితావ వీరకాసి, పండరిబజన, వినాయకుని గుడితావ ఎద్దలాట, నెమలాట, మురుగుని గుడితావ కావడి చిందులు,మారెమ్మ గుడితావ భారతం కతలు.

ఆటల్ని చూస్తా, పాటల్ని, కతల్ని వింటా అన్నదానాల సత్రాలలా అన్నం తింటా ఆపొద్దు గడిపితిమి.

×××

ఓసూరు పరసకి ముందే పల్లకీలు, గెరిగె (గరగ). నేను అమ్మ కూడా గెరిగె జరిగే తావుకి పోతిని.

కంచుపాత్రపైన ద్రౌపదీదేవిని పెట్టి చుట్టూ మూడు అడుగుల పొడవు వరకు మల్లెపూలు అలంకారము చేసుకొని తలపైన పెట్టుకొని తెల్లబట్టలు, కాళ్లకి గజ్జెలు కట్టుకొని వుండాడు. ఇట్ల గెరిగె ఎత్తేవాళ్లు చానాళ్లనింకా నియమనిష్టగా వుంటేనే గెరిగె ఎత్తేకి అయ్యేదంట.

గెరిగెను తలమింద పెట్టుకొని ఆడతా వస్తావుంటే గెరిగె కిందపడిపోతే ఆయప్ప తల నరికేకి కత్తులు ఎత్తుకొని చుట్టా కుణసలాడతా వరస వస్తా వుండారు వయసుచిన్నోళ్లు. గెరిగె అయ్యేకంట చూసి ఆమీట తినేకి (చిరుదిళ్లు) తిని ఇంటికి వస్తిని.

వచ్చే వారమే ఓసూరు పరస. ఇంటికి చుట్టాలు వస్తారు, ఇంటికి కావలసిన సరుకులు తీసుకొనేకి నేనూ అబ్బా అమ్మా బండిలా సంతకి పోతిమి.

సంతకి ఒగపక్కగా రకరకాల రాగులు, వడ్లు, నూగులు, జొన్నలు, కొర్రలు, ఉలవలు, సజ్జలు, అనప, కంది, చెనిగ బ్యాళ్లు, సెనగ పప్పు, సెనక్కాయలు, బెల్లము అచ్చులు, చింతపండు మూటలు

సోలువు సోలువుగా వరస పెట్టిండారు.

సంతంతా గుమ్మడికాయలు, సొరకాయలు, పళ్లకాయలు, బీరకాయులు, కాకరకాయులు, చిక్కుడుకాయులు, గోరుచిక్కుడుకాయలు, కారామణి, పీంచకాయలు (బీన్స్), డబుల్ బీన్సు, క్యారేటు, బీటురూటు, వుర్లగడ్డలు, నవకోలు, ముల్లంగి గడ్డలు, మునగకాయలు మెరస్తా వుండాయి. నల్ల, తెల్ల, గుండు, పొడవు, సగ్రము వంకాయలు. బజ్జి, బోండా, బుడ్డ, మూన్నెల్ల, ఆర్నెల్ల మిరపకాయలు. కోసు, పువ్వుకోసు, పచ్చి బటాణి, తమాటాలు, బెండకాయలు, తొండకాయలు రాసులు రాసులు పోసిండారు.

సొంటి, అల్లము, గెణసగడ్డలు, ఏళికాయలు, వెలక్కాయలు, నిమ్మకాయలు, ఉడ్డలు ఉడ్డలు పోసిండారు.

దంటుకూరాకు, సొక్కెతాకు, సబ్బచ్చాకు, పాలాకు, మెంతము కూరాకు, సిలికిలాకు, పణగంటాకు, గురగాగు, కన్యాకు, కాశాకు, మునగాకు, పుదినా, కొత్తమీరి, కరివేపాకు కట్టలకు కొదవలేదు.

ఆ పక్కలానే జొన్నెన్నులు, చేపుకాయలు (జామ), సేవుకాయలు (ఆపిల్), దాలందరి (దానిమ్మ), పనస, పరంగి, మామిడి, తెల్ల, నల్ల ద్రాక్ష, సపోట, తిత్తిలికాయలు (ఆరెంజ్), బేరికాయలు, కలంగరి (పుచ్చకాయ) కాయలు, సోలువు సోలువులుగా పేర్చి పెట్టిండారు.

“అడవిమల్లి, సూదిమల్లి, గుండుమల్లి, జాజిమల్లి, మూడుచుట్ల మల్లి, ఏడుచుట్ల మల్లి, ఏ మల్లి కావాలన్నా ఒగేరేటు” కూస్తా వుండాడు పువ్వులన్న.

“కనకబరాలు, రోజాపూలు, రుద్రాక్షపూలు, దాసాళం పూలు, గులాబి, చామంతి, చెలుమల్లి, బేరీపూలు, సంపంగి, సుగందర రాజులు, పన్నీరాకు, మంచితొలసి, అన్నీ వుండాయి” అంటా కాసులు బాగా కమాయిస్తా (సంపాదిస్తా) వుంది పూలమ్మి.

నూగులనూనె, సెనగనూనె, ఆముదము, వేపనూనె, కానుగనూనె డబ్బాలకు కొదవలేదు.

సంతకి రవంత దూరంలా ఎండిడే చేపలు, రవ్విలు, నాటుకోడిగుడ్లు, పారం కోడిగుడ్లు, నాటుకోళ్లు, గొర్రెలు, మేకల వ్యాపారాలు జోరుగా సాగతావుండాయి.

బోండాలు, వడలు, పుట్లు, బజ్జీల గమ్ములు ముక్కులాకి ఎక్కి ఎబుడెబుడు తిందామా అనే ఎన్నాన్ని (మనసు) పుట్టుబడి చేస్తా వుండాయి.

ఎలనీరు (కొబ్బరిబొండాం), తాటినుంగులు జనాల దప్పి తీరస్తా వుంటే, ఇంకొందరు జనాలు దోసకాయకి కారము పూసుకొని తిని మింగి మైమరస్తా వుండారు.

నేనూ వూరికే వుంటానా, కావలసింది తిని, కడగా మజ్జిగ తాగి మామిడికాయ ఊరగాయ నంజుకుంటిని.

“సింతలేని సితరంగి సంతకి ఒగ బిడ్డని కన్నెంట. అట్లా ముండ అది. దాని మాటల్ని నువ్వు కట్టుకొంటావా? (వింటావా), ఏల ఏడస్తావు కలకుండుమా” పేదరాలు పెద్దమ్మ చిన్నమ్మని సుదారిస్తా వుంది.

“దాని పుట్టు చూస్తే పురొస్తుంది, వాకిలి చూస్తే వాంతికి వస్తుంది. దానికి నీ సుద్ది ఏమిటికంటా” వేమిరెడ్డి మల్లమ్మ రేగతా వుంది.

“అంతా నా కర్మక్కా, కంతకి తగిన బొంతలా నా మొగుడు ముద్దలు మింగి (తిని) పనుకొంటాడే కాని నా గురించి ఒగ మాటా మాట్లాడేలే” అంటా మీనమ్మ .

“ఎదురుయజ్యానికి వెనగుండాలా. బంతిబోజనానికి ముందుండాల, అనేది పెద్దోళ్ల మాట. కొన్నాళ్లు సరుసుకొనిపోమ్మా, నీకూ మంచికాలము వస్తుంది” దైర్యము చెప్పతా దేవమ్మ.

“ఈకిత కర్చులు పోయి మిగిలింది పదివేలే. కొడుకుని కాలేజికి చేర్చాల, ఏమి చేసేదో ఏమో” వెత పడతా వ్యవసాయి (రైతు).

“ఈపొద్దే కాసులు కట్టిదాల, లేదంటే సీటు చిక్కేలేదు” డాక్టరు కోర్సుకు కొడుకుని చేర్చతా వ్యాపారి.

రైతు వెతలే కాదు వ్యాపారి కిక్కు కతలూ ఈడ చానా కనిపిస్తాయి, వినిపిస్తాయి.

“అబ్బా పరంగిపండు(బొప్పాయి) మాదిరిగా వుందిరా” పడుచును చూస్తా పిల్లగాడు అనె.

“పండు పైన పొట్టు వుంటుందిరా చూసి నడు, గొంతులా తగులుకొంటే చానా గాసిపడాలా” మంచిమాట చెప్పతా మల్లన్న.

“దేశము తిరిగిన గువ్వ గూటికి రాకుండా పోతుందా, నువ్వు పదరా” అదేమి యవ్వారము నడిచెనో మొకము ఎర్రగా అయిండే సత్తిగాని బుజంమింద చెయ్యేసి పిట్టన్న పోతావుండాడు.

ఈసంత మాసంత సరుకుల సంతే కాదు. సంసారాలని నిలబెట్టే సంత. చింతల్ని తుడిపి మనషుల్ని మంచిగా మార్చి. తన గుండెల్లో పెట్టుకొని గూడుకట్టుకొనే సంత. సంత సమాచారము తెలుసుకొంటా నేను. సరకుల బేరములా అబ్బా అమ్మ.

పొద్దయిపోతా వుంది. పొద్దప్పని చూస్తా జనం సంతను విడచి చిన్న చిన్న దోవలుగా మారి మబ్బు ముసురుకొంటా వుందనంగా ఇండ్లు చేరిరి.

×××

ఓసూరు పక్కలాని వూర్లువూర్లంతా కొత్తబట్టల్లా కళకళలాడతా పిండివంటల్లా గుమగుమలాడతా వుండాయి. పరసని చూసేకి పయనమవ్వతా వుండాయి.

అమ్మా, అబ్బ, అవ్వాతాత, మామ, అత్త, మామకూతురు మల్లి, మా అమ్మ అంతా చేరి పరస దోవలా పోతావుండారు.

పొద్దప్పని కష్టంలా మేఘాలు పాలుపంచుకొని చల్లనిగాలిని నేలపై గుమ్మరిస్తా ఆడాడ నీడని పరస్తా వుండాయి.

“రామరామ ముకుంద మాధవ రామ సద్గురు కేశవా
రామ దశరథ తనయదేవా - రామశ్రీ నారేయణ ॥రామా॥
కంటకులు హరిని చూపమందురు - కాయమందే చూడరూ
ఆత్మమర్మము తెలియనేరరు - అమర శ్రీ నారేయణ”

తాతగారి ఆశ్రమము నింకా బజన పాట వినబడతా వుంది. పాట వినుకొంటా ముందరికి నడిస్తిమి.

దోవ పక్కలా చింతమాను నీడలా ఆడాయమ్మ డోలుని మెడకి తగలేసుకొని వాయిస్తా వుంటే మగోడు ఉరుమారెమ్మని తలమీద పెట్టుకొని ఆడతా నారపగ్గము (కొరడా)తో కొట్టుకొంటా వుండాడు. అది చూసినవాళ్లంతా వాళ్లకి తోచిన కాసుల్ని ఆడవేసి పోతావుండారు.

ఆ పక్కలానే కొందరు కట్టిసాము చేస్తా కనిపిచ్చిరి. వాళ్ల కట్టెని బలే న్యాక్‌గా జోరుగా తిప్పతా వుండారు. “ఇందప్పా” అంటా రాయిని

తీసి వాళ్ల పక్కకి విసరెే తాత. అదే గడియలా అది కిందపడే మాదిరిగా చేసిరి వాళ్లు. నా కండ్లని నేనే నమ్మలే. అంత బాగా కట్టెసాము చేస్తా వుండారు. ''మంచి కళాకారులు'' అంటా తాత వాళ్లకి పదిరూపాయలు ఇచ్చె. ఆడనింకా కదిలితిమి.

నెమలి, గుఱ్ఱము, ఎద్దు వేషాలు వేసుకొని కుణుసులాడతా కీలుగుఱ్ఱాల వాళ్లు ఎదురు వచ్చిరి. వాళ్లని చూస్తానే వీళ్లమాదిరిగా నేనూ చేయాలనే బెమ (కోరిక) నాలా పుట్టె.

రచ్చతావ మానునీడలా చిన్న చిన్నోళ్లు కిష్ణలీలలు ఆడతా వుంటే చానా కండ్లు చూస్తావుండాయి. ఆంజనేయ గుడితావ కొయ్యి బొమ్మలాట. రామయ్య గుడితావ కోలాట ఆడతా వుండారు. కాలిగజ్జి గల్లుగల్లు అంటా వుంటే ఒక చేతిలా పిల్లనగోవి, ఇంగో చేతిలా బుడిబుడికి (డమరుకం) అల్లాడిస్తా ఆట ఆడతా వుండే గొరవయ్య.

సిడిరన్న (జీనుగారులు) ఎత్తుకొని కుణుసులాడతా వుండే చిన్నోళ్ల సంబరాన్ని చూస్తా ముందరికి పోతిమి.

అప్పటికే తేరుతావ జనం నిండిపోయి వుండారు. తేరుకు పూజచేసి మాకంతా బొట్టు పెటింది అమ్మ.

అంటిపండు (అరటిపండు)ని తేరుపైకి జనాలంతా విసరతా వుండారు. నేనూ విసరితిని.

రవంత సేపయినంకా తేరు కదిలె. మేము తేరుదోవలా కదలి పోతావుండాము.

ఆపక్క తోలుబొమ్మల ఆట చూసేకి జనం తోసులాడతా పోతా వుంటే... డికంబరి ఆట చూసి నాకు దిగులాయె. ఆయప్ప ఒళ్లంతా బండారు (కుంకుమ) పూసుకొని వీపుకు కత్తులు కట్టుకొని కాలికి ఇనుము సర్పిణిలా (చైన్) గుండు కట్టుకొని ఆడే ఆటను చూస్తే ఎవరికైనా దిగులవుతుంది. ఆ ఆటగాడు ఎంత ధైర్యవంతుడబ్బా అని నాలా నేను అనుకొంటిని.

ఏకనాదం వాయిస్తా అగ్గరారం నారాయణన్న. తంబూర వాయిస్తా తిమ్మసంద్రం గోపన్న. కంచుతట్టని కొడతా కగ్గదాసం సాకన్న. మనిషి కడుపుపైన పొడవుగా వుండే కట్టెని పెట్టి దానిపైన ఎక్కి తమ ఆటతనం చూపే దొమ్మరయ్యలు. నగనగతా నయాండీ ఆటలు. పచ్చకొళము తావ పులివేషగాళ్ల చిందులు.

కొలువు, డోలు వాయిద్యాల పసందైన పాటలు విందులు. అజ్జ అజ్జకి (అడుగు అడుగుకు) అన్నసత్రాలు, పానకం బండ్లు నేలతల్లి బిడ్డల తరతరాల కళాచారం. నరనరాన జీర్ణించుకొన్న తెలుగుదనం. పరసపొద్దుని పసందుగ చేసి పల్లెపల్లెకి పయనమయ్యె.

(తరువాయి వచ్చే సంచికలో...)

స్పందన

కొయ్యబొమ్మలాట కళాకారుడు గొంబెగౌడర రామనగౌడ

బామ్మారెడ్డి రామారెడ్డిగారి(గొంబెగౌడర రామనగౌడ) కత అమ్మనుడిలో మొదలుకావడం బాగుంది. ఒక ఎన్నువ(కళ)ను నమ్ముకొని బతుకుతున్న కొందరు తెలుగువారి గురించి కన్నడంలో మంచి పొత్తాలు వెలువడుతున్నాయి. వాటిని తెలుగులోకి మార్చి రామచంద్రరావుగారు, అచ్చులోకి తెచ్చి 'అమ్మనుడి' మంచిపనిని చేస్తున్నారు. అయితే తెలుగుచేత మీద నాదొక తెగడ్త(విమర్శ) ఉంది. రామచంద్రరావుగారు కొన్నిచోట్ల కన్నడనుడుగు(వాక్యా)లను అట్లాగే తెలుగు చేస్తున్నారు. తెలుగు కన్నడాలు ఎంత తోబుట్టునుడులైనా, వాటి నడుమ కూడా ఎంతో కొంత వేరిమి ఉంటుంది. నుడుగును కట్టడంలోనే కాదు, సంసుక్రుతపు మాటలను వాడడంలో కూడా ఆ వేరిమి తేటతెల్లంగా ఉంటుంది. నెలవిక(మాండలికం)లో రాసేటపుడు మనం ఎట్ల రాసినా చెల్లుతుంది. అలవిక(ప్రామాణికం)లో అంటే ఆకిక(పత్రిక)నుడిలో రాస్తున్నపుడు మెలకువగా రాయాలి. కన్నడ నుడుగును తెలుగులోకి తెచ్చేటపుడు, ఆ నుడుగుకున్న కన్నడదనాన్ని వదిలించి, దానిని తెలుగుదనంతో నింపాలి. అది రావుగారి తెలుగుచేతలో అక్కడక్కడా కొరవడింది. మచ్చుకు ఈ కింది నుడుగులను చూడండి.

●ఇట్లా ఉంది ❖ఇట్లా ఉండాలి

- ● 1947 మార్చి 1న నేను పుట్టినరోజు. ❖ 1947 మార్చి ఒకటి, నేను పుట్టినరోజు(లేదా) 1974 మార్చి ఒకటిన నేను పుట్టాను.
- ● ఇంటిపేరు జీవనగౌడ అని. ❖ ఇంటిపేరు జీవనగౌడ
- ● మా తల్లితండ్రులకు పెళ్లయి పన్నెండేళ్లు గడిచినా పిల్లలు కాలేదంట.
  ❖ మా తల్లితండ్రులకు పెళ్లయి పన్నెండేళ్లు గడిచినా పిల్లలు కలుగలేదంట
- ● నేను, మా అన్న, తమ్ముడు, చెల్లెలు ఎవరూ పుట్టలేదు. ❖ ....ఏవరమూ పుట్టలేదు
- ● గొడ్రాలు అనే సూటిపోటి మాటల నుండి విముక్తి పొందవలసిందేనన్నది అమ్మ గొప్పకోరికట.
  ❖ గొడ్రాలు అనే సూటిపోటు మాటలను అనిపించుకోకూడదని అమ్మ ఎంతో ఆరాటపడేదట.
- ● ఈరోజు ఇదే బొమ్మలాట వల్లనే కీర్తిమంతుడినీ, అవమానికుడినీ అవుతున్నానని కుమిలిపోయేవారట.
  ❖ ఈనాటికి ఈ బొమ్మలాట వల్ల కీర్తితోపాటు, అవమానం కూడా కలుగుతోందే అని కుమిలిపోయేవారట.
- ● కీర్తి తెచ్చిన బొమ్మల వల్లనే అవమానం నుండి విముక్తి పొందాలని అనుకుని..
  ❖ కీర్తిని తెచ్చిపెట్టిన బొమ్మలతోనే అవమానాలనూ తొలగించుకోవాలని అనుకుని...
- ● ఆ ఏడుపే నేను సుసంస్కృతంగా పెరగటానికి కారణమైందేమో..... ❖ ఆ ఏడుపే నేను సంస్కారవంతంగా పెరగటానికి కారణమైందేమో

ఒక్క పొరట(పేజి)లోని నుడుగులే ఇవన్నీ. మొత్తంమీద ఇంకాకొన్ని ఉండుంటాయి. కన్నడం నుండి తెలుగుచేయడంలో ఒడుపు తెలిసినవారు రావుగారు. వడివడిగా ఎక్కువగా చేయాలనే తొందరలో ఇట్ల జరుగుతున్నదేమో! ఓరిమితో ఒకటికి నాలుగుసార్లు చూసుకొంటే ఇంకా బాగా వస్తుంది రావుగారి తెలుగుచేత.

–స.వెం.రమేశ్

కన్నడ మూలం: డా. చంద్రప్ప సొబటి; తెలుగుసేత: రంగనాథ రామచంద్రరావు
90597 79289



కొయ్యబొమ్మలాట కళాకారుడు గొంబెగౌడర రామనగౌడ ఆత్మకథ

2

కళాబండి మొదటి ప్రయాణం

నాకు అప్పుడు పదమూడేళ్ళు.

ఆట ఆడటానికి నాన్న తన మేళంతోపాటు తీసుకుని పోతానని చెప్పారు.

అప్పుడు నాకు పట్టరాని సంతోషం కలిగింది.

ఆ నాటి రోజుల్లో మేము మా ఊరు వదిలి మరో ఊరికి వెళ్ళడమంటే అంత సులభం కాదు.

అదీ ఆటాడటానికి మరో ఊరికి వెళ్లడమంటే సామాన్య విషయం కాదు.

అందువల్లనే చాలా సంతోషం కలిగింది.

అయితే ఆ రోజు కళాకారుడిలా వారితో వెళ్ళలేదు.

అందుకు బదులుగా ఎద్దుల బండిని బాడుగకు తోలేవాడిగా వెళ్ళాను. అంటే నాన్న మేళం బొమ్మలాటకు వాడుతున్న బొమ్మలను, వాయిద్యాలను, ఆట ప్రదర్శనకు వేదికను నిర్మించటానికి కావలసిన సామానులను వేసుకుని, అలాగే కళాకారులను ఎద్దులబండిలో ఎక్కించుకుని తోలేవాడిని. అదీ బాడుగకు!ఇదొక విచిత్రమైన విషయంగా అనిపించవచ్చుకదా !

వంశపారంపర్యంగా వచ్చిన కళ !

నాన్ననే మేళం నాయకుడు.

అలాంటి నాయకుడి కొడుకు బండి తోలుతూ సంపాదించడం నిజం.

సుమారు నాలుగైదు సంవత్సరాలు ఈ పని చేశాను.

ఆ అనుభవం ఉపయోగపడింది. కేవలం బాడుగదారుడిగా ఈ పని చేయలేదు.

ఆ సమయంలో బొమ్మలను ఎలా ఆడించాలో నేర్చుకున్నాను. ఆట ప్రదర్శనలో అప్పుడప్పుడు చిన్న ప్రమాణంలో భాగం వహించేవాడిని. అయితే మేళం వారికి నేనొక బాడుగకు బండి తోలేవాడిని మాత్రమే.

అందువల్ల బండి బాడుగ సొమ్ము తప్ప మరే సంభావన ఇచ్చేవాళ్ళు కాదు.

మొదట్లో బండి బాడుగ అని రోజుకు అయిదు రూపాయలు ఇచ్చేవారు. కొన్ని నెలలు గడిచిన తరువాత, ఆ బాడుగ ఒక ఊరిలో ప్రదర్శించే ఒక ఆటకు పది రూపాయలుగా మారింది. ఈ మార్పు ఒకే ఊళ్ళో, అది ఒకే 'అట్ట'లో ('అట్ట' అంటే వేదిక) రెండు ఆటలు లేదా ఒకే ఊళ్ళో రెండు 'అట్ట'ల్లో రోజుకు రెండు ఆటలు ప్రదర్శించేవారు. అంతేకాకుండా ఒక్కో రోజు రెండు ఊళ్ళల్లోనూ ఒక్కో ఆట ప్రదర్శించేవారు. ఒక ఊళ్ళో సాయంకాలం సుమారు ఆరు నుంచి ఎనిమిదిన్నర– తొమ్మిది వరకు ఆట ఆడితే, మరో ఊళ్ళో సుమారు రాత్రి తొమ్మిదిన్నర–పది నుంచి ఉదయం అయిదున్నర–ఆరు గంటల వరకు ఆట సాగుతూ ఉండేది. అలాంటి సందర్భంలో నాకు చాలా అలసట కలిగేది. కళాకారులు భోజనం చేసి, సిద్ధమయ్యేలోపు బండిలో ఉన్న సామానులను ఆట జరిగే స్థలంలో చేర్చాలి. ఆట జరిగే వేదిక– బండి నిలబడ్డ స్థలానికి సమీపంలో ఉన్నా తొందరగా మోసుకొచ్చి, వేదిక నిర్మాణానికి సిద్ధం చేయాలి. లేకపోతే నాన్న చెడామడా తిట్టేవారు. ఎన్నోసార్లు నాన్న మేళంవారి ముందు, ఊరి జనం ముందు తిట్టేవారు. ఊరికే తిట్టడం ఆయన అభిప్రాయంకాదు. ఆట సమయంలో చూపే సోమరితనాన్ని ఆయన ఎన్నడూ సహించేవారు కాదు. అలా తిట్టించుకుంటూ ఆట ప్రదర్శనకు అన్నీ సిద్ధం చేస్తుండేవాడిని. అలాంటి రోజున నాకూ, ఎద్దులకూ అలసట కలిగేది.

ఇది అర్థం చేసుకున్న మేళంవారు ఆటకు పదిరూపాయలు ఇవ్వాలని నిర్ణయం చేశారు.

ఇక్కడ ఒక మాట చెప్పాలి. మేళంవారు ఆటకు పదిరూపాయలు ఇవ్వాలని నిర్ణయం చేసినపుడు, నాన్న వ్యతిరేకించారు. రోజుకు అయిదు రూపాయలు చాలని మొండిగా పట్టుబట్టారు. ఒకటి రెండు రోజులు మేళంవారికి, నాన్నకు మధ్యన చిన్నవాదన జరిగింది.


నాన్న మొదట తన నిర్ణయాన్ని మార్చుకోలేదు.

ఒక ఊరి నుంచి మరో ఊరికి వెళుతున్నప్పుడు ఆట ప్రదర్శనకు తీసుకునే డబ్బు, ఆటలో వచ్చే ముయ్యి, మొదలైన ఖర్చుల ఆధారంగా బండిలో లెక్కాచారం జరిగేది. అప్పుడు నా బండిబాడుగ విషయమూ వచ్చేది.

ఆ సంర్భంలోనూ నాన్న రోజుకు అయిదురూపాయలు చాలనే వాదననే కొనసాగించారు.

బండి తోలుతూనే ఈ వాదప్రతివాదాలను వింటున్న నేను అయోమయంలో పడ్డాను.

మనసుల్లోనే కోపగించుకోసాగాను. ఎందుకంటే ఆ విషయం గురించి నాన్నతోకానీ, మేళంవారితోకానీ సూటిగా నేనేమీ చెప్పలేను. నాన్న తీసుకున్న నిర్ణయానికి ఎదురుజవాబు ఇవ్వాలంటే భయం. మాటకు మాట, వాదానికి వాదం చేసేవారిని, అందులోనూ పెద్దవారి ముందు మాట్లాడటం ఆయన భరించేవారు కాదు.ఆ సమయంలో



సాయంత్రం ఆట మొదలైన తరువాత నా ఎద్దుల బండిలో ఒక్కడినే కూర్చుని వెక్కివెక్కి ఏడ్చాను.

మూడు రోజుల తరువాత రాణిబెన్నూరు శ్రీ రుద్రప్ప హిత్తలమనిగారి ఒత్తిడి వల్ల ఒప్పుకున్నప్పటికీ ఒక పని నియమాన్ని జారీకి తెచ్చారు. అంటే 'మేళంవారు ఆట ప్రదర్శనకు పల్లెకు వచ్చినపుడు వాళ్ళల్లో ఎవరికైనా ఆరోగ్యం పాడవుతే, లేదా అనివార్య కారణాల వల్ల ప్రదర్శనకు రాకపోతే వాళ్ళు చేస్తున్న పనినీ, ప్రదర్శనకు పూరకమైన మరొక పనినీ రామ (నేను) చేయాలి. ఆ పని చేయడానికి సాధ్యం కాని సందర్భంలో అలాంటి పని చేసేవారికి సహాయం చేయాలి. అయితే ఆ సహాయానికి ఎలాంటి సంభావన ఉండదు" అని షరతు పెట్టారు.

ఈ షరతును మేళం వారు ఇష్టంలేని మనసుతో అంగీకరించారు.

అలాంటి ఆత్మాభిమానం నాన్నది. అయినా నాన్న ఒప్పుకున్నందుకు సంతోషం కలిగింది.

అయితే మూడునాలుగు రోజుల నాన్న చేసిన వాదన వల్ల మనస్సులోని కలవరం సుమారు ఆరేడు నెలల వరకు తగ్గలేదు.

బాడుగ చర్చ జరిగి ఆరేడు నెలలు గడిచివుండాలి.

అప్పుడు ఆట నుంచి వచ్చిన డబ్బు పంపకం గురించి మేళంలో ఒక చిన్న గొడవ జరిగింది.

ఆ రోజు అసుండి గ్రామం షెహనాయి వాయించే వ్యక్తి మా మేళం వదిలిపెట్టి వెళ్ళిపోయాడు. అతను ఉత్తమ కళాకారుడు. అతను మేళం నుంచి బయటికి వెళ్ళడం మేళంలో ఉన్నవారెవరికీ ఇష్టం లేదు. నాన్నకైతే ఏ మాత్రం ఇష్టం లేదు. ఎందుకంటే మేళంలో ఉన్నవారందరూ నాన్న వయసువారే. ఆ గుంపులో అత్యంత పిన్న వయస్కుడిని నేను మాత్రమే. వారి అనుభవంలో సగం కూడా నా వయసు లేదు. అందువల్ల పెద్దవాళ్ళ దగ్గర మాట్లాడటం తప్పనే అవగాహన నాన్న కలిగించారు. నిజానికి అది చిన్న విషయం. అందరూ కూర్చున్న చోటే సరిచేసుకున్నారు. అయినా అతను వెళ్ళిపోయాడు.

కొద్ది నెలల తరువాత అతను మళ్ళీ తిరిగి వచ్చినా మేళం జరిగిన సంఘటనలు, నాన్న గతంలో బండిబాడుగ గురించి తీసుకున్న నిర్ణయాలు, అదే విధంగా దేన్నీ తొందరగా ఒప్పుకోని స్వభావం నాకు జ్ఞాపకం వచ్చాయి. నాన్న గురించి అప్పటిదాకా ఉన్న కోపం, అయోమయం నాలో నుంచి పారిపోయాయి.

నాన్న ఆ రోజు చేసిన వాదన మేళం అభివృద్ధికి అనుకూలంగా ఉంది.

ఇంటివాళ్ళే ఎక్కువ డబ్బులు తీసుకుంటారనే నిందను మోసుకోకూడదనే ముందాలోచన నాన్నది.

ఇది తండాలోని సభ్యులకు తనతో సమానంగా కలుపుకునిపోయే గుణం.

ఎక్కువగా శ్రమపడే, సంపాదించే, ఆటలో మనస్ఫూరిగా పాల్గొనేలా చేసే ఆలోచన అని నాకు అప్పుడు అర్థమైంది.

మేళాన్ని ఆరోగ్యకరమైన వాతావరణంలో చాలాకాలం వరకూ నడిపించుకునిపోయే నాన్న ముందుచూపును గమనించి మనసులోనే ఆయనకు భక్తిగా నమస్కరించాను.

ఈ స్వభావాన్ని నేను అలవరుచుకోవాలని నిర్ణయించుకున్నాను. భవిష్యత్తులో నా నాయకత్వంలో వాటిని అలవరుచుకున్నాను.

ఆ రోజుల్లో మా మేళంలో సంభావన పొందడం అంత సులభంగా ఉండలేదు. కళపై పట్టులేని ఏ కళాకారుడికి ఇక్కడ అవకాశం లేదు. కళా ప్రదర్శన విజయానికి ప్రతి ఒక్క కళాకారుడి శ్రమ ముఖ్యమని నాన్న చెప్పేవారు. అందువల్లనే అందరినీ

సమానంగా చూసేవారు. ఈ 'సమాన సంస్కృతి' అనుసరిస్తున్న కారణం వల్లనే మా వంశంలోని కళ ఇప్పటివరకు బతికి ఉండటానికి, మరింత ఉన్నత స్థాయికి అభివృద్ధి చెందటానికి కారణమైంది. నాన్న కాలంలో ఈ రకమైన విధానాన్ని జారీకి తీసుకుని వచ్చే అనివార్యత పదే పదే పెరిగింది.

నాన్న దగ్గరే నేర్చున్న, మా మేళంలోనే ఆటలు ప్రదర్శించిన, మా ఊరిలోని మా బంధువులే కొత్త మేళాన్ని కట్టుకున్నారు. అంతేకాకుండా ఆ సమయంలో రాణిబెన్నూరు తాలూకా చుట్టుపక్కలున్న పల్లెల్లో అనేక బృందాలు ఆటను ప్రదర్శించేవి. ఈ బృందాలు మా మేళంలోని సభ్యులను తమ వైపుకు లాక్కోవటానికి ప్రయత్నించేవి. కొందరు మేళం నుంచి బయటికి పోయి మళ్ళీ తిరిగొచ్చారు. నేను, అన్నయ్య చాలా బాధపడేవాళ్ళం.

అన్నయ్య అప్పుడు తొమ్మిదవ తరగతి చదువుతున్నప్పటికీ సెలవు రోజుల్లో మేళంవారిలో ఎవరైనా రానటువంటి సందర్భంలో ఆటలో పాల్గొనటానికి వచ్చేవాడు. దీనివల్ల నాన్న మేళం నుంచి సభ్యులు వెళ్ళిపోయినందుకు ఏ మాత్రం బాధపడలేదు. కళాకారులు మేళం నుంచి బయటకి పోవడం మళ్ళీ తిరిగి రావడం సహజమైన విషయాలుగా మారిపోయాయి. బయటకిపోయిన కొందరైతే మళ్ళీ మేళంలోకి రానేలేదు. ఇంకా కొందరు తమదైన తండాలను తయారు చేసుకున్నారు. మళ్ళీ ఇద్దరు మేళం వదిలి పోయారు. ఇలా మేళం వదిలి పోవటం మళ్ళీ తిరిగి రావటం నాన్న కాలంలో ఎక్కువైంది.

నాన్న తరువాత అన్నయ్య మేళం నాయకుడయ్యాడు.

సామాన్యంగా ఆ కాలంలో మేళం వదిలి వెళ్ళేవారు తక్కువగా ఉండేవారు.

ఇక నా నాయకత్వంలో అయితే లేనేలేదు.

ఎవరూ మేళం నుంచి బయటికి పోలేదు.

అలాంటి పరిస్థితి నేను ఎదుర్కోలేదు.

నాకు కలిగిన, కలుగుతున్న అనుభవాలు వేరు. అంటే నేను ఆట ప్రదర్శించడానికి అవసరమైన కళాకారులను వెతుక్కుని తీసుకొచ్చే పరిస్థితి వచ్చింది. ఈ రోజు ఆ పరిస్థితి మరింత దిగజారింది.

నాన్న కాలంలో కళాకారులకు ఉన్న డిమాండ్‌కు మా కాలంలో అది తగ్గటానికి అనేక కారణాలున్నాయి.

ముఖ్యకారణంగా నాకు కనిపించేదేమిటంటే ఆ రోజుల్లో ఈ ఆటకు ప్రజల నుంచి భారీగా డిమాండ్ ఉండేది.

అప్పట్లో ఈ టీవీ, సినిమా, ఏదీ ఉండలేదు.

చుట్టుపక్కలున్న పల్లెల్లో అనేక తండాలు ఉండేవి.

మా బృందానికి కాకపోయినా బయలాటలో అవకాశాలు దొరికేవి.

షెహనాయి, హార్మోనియం మాస్టర్లకైతే చాలా డిమాండ్.

అందువల్ల కళాకారులకు నాన్న కాలంలో అంత డిమాండ్ ఉండేది.

అన్నయ్య మేళం నాయకుడైన కాలానికి కొన్ని బృందాలు ఆట ప్రదర్శించడమే వదిలేశాయి. కొన్ని బృందాలు ఆటను వదులుకోవలసిన పరిస్థితిలో ఉన్నాయి. ఇంకా కొన్ని బృందాలు ఉన్నప్పటికీ నాన్న కాలంలో ఏ పోటీకి దిగే స్థితిలో లేవు. ఇక పెళ్ళి సమయాల్లో కొన్ని సంప్రదాయాలు, బయలాట మొదలైన కళలూ తగ్గిపోయాయి.

నేను నాయకత్వం వహించే కాలానికైతే 1990లో చుట్టుపక్కల పల్లెల్లో ఉన్న అన్ని బృందాలు ఆటలను ప్రదర్శించడమే నిలిపివేశాయి. ఈ రోజు ఏ మేళాలు లేవు. అందువల్లనే ఉత్తర కర్ణాటకలో ఏకైక తండా అనే పేరుప్రతిష్ఠలను మా బృందం సజీవంగా నిలుపుకుంది. ఇది మా వంశానికి ఉన్న గౌరవం కావచ్చు. మాలాంటి మేళంలో వృద్ధకళాకారులూ ఆడటానికి ఇష్టపడుతారు. దేశవిదేశాల నుంచి జనం, కళపై ఆసక్తి ఉన్నవారు, పరిశోధకులు వెతుక్కుంటూ మా ఇంటికి వస్తారు. అంతకన్నా గొప్ప సంతోషం వేరే ఏముంటుంది?

బాడుగకు బండి తోలటం ప్రారంభించిన ఒక సంవత్సరం తరువాత బాడుగ మొత్తం ఇరవై రూపాయలైంది.

ఆట ఆడించేవారు ప్రదర్శనకు ఇస్తున్న మొత్తం పెరగటమే నా బండిబాడుగ పెరుగుదలకు కారణం.

మొదట పదిరూపాయలు ఇచ్చేటప్పుడు ఒక ఆట ప్రదర్శనకు అరవై నుంచి ఎనభై రూపాయలు సంభావన వచ్చేది. తరువాత నూటాయాభై రూపాయల నుంచి రెండు వందల రూపాయలకు పెరిగింది.

ఆట ప్రదర్శనలకు మంచి కాలం ఆరంభమైన సమయంలో ఇంకొక రూపాయి దొరకటాన్ని చూసి నేనూ, మా కళాకారులంతా సంతోషపడ్డాం.

ఒక్క రోజూ బిడువు లేకుండా ఆటలు ప్రదర్శించాం.

అప్పట్లో చేతినిండా డబ్బు. నాకూ అంతే. రెండు ఆటలు ఆడిన రోజైతే రోజుకు నలభై రూపాయలు దొరికేవి. దొరికేవి అంటే ఆ రూపాయలు నా చేతికి వచ్చేవికావు. అన్నిటినీ నా పేరిట నాన్న లెక్క రాసుకుని తన దగ్గరే పెట్టుకునేవారు. నిజానికి నాకు అప్పుడ డబ్బుల అవసరం ఉండేది కాదు. తన కొడుకులు ఇంత సంపాదిస్తున్నారని మా నాన్న అమ్మతో, చెల్లెలితో చెప్పేవారుకదా! అదే గొప్ప సంతోషం!

అలా ఆరునెలలు గడిచివుండొచ్చు.

ఇరవై రూపాయలున్న బండిబాడుగ ముప్పయి అయ్యింది.

అప్పట్లో ఒక ప్రదర్శనకు నాలుగు వందల యాభై నుంచి అయిదు వందలకు సంభావన పెరిగింది. మరో సంవత్సరం గడిచివుండాలి. బండిబాడుగ యభై రూపాయలైంది. ఒక్క దెబ్బకు డబ్బు జంప్ కావడం అదే మొదలు. ఈ బాడుగ చాలా కాలం వరకూ అమల్లో ఉంది.

అప్పుడు మా ఇంటి సంపద ఉన్నట్టుండి పెరగసాగింది.

ఎందుకంటే ఆ సమయానికే మా అన్నయ్య కూడా ఆట ఆడటానికి అప్పుడప్పుడు వచ్చేవాడు.

నాన్న, అన్నయ్యల సంభావన, నా బండిబాడుగ అంతా కలిసి మేళానికి వచ్చే సంభావనలో సింహభాగమైంది.

అప్పుడు ఒక ఆట ప్రదర్శనకు 1000 నుంచి 1200 రూపాయల వరకూ ఇచ్చేవారు.

ఎక్కువ డబ్బులు వస్తాయని నాన్న సంతోషపడితే ఇంటి వాళ్ళు, పిల్లలు, మనవళ్ళు కళలు నేర్చుకుని ఆట ఆడుతున్నారుకదా అని తాతయ్య సంతోషపడేవారు.

(తరువాయి వచ్చే సంచికలో...)

మాండలికాలకు మెరుగులద్దిన పోరంకి దక్షిణామూర్తి



ఒకరి భాష మాండలికం, మరొకరిది భాష అనుకొనేవారికి కౌశలం అనే పదం పుట్టుక తెలిసి వుండకపోవచ్చు. దాని అర్థం 'నేర్పుగా గడ్డి కోయడం' అనే. ఒకప్పుడు మాండలిక ప్రయోగంగా మొదలై ప్రామాణిక భాషలో విశిష్ట పదంగా పాతుకుపోయినదని తెలుసుకొంటే మాండలికాల పట్ల తప్పుడు అభిప్రాయాలను నిరసించడమేకాదు ప్రతి మాండలికమూ భాషే. ప్రతి భాషా ఒక మాండలికమనే అవగాహనకు రాకపోరు. అంటే భాషలూ మాండలికాల మధ్య తేడా సామాజికపరమైన తేడాయే గానీ భాషాపరమైనది గాదు. మాండలికానికి ప్రాంతీయ పరిధులు ఉంటాయి. ప్రాంతీయతను దాటగలిగితే భాషా స్థాయిని చేరుకున్నట్టే. ప్రామాణిక భాష అనేది అలాంటిదే. రాత నేర్చిన మాండలికం ప్రాంతీయత నుండి బైటపడుతుంది. అది అన్ని ప్రాంతాలవారికీ పరిచయమౌతుంది. వాడుకలోకి వస్తుంది. సందర్భాన్ని బట్టి అలాంటి వాడుక అనివార్యం కావొచ్చు. ఇలాంటి ఆలోచనలతోటే ఆచార్య పోరంకి దక్షిణామూర్తిగారు దశాబ్దాలుగా చేసిన ప్రయత్నాలూ ప్రయోగాలూ మాండలికాలకు ప్రాంతీయత నుండి బైటపడేసి సార్వజనికతను అందించేందుకే పాతికేళ్లు నిండకమునుపే **'వెలుగూ వెన్నెల-గోదారి'** అనే పేరుతో ఒక నవలనే గోదావరి తీర జానపదుల మాండలికంలో రాశారు. అంతటితో ఆగక, 'ముత్యాల పందిరి' పేరుతో తెలంగాణ మాండలికంలోనూ, 'రంగవల్లి' అనే పేరుతో రాయలసీమ మాండలికంలోనూ నవలలు రాశారు. ఇలా మాండలికాలలో రాసిన నవలలు బహుమతులు పొందాయంటే అందరి మన్ననలను పొందాయనేగదా. **మాండలికంలో రాస్తే ఎవరు చదువుతారు? ఎవరికి అర్థమౌతుంది అన్న కొందరి మాటలను వమ్ము చేస్తూ మాండలికాలలో రచనలు ఇతర ప్రాంతాలవారికి బొత్తిగా అర్థం కానంతగా ఉండవని నిరూపించారు. మాండలిక రచనలతోటే భాషలో ఉన్న పలుకుబడులన్నీ భాషాభివృద్ధికి తోడ్పడుతాయని నమ్మారు. భాషలో పరిభాష పెరగడానికి వీలుగలుగుతుందని ఆశించారు.** అందుకనే ఆధునిక ప్రామాణిక భాషలో చేసిన రచనలకంటే మాండలిక భాషలో చేసిన రచనలే చదువురాని జన సామాన్యానికి చేరతాయనడంలో సందేహం లేదంటారు. **సాహిత్యాన్ని చదువురానివాళ్లకు కూడా అందించే మంచి సాధనం మాండలికం అంటారు పోరంకివారు.**

పోరంకి దక్షిణామూర్తిగారు ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి గారి దగ్గర భాషాశాస్త్ర శిక్షణ పొందిన మొదటి తరం సాహిత్యకారుల్లో ఒకరు. ఆచార్య భద్రిరాజుకృష్ణమూర్తిగారు తెలుగు భాషకు సమగ్ర నిఘంటు నిర్మాణం కోసం తలపెట్టిన అపురూప అధ్యయనంలో రెండో సంపుటంగా వచ్చిన చేనేత పదకోశ సంకలనంలో ప్రధాన పాత్ర పోషించి నేత వృత్తిలో వాడే పదజాల సేకరణలోనూ నిఘంటు నిర్మాణంలోనూ క్షేత్ర పరిశీలనకు కావలసిన భాషాశాస్త్ర పరమైన శిక్షణ పొందడమేగాక ఆ కోశ సంకలనంలో సహరచయితగా చేనేత పనిగురించి కథనాత్మక వివరణ అందించారు . ఈ శిక్షణే ఆ తరువాత మేదర పరిశ్రమకు సంబంధించిన మాండలిక వృత్తి పదకోశానికి సంపాదకులుగా 1991లో సంకలనం చేసి ప్రకటించడానికి ఉపయోగపడింది. మేదర వృత్తి పదకోశంలో మేదర వృత్తిలో వాడే కత్తులలో సుమారు పంతొమ్మిది రకాలను బొమ్మలతో సహా గీయించి అందించారు. ఉదాహరణకు, వాటిలో కొన్ని, ఒడ్డుకత్తి, నరుక్కత్తి, మేదరికత్తి, మూపురంకత్తి, మచ్చుకత్తి, పడగకత్తి, చురకత్తి, గౌరసకత్తి, రేకత్తి, నిలువుకత్తి, పడకత్తిలాంటివి ఎన్నోతెలుగునాట వివిధ వృత్తులలో వాడే తెలుగు భాష విస్తృతికి ఆనవాళ్లు.

భాషకు సంబంధించినంతవరకూ ఆయనొక జాతీయవాది. జాతీయభాషల్లో ఒకటి గొప్పదీ మరొకటి తక్కువదీ అన్న దురభిప్రాయాలకు తావుండకూడదంటారు. ప్రయత్నిస్తే జాతీయ స్థాయిలో సర్వ జనామోదయోగ్యమైన పరిభాష రూపొందించు కోవచ్చునని నమ్మినవారు. అయితే అనువాదాల దగ్గర మాత్రం భాషల వైయక్తిక సహజ నిర్మాణ పద్ధతికి సడలింపు లేదంటారు. ఆధునిక వ్యావహారికభాషస్థానే గ్రాంథిక భాషను బోధనాభాషగా కొనసాగించడాన్ని నిరసిస్తూ గురజాడ ప్రకటించిన అసమ్మతి పత్రాన్ని పోరంకివారు 'డిసెంట్‌నోట్'గా ఆంగ్లంలోకి అనువదించడంతో అది ఒకచారిత్రాత్మకపత్రంగాపేరుపొందింది.

పోరంకి దక్షిణామూర్తిగారు బహు గ్రంథకర్త. వందలాది కథలను ప్రకటించారు. కథానికకు ఒక ప్రామాణిక నిర్వచనాన్ని అందించే ప్రయత్నం చేశారు. వారు స్వయంగా రచయితగా రాని ప్రకటించినవిగాక, అనువదించి ప్రకటించిన గ్రంథాలే ముప్పైకి పైగా ఉన్నై. తెలుగు సాహిత్యంలోనేగాక భాషాశాస్త్రంలో గూడా ఆధునిక అవసరాలకు అనుగుణంగా తమవంతు కృషి చేసి తెలుగు భాషను పరిపుష్టం చేశారు. కథలూ, నవలలూ, నిఘంటువులూ, అనువాదాలూ, సమీక్షలూ, తెలుగు బోధనలోనూ, సామాజిక భాషాశాస్త్రం, శైలీశాస్త్రం, మొదలైనవాటన్నింటిలోనూ ప్రవేశించి భాషపట్ల తాను నమ్మిన ఆధునికభాషాశాస్త్ర భావ ప్రేరణతో ఎన్నో వ్యాసాలను ప్రకటించారు. తెలుగు భాషలో భాషాసంబంధిరచనలేగాక 'ఆధ్యాత్మిక వారసత్వం' పై వారు ప్రకటించిన వ్యాస పరంపర వారి వైవిధ్యభరితమైన వైయక్తిక జీవితానికి మరో కోణం. వేదాలతో మొదలెట్టి యోగవిద్యవరకూ భారతీయ ఆధ్యాత్మికతా తీరు తెన్నులనుఎత్తిచూపుతూ భిన్నత్వంలో ఏకత్వాన్నీ ఆధ్యాత్మిక గురుపరంపర ద్వారా మనకందిన ఆధ్యాత్మిక చింతననూ గురించి వివిధ వ్యాసాలరూపంలో మనకు అందించారు.

ఇంతటి వైవిధ్యభరితమైన రచయితగా, రెండు పదులు నిండకమునుపే రచనా జీవితాన్ని మొదలుపెట్టి ఎనభైఆరేండ్ల వరకూ భాషావ్యవసాయం సాగించిన పోరంకి దక్షిణామూర్తిగారు భౌతికంగా మననుంచి దూరమైనా వారి రచనలు ఇంకెంతో కాలం మనని పలకరిస్తూనే ఉంటాయి.

ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు
98661 28846

శ్రద్ధాంజలి

సీమ రైతు కథాకిరీటి సింగమనేని



అభ్యుదయ కథా రచయిత, మార్క్సిస్టు భావాల వారధి, ప్రముఖ సాహిత్య విమర్శకులూ సింగమనేని నారాయణ గారు 25.02.20021 మధ్యాన్నం అనంతపురం ఆసుపత్రిలో తుదిశ్వాస వదిలారు. వీరు 26.06.1943లో అనంతపురం దగ్గర రాప్తాడు మండలంలోని బండమీదపల్లెలో వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. తల్లి సంజీవమ్మ, తండ్రి రామప్ప. వీరికి ముగ్గురు కూతుర్లు ఒక కుమారుడు. వీరి ప్రాథమిక విద్యాభ్యాసం ఉండూరులో జరిగి పి.యు.సి.ని అనంతపురంలో ముగించి విద్వాన్ కోర్సును తిరుపతి ప్రాచ్య కళాశాలలో చదివి అనంతరం పండిట్ శిక్షణను కర్నూలులో పూర్తి చేసారు. 1969లో నార్పల జిల్లాపరిషత్ పాఠశాలలో తెలుగు పండితుడిగా చేరి 2001లో రాప్తాడు ఉన్నత పాఠశాలలో ఉద్యోగ విరమణ చేశారు.

బాల్యంలో తండ్రి రామప్ప మంచి కథల పుస్తకాలను చదివేలా చేసి తెలుగు భాషపట్ల సాహిత్యం వైపు మక్కువ పెంచాడు. పుస్తకాలు చదువుతూనే 17 యేళ్ల వయస్సులో "న్యాయమెక్కడ" అనే కథానిక రాస్తే దానిని కృష్ణాపత్రికవారు 02.07.1960లో ప్రచురించారు. తరువాత విరివిగా నవలలు చదివి ఊహాలోకాల్లో విహరిస్తూ "ఆదర్శాలూ-అనుబంధాలు" "అనురాగానికి హద్దులు" "ఎడారి గులాబీ" అనే నవలలు(1964-1968 మధ్య) రాశారు. తరువాత వీరికి మార్క్సిజం పరిచయమయ్యింది. దానితో సింగమనేని నారాయణ చౌదరి అనే తన పేరులోని చౌదరి ని తొలగించుకొన్నాడు. కొన్నాళ్లు రాయడం మాని, మార్క్సు దృక్పథానికి సంబంధించిన పుస్తకాల్ని విస్తృతంగా చదివారు.

తాను మార్క్సు దృక్పథాన్ని వారి గురువు గారైన నాగసిద్ధారెడ్డి గారు పరిచయం చేసిన శ్రీశ్రీ గారి "మహాప్రస్థానం" ద్వారానే ఆకళింపు చేసుకొన్నానని సింగమనేని చెప్పేవారు. అంతేకాక వీరు శ్రీశ్రీ, తిలక్‌ల కవిత్వాల్ని పేజీలకు పేజీలు అనర్గళంగా తన ఉపన్యాసాల్లో సందర్భోచితంగా వినిపించేవారు.

ఇతని రచనలూ-తెల్లని మడత నలగని పంచెకట్టూ, అచ్చ తెలుగుతనానికి కొలమానాలు. బడిలో తెలుగుపాఠాలు చెప్పిన ఉపాధ్యాయుడే కాక సీమ రైతుల సమస్యలపై కథారచనలు చేసిన అక్షరసేద్యగాడు. ఎంత సేపు ఉపన్యాసం చేసినా ఒక్క వ్యర్థం మాట లేకుండా చెప్పదలచుకొన్న విషయాన్ని అరటిపండులా వొలిచి చెప్పగల ఉపన్యాసకుడు. వాస్తు మూఢనమ్మకాల మూర్ఖత్వాలను దెప్పిపొడుస్తూ రచనలు చేయడమే కాక తన రచనలకు అనుగుణంగా సిద్ధాంతాలకు కట్టుబడి చివరిదాకా బతికిన సాహసి. తెలుగు కథానికా ప్రక్రియను సుసంపన్నం చేసిన రెండో తరం రాయలసీమ కథకుల్లో ముఖ్యుడు.

ఏ పత్రికలో కొత్తతరం రచయిత కానీ, నూతన భావస్ఫోరకం కానీ కనిపించినా ఫోనులో పలకరించికానీ, ఇంటికి పిలిచి కానీ మెచ్చుకొని వెన్నుతట్టడమో, అందులోని తప్పొప్పులను ఎత్తి చూపడమో చేసేవాడు. యువతరంలో ఎటువంటి పురాభావాలు కనిపించినా నిర్మొహమాటంగా కుండబద్దలు కొట్టినట్లు ఖండిస్తూ కాలానుగుణమైన సామాజికస్పృహను ఎలా చెప్పాలో వివరించేవారు. ఆ విధంగా ఎందరో యువరచయితలకు మార్గదర్శకులైనారు(నాతో సహా).

వీరి రచనలపై విశ్వవిద్యాలయాలలో విద్యార్థులు పరిశోధనలు చేసి పి.హెచ్.డి.లు పొందారు. కొన్ని యూనివర్సిటీలు వీరి కథల్ని పాఠ్యాంశాలుగా ఉంచాయి. వీరు రాయలసీమ నీటి సమస్యల మీద రచనలు చేస్తూనే "హంద్రీ నీవా జలసాధన సమితి" కి కన్వీనర్ గా వ్యవహరించారు. అనంతపురం జిల్లాలో తీవ్ర కరువుతో రైతులు ఆత్మహత్యలు చేసుకొంటూ ఉండే సమయంలో జిల్లా అంతటా ఇతర రచయితలతో కలిసి "రైతు ఆత్మవిశ్వాసయాత్ర"లు చేసి వారిలో ఆత్మస్థైర్యం నింపారు.

వీరి కథలు (1)జూదం (2)సింగమనేని నారాయణ కథలు (3)సింగమనేని నారాయణ కథానికలు (4)జీవఫలం-చేదు విషం (5)నీకూ నాకూ మధ్య నిశీధి పుస్తకాలుగా వచ్చాయి.

వివిధ సందర్భాల్లో రాసిన వీరి వ్యాసాలు (1)సమయమూ-సందర్భమూ (2)సంభాషణం (3)కథావరణం(4)మున్నుడి పేరిట అచ్చయ్యాయి. (1)సీమ కథలు(2)తెలుగు కథకులు-కథన రీతులు (మూడు సంపుటాలు మధురాంతకం రాజారాం తో కలిసి)(3)విశాలాంధ్ర వారి తెలుగు కథ (4)ఇనప గజ్జల తల్లి పుస్తకాలకు సంపాదకులుగా వ్యవహరించారు. చాలా పుస్తకాలకు సమీక్షలు, ముందుమాటలూ రాశారు. ఆకాశవాణి కడప, అనంతపురం కేంద్రాల్లో వీరి ఎన్నో ప్రసంగాలు ప్రసారం అయ్యాయి. వీరివి సాహిత్యసేవలకుగాను ఎన్నో ఆవార్డులు లభించాయి.

రాయలసీమ ముఖ్యంగా అనంతపురం జిల్లా గ్రామీణుల, రైతుల జీవన సమస్యలు....దురాశాపరులై మితిమీరిన ధన సంపాదనా పరులయిన నగరవాసుల కృత్రిమ జీవనము, ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయుల బతకనేర్చిన తనము, పరీక్షా ఫలితాల డొల్లతనమూ, పెత్తందార్లు దళితుల పట్ల మెలిగే విధానమూ, స్త్రీల అణచివేతల

రూపాలనూ ఎటువంటి దాపరికాలకూ పోకుండా కథలుగా మన కళ్లకు కట్టి చూపాడు.

నాకు వారితో సాహిత్య నేస్తమే కాక రోగానుబంధం కూడా ఉంది. వారికి మధ్య వయస్సులో ఆస్తమా జబ్బు ఆవహిస్తే, నాకు బాల్యం నుంచీ పీడిస్తూనే ఉంది. ఇద్దరమూ కలిసినప్పుడు మా జబ్బుల గురించే చర్చ జరిగేది. "ఇది జబ్బు కాదయ్యా ఒక వరం! ప్రపంచం లోని గొప్పవారంతా ఆస్తమా పీడితులే. కాబట్టి దాని గురించి ఆలోచించడం మాని, మంచి గ్రామీణప్రాంతం నేపథ్యంలో ఒక మంచి నవల రాయడానికి యత్నించు" అని చెప్పేవాడు. గత పది నెలలుగా వారి అనారోగ్యం గురించి తెలుసు. రోజూ ఫోనులో మందుల గురించి మాట్లాడుకొనేవారం. మొన్న జనవరి 25 నాడు వారిని పలకరించడానికే అనంతపురం వెళ్లడం జరిగింది. ఆ రోజుకూడా "సడ్లపల్లీ ఈ చలికాలం నన్ను బతకనీయదయ్యా! త్వరగా పోతే నయమనిపిస్తూఉంది అని డీలాగా మాట్లాడారు. నవల రాయడం మొదలు పెట్టావా?"అన్నారు. "లేదు లే సార్! ఈ నెల ఓపికపడితే ఎండాకాలం వస్తుంది మీరు కోలుకొంటారు" అన్నాను. అవే మా ఇద్దరి మధ్యన–చివరి మాటలు.


వారు భౌతికంగా మననుంచీ దూరమైనా విలువైన, సామాజికస్పృహ కలిగిన ఎన్నో రచనల్ని వారసత్వసంపదగా సమాజానికి అందించి పోయారు. తెలుగుభాష ఉన్నంతవరకూ వారు తన రచనల రూపంలో మనల్ని పలకరిస్తూనే ఉంటారు.

సడ్లపల్లె చిదంబరరెడ్డి
94400 73636

మైదుకూరులో ఘనంగా మాతృభాషాదినోత్సవం



పుస్తక పఠనం ద్వారా ప్రాపంచికజ్ఞానాన్ని అపారంగా పొందవచ్చునని తెలుగు భాషోద్యమ సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, కథారచయిత తవ్వా ఓబుల్‌రెడ్డి పేర్కొన్నారు. మైదుకూరులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవాన్ని నిర్వహించారు. తెలుగు భాషోద్యమసమాఖ్య మైదుకూరుశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తవ్వా ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ భాషాసంపదను, ప్రపంచజ్ఞానాన్ని ఇనుమడింప చేసుకోవచ్చునని చెప్పారు. సమాఖ్య గౌరవాధ్యక్షుడు టి.మహానందప్ప తెలుగుభాషలో పదసౌందర్యాన్ని వివరించారు. జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయులు ఎల్. సూర్యనారాయణరెడ్డి, ఎ.బాలగంగాధరరావు, ధర్మిశెట్టిరమణ. తెలుగుభాషోద్యమ గీతాన్ని ఆలాపించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు సామెతలు పొడుపుకథలు, తెలుగుపౌరుషం పుస్తకాలను బహుమతిగా అందజేశారు.



డా॥ మధురాంతకం నరేంద్ర
98662 43659

రవీంద్రనాథ టాగూరు 'ముక్తధార'

సమకాలీన సాంఘిక రాజకీయ సాంస్కృతిక కల్లోలాల్ని గమనించినప్పుడల్లా వెంటనే గుర్తుకువచ్చే రచన రవీంద్రనాథ్‌టాగూర్ నాటకం **ముక్తధార**. ఇటీవలి కోవిడ్ విపత్కర పరిస్థితి మళ్ళీ మళ్ళీ '**ముక్తధార**'ను జ్ఞాపకం చేస్తోంది.

1922 రవీంద్రుడు రాసిన నాటకం ముక్తధార. అప్పటికి భారతదేశ స్వాతంత్ర్యోద్యమం పుంజుకోలేదు. అప్పటి విదేశీయ పాలన నేపథ్యంలో వుత్తరకోట, శివతరాయి అనే రెండు రాజ్యాల మధ్య రగిలిన సంఘర్షణను రవీంద్రుడు గొప్ప అన్యార్థ రచన (Allegory)గా తీర్చిదిద్దాడు.

వుత్తరకోట పర్వతాల్లోంచి పుట్టిన ముక్తధార నది శివతరాయి పంటలకు జీవదాయినిగా వుంటోంది. అయితే వుత్తరకోట రాజు రంజిత్ శివతరాయినెప్పుడో తన పాలనలోకి తెచ్చేశాడు. శివతరాయినుంచీ విదేశాలకు వ్యాపారం చేయడానికి వెళ్ళే నందికొండ మార్గాన్ని మూసేసి, శివతరాయి ప్రజలు తాము పండించిన పంటల్ని, ముడి పదార్థాల్ని కేవలం వుత్తరకోటకు అమ్ముకునే పరిస్థితి తెచ్చాడు. తక్కువ ధరలకవి కొనుక్కొని, వాటినుంచీ తయారు చేసిన వస్తువులను వాళ్ళకే అధిక ధరలకు అమ్మి, వాళ్ళను తన చెప్పుచేతల్లో వుంచుకున్నాడు. అంతటితో సంతృప్తిపడక ముక్తధార నదికి ఆనకట్ట కట్టి నదినీళ్ళను తన అదుపులో వుంచుకోవడం ద్వారా శివతరాయిని మరింతగా అణగతొక్కాలని నిర్ణయించుకున్నాడు.

అయితే ముక్తధారకు ఆనకట్ట కట్టడం అంత సులభమైన పనేమిగాదు. యెందరో ప్రయత్నించారు. ఆనకట్ట సగంలోనే విరిగి నదివేగానికి తట్టుకోలేక, కొట్టుకుపోయింది. చివరకు విభూతి అనే రాజయంత్ర నిపుణుడు ముక్తధారకు ఆనకట్ట కట్టేశాడు. మొత్తం వుత్తరకోట రాజ్యమంతా, రాజుతో సహా విభూతిని భైరవస్వామి ఆలయంలో సన్మానం చేయడానికి పూనుకుంది. మొత్తం 'ముక్తధార' అనే నాటకం విభూతికి సన్మానం జరుగుతున్న రోజులో జరుగుతుంది.

రవీంద్రుడి నాటకాల్లో రాజులు, నాయకులవంటి ముఖ్య పాత్రలకంటే బిచ్చగాళ్ళూ, యాత్రికులూ, పాటలు పాడేవాళ్ళు, దీపాలు అమ్మేవాళ్ళు, పెరుగమ్మే పడతులు మొదలైన సామాన్యులే యెక్కువ సేపు కనబడతారు. వాళ్ళు వాళ్ళ నాయకులకంటే యెక్కువగా వుద్రేక పడుతూవుంటారు. శివతరాయి ప్రజలను చూస్తే వుత్తరకోట ప్రజలకు చులకన, కంటగింపూ.

రంజిత్‌కు అభిజిత్ అనే పెంపుడు కొడుకున్నాడు. శివతరాయి ప్రజలంతా ధనుంజయుడనే బైరాగిని నాయకుడుగా గౌరవిస్తూ, వుత్తరకోటపైన తిరిగబడ్డానికి ఆయన అనుమతి కోసం వేచి చూస్తున్నారు. ముక్తధార నదిలో ఆగకుండా పడిలేచే తరంగాల్లా ఆ రెండు దేశాల్లోని ప్రసిద్ధులూ, అప్రసిద్ధులూ, వరసగా యెదురై భేటీ పడతారు. యెప్పుడో అనాదిలో మొదలై నిరంతరంగా సాగుతూ, భవిష్యత్తులోనూ ఆగకుండా సాగే యీ మానవతరంగాల సమూహాలు వొకదినంలో చేసిన భేటీలతో రవీంద్రుడు మొత్తం సమకాలీన ప్రపంచానికంతా నిలువెత్తు ప్రతిబింబాన్ని నాటకంలో అద్భుతంగా ఆవిష్కరిస్తాడు. చాలా ముక్తసరిగా చెప్పిన యీ కథనింతవరకూ చదివిన వాళ్లకు శివతరాయి నాటి భారతదేశానికీ, వుత్తరకోట నాటి యింగ్లీషు ప్రభుత్వానికీ ప్రతీకలని స్పష్టంగానే అర్థమయిపోతుంది. అయితే దాన్ని రెండు సంస్కృతులకు జరిగిన సంఘర్షణగా మాత్రమే గాకుండా సార్వకాలికమైన మానవ జీవన గమనంగా రూపొందించడంలోని రవీంద్రుడి ప్రతిభ విస్మయుల్ని చేస్తుంది.

'ముక్తధార' నాటకం అభిజిత్, ధనంజయుడు అనే రెండు యిరుసుల పైన సాగే రథం. అభిజిత్ రంజిత్ కన్నకొడుకు కాదు. దాదాపు రెండున్నర దశాబ్దాల క్రితం రంజిత్ వొకనాడు వాహ్యాళికోసం ముక్తధార నదీ తీరానికెళ్ళాడు. అప్పుడక్కడ నతీ తసిగాల డోలల్లో వూగుతున్నాడేమో కనిపించేలా తీరంలో వో పసి బాలుడు కనిపించాడు. ఆ బాలుడు భవిష్యత్తులో రాజాధిరాజు అవుతాడనీ ఆస్థాన జ్యోతిష్యుడు చెప్తాడు. రాజు ఆ బాలుడ్ని అభిజిత్ అని పేరు పెట్టి పెంచుకుంటాడు. యువకుడయ్యాక అతడ్ని శివతరాయి రాజ్యానికి పంపి తన ప్రతినిధిగా పాలించమంటాడు.

అయితే శివతరాయికి వెళ్లిన అభిజిత్ ఆ దేశప్రజలను పీడించడానికి బదులుగా ప్రేమించడం మొదలు పెడతాడు. కరువు వచ్చిందని పన్నుల్ని వసూలు చేయడు. పైగా ముక్తధార నదిపైన ఆనకట్ట పూర్తవగానే తానో చెరసాలలో పడ్డట్టుగా విలవిల్లాడిపోతాడు. అతనిలోని యీ ఆందోళనను గమనించిన అతని ఆత్మీయ స్నేహితుడు, సంజయుడనే మరో యువరాజు, అతడ్ని వీలయినంతగా సంతోషపెట్టడానికి ప్రయత్నిస్తాడు. కానీ తన జీవితపు ఆలంబన యేమిటో క్రమంగా యిప్పుడే తెలిసివచ్చిందని – అభిజిత్ మిత్రుడికి చెప్తాడు. అతడికి పుట్టుకతోనే ముక్తధార నదితో మానసిక బంధం పడిపోయివుంది. ఆ నదిని బంధించినప్పుడు అతడి మనస్సూ పంజరంలో కట్టుబడిపోయినట్టయి పోయింది. అతనికి మళ్లీ స్వేచ్ఛకావాలంటే ఆ పంజరాన్ని పగలగొట్టక తప్పదు. అది అతడి మానసిక అవసరం. తప్పదు.

మనిషి ప్రకృతిలో వేరుగా వుండడానికి వీల్లేని భాగం. ప్రకృతిలోని వాటిని వాడుకుని మాత్రమే మనిషి జీవిస్తున్నాడన్నదే అందుకు నిదర్శనం. మనిషి మనస్సుకూ, ప్రకృతికీ అవినాభావమైన సంబంధముంది. మనిషీ, ప్రకృతీ సుఖదు:ఖాల్ని పరస్పరం పంచుకోక తప్పదు. ప్రతి మనిషి మనసూ ప్రకృతిలో యేదోవొక దానితో విడదీయరానంతగా ముడిపడి వుంటుంది. అది గుర్తించగలిగిన వాళ్లకు స్వాంతనముంటుంది. ఆయా ప్రాకృతిక భాగానికి దెబ్బతగలడం వల్లనే తమలో అశాంతి పెరుగుతుందని గుర్తించిన వాళ్ళు ప్రకృతిలో సమన్వయంకోసం తమ వంతుపని తాము చేస్తారు. అలా గుర్తించుకున్నవాళ్ళ శాతం బాగా తగ్గిపోయినప్పుడు విపత్తులు తప్పవు.

తన జీవనానందం ముక్తధార నదితో ముడిబడివుందని గుర్తించిన అపురూపమైన మానవుడు అభిజిత్. ఆ నది పాదాల్ని

సంకెళ్ళతో బంధించినప్పుడు, అతడు వులిక్కిపడి నిద్రలోంచి మేలుకున్నాడు. అప్పుడతడికి ముక్తధార నదికి కట్టిన ఆనకట్ట మాత్రమే తన చెరశాల కాదని తెలిసింది. వుత్తరకోట సింహాసనం కూడా యిప్పుడతన్ని బంధిస్తోంది. ఒకదేశాన్ని, ఒక ప్రాంతాన్ని మాత్రమే ప్రేమించడం కూడా సంకుచితత్వమే ! **రవీంద్రుడు మూర్ఖంగామారే దైవభక్తినిగూడా నిరసిస్తాడు. సంకుచితమైన గోడలులేని విశ్వమానవ ప్రేమనే ఆయన గౌరవిస్తాడు.**

మానవుడిలో ప్రకృతిపైన వుండాల్సిన, వున్న బంధాన్ని చూపడమే ఈ నాటకపు ప్రధాన వస్తువని చాలాసార్లు రవీంద్రుడు చెప్పాడు. దాన్ని అభిజిత్‌కు నదితో వుండే బంధంతో మాత్రమే గాకుండా, మిగిలిన యితర ప్రాంతాలతో వుండే బందాలతో గూడా స్పష్టంగా వ్యక్తీకరిస్తాడు. ప్రకృతిలో వున్న ముక్తధార నదితో బాటూ అభిజిత్‌కు ప్రకృతిలోని భాగమైన మనుషులతోనూ గొప్ప సంబంధముంది. ఆ సంబంధాన్ని గుర్తించడం చేతనే, వాళ్ళ పైన ప్రేమతోనే, అతను, తాను, చేయవలసిన, చేయకుండా వుండడానికి వీల్లేని పనికి వున్ముక్తుడవుతాడు.

ముందుగా అభిజిత్‌ను అత్యధికంగా ప్రేమించే అతడి పెంపుడు తండ్రి కూడా అతడి పైన కోప్పడతాడు. శివతరాయినుంచీ పన్నులు వసూలుచేసి తన దేశానికి కీడు చేశాడని కోప్పడతాడు. చెప్పుడు మాటలు విని పాడయ్యాడని, అతనికా పుట్టుక రహస్యాన్ని చెప్పి తప్పుదారి పట్టించారనీ ఆశ్రితుల్ని తీవ్రంగా మందలిస్తారు.

స్నేహితుడైన సంజయుడు చివరి వరకూ అభిజిత్‌ను ముక్తధార ఆనకట్టను పడగొట్టనివ్వకుండా ఆపాలనే ప్రయత్నిస్తాడు. అతడ్ని గౌరవించే శివతరాయి ప్రజలను గుర్తుచేస్తాడు. పైగా ఆనకట్టను పడగొట్టడమంటే మరణాన్ని చేరుకోవడమేననీ హెచ్చరిస్తాడు. తనను వదలి వెళ్లవద్దని బ్రతిమాలుతాడు. అయితే యెవరి జీవన గమనం వాళ్ళదనీ, యెవరి గమ్యం వాళ్ళే వెతుక్కోవాలనీ, యింకొకరికి నీడలా జీవించడం తప్పనీ– అభిజిత్ మిత్రుడ్ని వారిస్తాడు.

నదికి ఆనకట్టకట్టిన విభూతికి ఆ రోజు ప్రత్యేకమైనది. అందరూ ఆరోజు తననుతప్ప యింకేమీ పట్టించుకోగూడదని అతగాడివుద్దేశం. సరిగ్గా అదేరోజున శివతరాయి రాజ్యపు నందికొండ మార్గానికున్న అడ్డుగోడను పగలగొట్టారనీ, దాని వెనక అభిజిత్ హస్తముందనీ అతడికి తెలుస్తుంది. తన కీర్తికీ, ప్రాబల్యానికి ఆ వార్త గండి కొడుతోందని విభూతి కోప్పడతాడు. సరిగ్గా అదే సమయానికి అభిజిత్ తన వార్తాహరుణ్ణి విభూతి దగ్గరకు పంపిస్తాడు. 'ఆనకట్టను కట్టడం ద్వారా నీ మేధస్సును నిరూపించుకున్నావు. దాన్నిపుడు పడగొట్టడం ద్వారా గొప్ప మానవుడవని నిరూపించుకో" అంటాడా వార్తాహరుడు. ఆనకట్ట అన్నది విభూతిలాంటి శాస్త్రవేత్తకు కేవలం తన అహాన్ని నిరూపించే వైభవం మాత్రమే. దానిద్వారా శివతరాయి ప్రజల పంట, తిండీ పోతాయనీ, అది వాళ్ళను అదుపుచేసే దుర్మార్గపు ఆయుధమనీ గుర్తించే వోపికా, వెసులుబాటూ విభూతికి లేవు. దాన్ని నిర్మించడం కోసం ప్రాణాలిచ్చిన అనేకమంది యువకుల గురించి అతను పట్టించుకోడు. యెందరో తల్లుల శాపం తనపైన వుందని లక్ష్యపెట్టడు. చివరకు నదిని నియంత్రించడం ద్వారా తానిప్పుడు దేవుడంత గొప్పవాడినయ్యానని భావిస్తాడు. కానీ మానవ నిర్మితమైనవేవీ సంపూర్ణమైనవిగావనీ, ఆనకట్టలో కొన్ని బలహీన భాగాలున్నాయనీ వార్తాహరుడంటాడు. వులిక్కిబడ్డ విభూతి ఆనకట్టకు మృత్యువనే కాపలావాడున్నాడనీ, దాన్నేమైనా చేయబోయిన వాళ్ళనా కాపలావాడు వదలడనీ బెదిరిస్తాడు. అయితే మృత్యువుకు జంకని వాళ్ళుంటారని విభూతికి తెలియదు.

అభిజిత్‌ను పాడుచేసిన వాళ్ళలో ధనంజయుడనే బైరాగి ప్రముఖుడని రాజు నమ్మకం. అయితే ధనంజయుడనే బైరాగీ, అభిజిత్ అనే యువరాజూ యీ నాటకంలో యెప్పుడూ కలవరు. కానీ ధనంజయుడు చేయాలనుకున్న పనిని అభిజిత్ నిర్వర్తిస్తాడు. అభిజిత్ జీవన గమనంతో ధనుంజయుడు మానసికంగా మమేకమవుతాడు. ధనంజయుడొకడు మాత్రమే అభిజిత్ తనదైన కర్తవ్యాన్ని నిర్వర్తించడంకోసం నది దగ్గరకి వెళ్ళాడని తెలుసుకుంటాడు. తమకు మేలుచేసిన అభిజిత్‌ను తీసుకెళ్ళి తమకు రాజుగా చేసుకోవాలని శివతరాయి ప్రజలూ, తమదేశానికి కీడు తెచ్చినవాణ్ని శిక్షించాలని వుత్తరకోట మనుషులూ యెదురు చూస్తున్నారు. అభిజిత్‌ను అటు వెళ్ళనివ్వకుండా సంజయుడు వెంటాడుతూనే వున్నాడు. ధనంజయుడు అభిజిత్ తననితాను యెర్రటి తామరలా సాయంకాలపు వేళ, ఆవలి తీరంలో సమర్పించుకోబోతున్నాడని యెలుగెత్తి చెప్తాడు.

ఆనకట్ట విస్ఫోటనం ముందుగా విభూతే వింటాడు. పరిగెత్తి వస్తున్న నదినీళ్లలో అభిజిత్ బుడి బుడి నడకల సవ్వడి రంజిత్ కు వినబడుతుంది. ఆనకట్ట అనే యంత్రం తిప్పికొట్టినప్పుడు, నది అభిజిత్ శరీరాన్ని తల్లి బిడ్డను మోసుకెళ్ళినట్టుగా లాక్కెళ్ళిపోయిందని చెప్తాడు సంజయుడు. యిప్పుడు అభిజిత్ శివతరాయి, వుత్తరకోటల రెండింటి వాడూ అయ్యాడని ధనంజయుడు ఘోషిస్తాడు.

రవీంద్రుడి మార్మికత (mysticism) **అస్పష్టమైనదీ, అయోమయమైనదీ గాదు. ఆయనకు మనిషీ, ప్రకృతి, దైవమూ అన్నీ ఒకటే. మానవత్వమే దైవమనీ, ప్రకృతికీ దైవానికీ తేడా వుండదనీ ఆయన రచనలన్నీ చెప్తాయి.** ప్రకృతిలో జీవించే మానవుడే గొప్ప సంపన్నుడనీ, ప్రపంచంలోని గొప్ప సంపద ప్రకృతేననీ రవీంద్రుడు గుర్తించాడు. అందుకే ప్రకృతిని యిబ్బంది పెట్టే దేన్నీ మనిషి చేపట్టకూడదని అంటాడు. అవసరాలకు తగినంతగా నీటిని ఆపి వాడుకోవడం తప్పుకాదుగానీ, అందరికీ అయిన నీటిని తాము మాత్రమే దోచుకోవడాన్నీ, యితరులను యిబ్బంది పెట్టేందుకు నీటిని అదుపులో పెట్టుకోవడాన్ని ఆయన 1922 లోనే నిరసించాడు.

ప్రకృతితో ప్రతిమనిషికి మానసిక బంధముంటుందని ఆయన గుర్తించమంటాడు. ఆ అవగాహన, సత్యం బోధపడినప్పుడు మనిషి ప్రకృతికి విధేయంగా జీవించ గలుగుతాడు. ప్రకృతిలోని భాగమైన తోటి మానవులతోనూ అంతే సమన్వయంతో జీవిస్తాడు. అప్పుడు జీవనం ఆనందప్రదమవుతుంది.

'ముక్తధార' అనే పేరులోనే ఆ నది స్వభావం స్పష్టమవుతుంది. దాన్ని ఆపడం మనుషుల చేతనయ్యేపనిగాదు. అది ప్రకృతి అంత స్వేచ్ఛవున్న నది. రవీంద్రుడీ గొప్ప నాటకంలో అనేక అడ్డుకట్టల్నీ, వాటినన్నింటినీ పగలకొట్టాల్సిన అవసరాన్ని పేర్కొంటాడు. ప్రేమ, స్నేహం, సాన్నిహిత్యం, త్యాగం లాంటి వాటినన్నింటినీ పునర్వించుకోవాల్సిన అవసరాన్ని రవీంద్రుడెప్పుడో గుర్తుచేశాడు. **దురభిమానాన్ని దునిమేదీ, సందేహాల్ని పోగొట్టేదీ, సంకెళ్లను పగలగొట్టేదీ అయిన ప్రకృతినే ఆయన దైవంగా భావించాడు. ఆ జ్ఞానం మనుషులందరికీ కలిగినప్పుడు మాత్రమే యీ ప్రపంచం నివాసయోగ్యంగా వుండగలుగుతుంది.**

పనికొచ్చేకథ

జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి
94400 37258

ర్యాంక్

గులాబీలా ముద్దొస్తూ ముల్లులా పొడిచే ఏకైక ప్రాణికున్న అందమైన పేరే భార్య. ఈ విషయాన్ని మరోసారి నిరూపించుకోవడానికి సిద్ధంగా ఉంది మా ఆవిడ. ఎప్పుడూ నేనే దానికి బలి చక్రవర్తిని.

కానీ ఈ రోజు మాత్రం ఆ అదృష్టం మా పునీత్ గాడికి పట్టబోతోంది. వాడు టెన్త్‌లో స్టేట్ రాంకర్. ఇప్పుడు ఇంటర్లో కూడా స్టేట్ ర్యాంకర్ కావాలనేది మా ఆవిడ రెండేళ్ళుగా కంటున్న పంచరంగుల కల. కానీ వాడీసారి కాలేజీ లెవెల్లో కూడా ఏ ర్యాంకూ తెచ్చులోలేకపోయాడు. దాంతో వాడిమీద పీకల్దాకా కోపంతో ఊగిపోతూ, వాడికోసం ఎదురు చూస్తూ కూర్చుంది.

ఈ కాకలో ఉండగా, వాడు వచ్చాడంటే, తను వాడి దుంప తెంపెయ్యడం ఖాయం. అందుకే, ర్యాంకులనేవి వాపునేగానీ బలుపుని సూచించవనీ, వాటిని నమ్ముకుని రెజ్లింగ్ పోటీలకి వెళ్ళకూడదనీ, నానారకాలుగా నచ్చజెప్పాను. నా మాటల్లో బలుపనే పదాన్ని పట్టుకుని, వేళతప్పకుండా ముప్పొద్దులా మెక్కుతూ కూర్చోవడం వల్లే వాడికి తెగ బలిసిందనీ, ఆ బలుపుకి కారణం వాడేనంటూ వాడి బదులుగా నన్ను తగులుకుంది. అయినా సరే వాడు రాగానే చిందులు తొక్కొద్దనీ, అపార్టుమెంట్లో అందరి ముందూ వాడి పరువు తీసి నిన్ను నువ్వు తక్కువ చేసుకోవద్దనీ చిలక్కి చెప్పినట్టు చెప్పాను. వాడొచ్చేలోపు నేను స్నానం పూర్తి చేసి వచ్చేస్తే మంచిది. వాళ్ళమ్మ దాడికి కాలో చెయ్యో అడ్డం వెయ్యొచ్చు.

వాడి ఖర్మకాలి సరిగ్గా నేను స్నానం చేస్తూండగానే ఏదో కొంపలు మునిగిపోయినట్టు ఇంటికి వచ్చేశాడు పునీత్ గాడు. .

నా స్నానం పూర్తయ్యేంతవరకైనా మా ఆవిడ వీరావేశాన్ని అడ్డుకో స్వామీ అంటూ వెంకన్నకి మొక్కుకుంటూండగానే తాప్ అంటూ చెంపదెబ్బ తగిలిన చప్పుడు వినిపించింది. ఆ వెనకే మొదలైంది ఏడుపు. వీడొకడు.., ఒక్కదెబ్బ కూడా తట్టుకోలేడు. పనికిమాలిన వెధవలా అక్కడే ఏడుస్తూ కూర్చోకపోతే, "ర్యాంకు ముఖ్యమా–తెలివి ముఖ్యమా" అని ఎదురు తిరిగి, తన పరిస్థితి ఏమిటో చెప్పి తగలడచ్చుగా? తనకి రాంకు రాకపోవడానికి గల కారణాలను దానికి అర్థమయ్యేలా వివరించి ఏడవ్వచ్చుగా? ఊహూ... ఆపని మాత్రం చచ్చినా చెయ్యడు. అయినా వాడినని ఏం లాభం? మా ఆవిడకి ఎదురు తిరిగి నిలబడే ధైర్యం నాకే లేదు. అందుకే తను రానురానూ గయ్యాళిలా తయారౌతోంది.

అంతలోనే మరో చెంపదెబ్బ తగిలింది. వాడి ఏడుపు తారస్థాయికి చేరింది. అయినా అక్కడే ఉండి చెంపదెబ్బలు తింటూ అఘోరించకపోతే తన గదిలోకి వెళ్ళి తలుపేసుకోవచ్చుగా? చివరికి కన్నతల్లి కోపాన్నించి తప్పించుకునే తెలివితేటలు కూడా లేవు వెధవకి. ఎలా బతుకుతాడో ఏంటో.

తనకి ఎన్నిసార్లు చెప్పినా బుద్ధిరాదు. అధికారం ఉందికదా అవకాశం దొరికితే చాలు, వాడినీ నన్నూ షంటెయ్యడమే. ఆ పక్కింటి అరవావిడనీ ఈ పక్కింటి మార్వాడీ ఆవిడనీ చూసి ఈవిడకూడా అడ్డంగా రెచ్చిపోతోందీమధ్య. అసలీ గయ్యాళిగంపలందరికీ గురువు వాచ్ మేన్ పెళ్ళాం. సాయంత్రం అయితే చాలు వాచ్‌మెన్ మందేసుకురావడం.., ఆ తాగిందంతా దిగేదాకా వాళ్ళావిడ కుమ్మి పారెయ్యడం. దాన్తో పోలిస్తే మా ఫస్ట్ ఫ్లోర్ లేడీసే బెటర్. పిల్లల్నేగానీ మొగుళ్ళని కొట్టరు.

అంతలోనే మరో దెబ్బ వినిపించింది. వాడి ఏడుపు తారస్థాయినించీ ఒక్కసారిగా మంద్రస్థాయికి పడిపోయింది. అంటే అరిచి గీపెట్టి అందర్నీ ఆకర్షించి నవ్వులపాలవ్వడం కంటే కుళ్ళి కుళ్ళి ఏడవడమే మంచిదని వాడికి అర్థమైందన్నమాట. అది ఫాల్స్ ప్రిస్టేజికి ఫుట్ స్టెప్. అంటే పతనానికి ఆరంభం. కానీ ఏం చేస్తాం, ఇంటిగుట్టు రచ్చబండకి ఎక్కించలేం కదా? అందుకే, నేను ఏమైపోయినా పరవాలేదు. కానీ, వాణ్ణి పతనం కానివ్వకూడదు. అంటే, నేను వెంటనే వెళ్ళి వాళ్ళమ్మ బారినించీ వాడిని తప్పించాలి. అందుకే గబగబా నాలుగు చెంబులు నీళ్ళు నెత్తిమీద పోసుకుని, స్నానం అయిందనిపించుకుని బైట పడ్డాను.

అప్పటికే తను గదిలోకి వెళ్ళి తలుపేసుకుంటోంది. ఇది నేను ఊహించని పరిణామం. నా లెక్క ప్రకారం తన బారినుండి తప్పించుకోవడానికి వీడు గదిలోకి దూరాలిగానీ ఆవిడ వెళ్ళి తలుపేసుకోకూడదు.

వాడింకా గట్టిగా ఏడుస్తూ సోఫాలో కూలబడ్డాడు. నాకు పరిస్థితి ఏమాత్రం అర్థం కాలేదు. కానీ అసంకల్పిత ప్రతీకార చర్యగా పరిగెత్తుకుంటూ వెళ్ళి, తను వేస్తున్న తలుపుని తెరిచే ప్రయత్నం చేశాను. లోపల గడియ పెట్టబోతున్నట్టుంది. అంత త్వరగా తెరుచుకో లేదు. నేను బలంగా తోస్తూ తలుపు గడియ పడకుండా ఆపగలిగాను. కానీ ఆ తలుపు తెరుచుకోకుండా తను అడ్డుపడుతోంది. .

నేనొక్కడినీ తలుపుతో తంటాలుపడుతుండటం గమనించాడు మా పునీత్. అందుకే కళ్ళు తుడుచుకుంటూ వచ్చి నాకు సాయం పట్టాడు. ఇద్దరం కలిసి అతి ప్రయత్నం మీద తలుపుని తోస్తే ఏముంది.., తన చెంపలు తనే వాయించుకుంటూ వచ్చి నా గుండెలమీదకి వాలిపోయింది.

అంటే ఇంతవరకూ తను కన్న కలల్ని కల్లలు చేసినందుకు వాడిని శిక్షించడం లేదు.

వాడిమీద పెంచుకోవలసిన ఆశలన్నింటినీ వీడి ర్యాంకు మీద పెంచుకున్నందుకు తనని తానే శిక్షించుకుంటోంది.

(అంకితం: ర్యాంకే విద్యకి పరమావధిగా భ్రమించే అమాయకపు తల్లులందరికీ)

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362





ఆంధ్ర లొయోల ఇంజనీరింగ్ మరియు సాంకేతిక విద్యాసంస్థ, తెలుగు భాషోద్యమ సమాఖ్య ఆధ్వర్యంలో కళాశాలలోని న్యూహాస్టల్ ప్రాంగణంలో ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని 'ఎల్లనాడుల అమ్మనుడుల పండుగ' అత్యంత వైభవంగా జరిగింది. స్వాగతోపన్యాసం రె.ఫా.చిరంజీవి ఇవ్వగా రె.ఫా. రాయప్ప 'మా తెలుగు తల్లి' గీతాన్ని ఆలపించగా, తెలుగుశాఖ విభాగాధిపతి డా.కోలా శేఖర్ సభ ఉద్దేశాన్ని వివరించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన భారతీయభాషా సంఘం జాతీయ అధ్యక్షులు ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మాతృభాషా పరిరక్షణ అంశం జన్యుపరమైన, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక పరమైన అంశమని,తల్లి గర్భం నుండే జన్యుసంబంధంగా మాతృభాషా సంబంధం ఉంటుందని, భౌతిక శరీరనిర్మాణం లాగానే, మనిషికి తన మాతృభాషకు సాంకేతికమైన సంబంధం ఉంటుందని అయన చెప్పారు. మందుల సీసాలపైనా, బిల్లులపైనా వాటి పేర్లు ప్రాంతీయ భాషలో ఉంటేనే వాటిపట్ల ప్రజలకు అవగాహన ఉంటుందని గుర్తుచేశారు. తెలుగు భాషోద్యమ సమాఖ్య జాతీయ అధ్యక్షులు, అమ్మనుడి పత్రిక సంపాదకులు డా.సామల రమేష్‌బాబు ప్రసంగించారు.

సభాధ్యక్షులైన ఆంధ్ర లొయోల కళాశాల ప్రాచార్యులైన రె.ఫా.జి.ఎ.పి. కిషోర్ మాట్లాడుతూ ఆనాటి తూర్పు పాకిస్తాన్‌లో జరిగిన భాషోద్యమాలను గురించి వివరించారు. కళాశాల కరస్పాండెంట్ రె.ఫా. సగయరాజు మాట్లాడుతూ తెలుగు, తమిళ భాషల మధ్యనున్న సోదర భావాన్ని గుర్తుచేశారు. ఆంధ్ర లొయోల ఇంజనీరింగ్ మరియు సాంకేతిక విద్యాసంస్థ ప్రాచార్యులైన ఓబిరెడ్డి మహేష్ రెడ్డి మాట్లాడుతూ రానున్న కాలంలో ఇంజనీరింగ్ చదువు తెలుగు మాధ్యమంలో వస్తుందని సూచించారు. ముఖ్య వక్తలుగా విచ్చేసిన భౌతిక శాస్త్ర విభాగాధిపతి ఆచార్య తుమ్మల శ్రీకుమార్,చరిత్ర విభాగాధిపతి ఆచార్య మొవ్వ శ్రీనివాసరెడ్డి విద్యార్థులకు తగు సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల తెలుగు విభాగ అధ్యాపకులు వి.గోపాలరెడ్డి, నేతాజీ యువ కేంద్రం వ్యవస్థాపకులు లలితకుమారి గారు, కళాశాల యాజమాన్యం, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని సభను విజయవంతం చేసారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో స్ఫూర్తిని కలిగించింది. ఉత్సాహంగా స్పందించారు.

అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly)
MARCH 2021 Vol :7, Issue 1

Date of publication : 1st of every month
Date of posting : 3rd & 6th of every month

RNI-APTEL / 2015/62362
Postal Reg NO. TEN/14/2021-23

If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:9440 448244